

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 293

శుక్రవారం 13-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్ సంక్రాంతి డిస్కౌంట్ సేల్

సంక్రాంతి డిస్కౌంట్ సేల్‌లో వడ్డీగాని, DBD గాని లేకుండా లభించే ఫైనాన్స్ లాభదాయకంగా ఉంది. ముఖ్యంగా మొబైల్స్, ల్యాప్‌టాప్స్ ముందెన్నడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత. అంతే కాకుండా 10% వరకు లభించే క్యాష్‌బ్యాక్ మరియు మార్కెట్‌లో అందరికన్న తక్కువ ధరలలో సోనోవిజన్ సేల్ అందరిని ఆకట్టుకుంటుంది.



తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి శుభాకాంక్షలతో...
సోనోవిజన్ సంక్రాంతి సేల్
LG 190 Cm (75") UHD LED EMI : 3999/-
SAMSUNG 165 Cm (65") QLED EMI : 3990/-
LG 139 Cm (55") OLED EMI : 3999/-
SAMSUNG 139 Cm (55") 4K Smart LED EMI : 1990/-
SONY 138 Cm (55") Ultra HD 4K Anroid EMI : 2995/-
SONY 108 Cm (43") 4K Anroid EMI : 1850/-
LG 108 Cm (43") 4K Smart LED EMI : 1999/-
Panasonic 108 Cm (43") Smart LED EMI : 1459/-
SAMSUNG 80 Cm (32") Smart LED EMI : 990/-
LLOYD 108 Cm (43") Smart LED EMI : 1890/-
TCL 108 Cm (43") Google LED EMI : 2292/-
SONY Sound Bar EMI : 1044/-
LG Side by Side 694 Ltrs Refrigerator FREE Small Refrigerator EMI : 13,540/-
SAMSUNG Side by Side 700 Ltrs Refrigerator EMI : 7234/-
Whirlpool Frost Free Double Door 260 Ltrs Refrigerator EMI : 2223/-
VOLTAS beko Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1050/-
Haier 256 Ltrs BMR Refrigerator EMI : 2267/-
LLOYD Frost Free Double Door 276 Ltrs Refrigerator EMI : 1991/-
Haier Side by Side 682 Ltrs Refrigerator EMI : 5250/-
LLOYD Side by Side 590 Ltrs Refrigerator EMI : 4792/-
SAMSUNG Frost Free Double Door 253 Ltrs Refrigerator EMI : 2079/-
Godrej Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1294/-
LG Direct Cool Single Door 215 Ltrs Refrigerator EMI : 1559/-
Haier Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1025/-
Chest Freezer 230 Ltrs EMI:1700/-
LG Front Load Washing Machine 10.5 KGS EMI : 5667/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS EMI : 3500/-
BOSCH Front Load Washing Machine 6 KGS EMI : 2475/-
IFB WDR Front Load Washing Machine 6 KGS EMI : 2050/-
Whirlpool Front Load Washing Machine 7 KGS EMI : 2667/-
LG Top Load Washing Machine 7.5 KGS EMI : 1542/-
SAMSUNG Top Load Washing Machine 7 KGS EMI : 1559/-
BOSCH Top Load Washing Machine 6.5 KGS EMI : 1459/-
IFB Top Load Washing Machine 6.5 KGS EMI : 1642/-
Whirlpool Top Load Washing Machine 7.0 KGS EMI : 1475/-
LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS EMI : 767/-
LG 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY Starting EMI : 2917/-
SAMSUNG Starting EMI : 2917/-
VOLTAS Starting EMI : 2875/-
LLOYD Starting EMI : 2875/-
HITACHI Starting EMI : 2917/-
DAIKIN Starting EMI : 3250/-
Convection Microwave Oven Rs : 10,800/- Onwards
Microwave Oven Rs : 5800/- Onwards
Chimney Rs : 7100/- Onwards
2 Burner Glass Manual Gas Stove Rs : 2700/- Onwards
Water Dispenser Rs : 8200/- Onwards
Water Purifier RO Rs : 13200/- Onwards
Water Geyser Rs : 3300/- Onwards
Wet Grinder Rs : 3200/- Onwards
Rice Cooker Rs : 1700/- Onwards
Mixer Rs : 2700/- Onwards
* T & C Apply
LG SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton orient KEELINE AOSmith vivo oppo iPhone ONEPLUS ONIDA mi morphyrichards
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ తో...
సోనోవిజన్ సంక్రాంతి సేల్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 293

శుక్రవారం 13-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



సంప్రదించండి: 040 - 4753 5555
vijay sales
Shop On www.vijaysales.com
సంక్రాంతి వేడుకలు!
ఆఫర్ 4 రోజులు మాత్రమే...
త్వరపడండి!
32 SMART LED TV 65% Savings
PRICE ₹32,000/-
OFFER PRICE ₹10,990/-
43 SMART LED TV 58% Savings
PRICE ₹50,000/-
OFFER PRICE ₹20,990/-
50 4K UHD LED TV 50% Savings
PRICE ₹64,990/-
OFFER PRICE ₹32,000/-
Fully Automatic Front Load 8 KG
PRICE ₹59,990/-
OFFER PRICE ₹28,990/-
52% Savings
ఫ్లాట్ 50%* తగ్గింపు
*ఎంపిక చేసిన బ్రాండ్స్ మరియు మోడల్స్‌పై
Direct Cool 192 Ltr.
PRICE ₹23,600/-
OFFER PRICE ₹11,890/-
50% Savings
Frost Free 252 Ltr.
PRICE ₹39,500/-
OFFER PRICE ₹19,490/-
51% Savings
Frost Free 340Ltr.
PRICE ₹71,300/-
OFFER PRICE ₹34,890/-
51% Savings
Side by Side 565 Ltr.
PRICE ₹1,27,000/-
OFFER PRICE ₹59,990/-
53% Savings
Fully Automatic Front Load 7 KG
PRICE ₹45,990/-
OFFER PRICE ₹22,990/-
50% Savings
DELL
INSPIRON 3000
Get Dell 2 Years' Additional Warranty @ ₹1 Worth ₹4,200/-
On select models
hp
• On Select Omen/Spectre/Envy Get Up To ₹10,000/- Cashback
• On Select HP 14&15/Pavilion/Victus/Envy Get Up To ₹5,000/- Cashback
Also Get Up To ₹14,000/- Exchange Bonus On Select Laptops
*T&C – Offers applicable on Select Banks CC/DC EMI transactions.
Lenovo
LEGION GAMING, SLIM 5, FLEX 5 & YOGA SERIES
5% Cashback Up To ₹ 5,000/- On Select Bank Cards (CC / DC)
Avail 3|0, 6|0, EMI on Select Bank Cards (CC / DC)
iPhone 13 (128GB)
PRICE ₹65,900/-
Instant Cashback ₹2,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹6,000
Effective Price ₹42,900*/-
(Price inclusive of offer)
realme
REALME C21Y 3GB | 32GB
SPECIAL PRICE ₹8,799/-
oppo
OPPO F21S Pro 8GB | 128GB
10% Cashback Up To ₹2,000/- Leading Banks
VSP ₹21,999/-
vivo
VIVO V25 5G 8GB | 128GB
Cashback Up To ₹2,000/- Leading Banks
VSP ₹27,999/-
mi
REDMI Note 12 5G 6GB | 128GB
Cashback Up To ₹1,500/- ICICI Bank CC/DC
New Arrival
EFFECTIVE PRICE ₹18,499/-
SAMSUNG
GALAXY FOLD 4 5G 12GB | 256GB
Get GALAXY Watch 4 Classic 46MM BT @ ₹2,999/- + ₹8,000/- Cashback*
VSP ₹1,54,999/-
Smart Watches Starting ₹1,399/-
UP TO 80% OFF On Accessories
JBL 2.1 Ch Soundbar Cinema SB 140
UP TO 40% OFF
1.5 T 3 Star Inverter AC
OFFER PRICE ₹26,990/-
Small Appliances UP TO 50% OFF
Up To ₹7,500/- Instant Discount On Bank Cards
AU SMALL FINANCE BANK
Bank of Baroda Credit Card
HSBC
one card
IDFC FIRST Bank
Credit & Debit Cards
Scan to Shop Online
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్: విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | హైదరాబాద్ | వరంగల్ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
మీ దగ్గరలోని ఏదైనా మా 'షోరూమ్'ను నేడే సందర్శించండి:
కాకినాడ: అపోలో హాస్పిటల్ పక్కన, మెయిన్ రోడ్, సూర్యారావుపేట, శివ కుమార్ - 73373 76220
పటమట (విజయవాడ): NTR సర్కిల్ పక్కన, రజనీ కుమార్ – 96665 03755
రాజమండ్రి: సాయి కృష్ణ థియేటర్ ఎదురుగా, ఇన్నీస్ పేట, సతీష్ – 88866 74548
రాజమండ్రి: జే ఎన్ రోడ్: సితార రెస్టారెంట్ ఎదురుగా, గౌతమ్ – 91549 03693
తిరుపతి: లీలా మహల్ సెంటర్- పీఎస్ 4 రెస్టారెంట్ ప్రక్కన, కిరణ్ రాజు– 99482 28111
తిరుపతి: ఎమ్ ఆర్ పల్లి సర్కిల్, వేణు – 99480 30111
విజయవాడ: సూర్య టవర్స్, ఫార్చ్యూన్ మురళి పార్క్ హోటల్ పక్కన, ఈశ్వర్ – 88866 53042
విశాఖపట్నం: 48వ నెంబర్ బస్ స్టాప్ ఎదురుగా, దొండపర్తి, రమేష్ – 99482 41112
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. *Processing Fee is applicable as per Financier.
For Paper Finance: Please bring Adhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transaction slabs defined by Finance Com Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank.
For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 293

శుక్రవారం 13-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఈడెన్‌లోనే సిరీస్ సొంతం

రెండో వన్డేలోనూ శ్రీలంకపై భారత్ విజయం.. రాణించిన కుల్దీప్ -11లో



మస్క్.. టెస్లాకు 'ట్విట్టర్' షాక్!

ఏడాదిలో షేరు 70% కుదేలు.. మస్క్ సంపద 188 బిలియన్ డాలర్ల డౌన్ -11లో



సంక్షోభంలో ప్రపంచం

ప్రపంచం మొత్తం సంక్షోభంలో ఉందని.. ఈ అనిశ్చితి ఎంతకాలం ఉంటుందో చెప్పడం కష్టమని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



'అరవణ' విక్రయాలు నిలిపేయండి

శబరిమలలో అరవణ ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డును కేరళ హైకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



ఎయిర్‌పోర్ట్‌లో 'యురేనియం'

లండన్‌లోని హీత్రో ఎయిర్‌పోర్టులో యురేనియం పార్సిల్ కలకలం సృష్టించింది. ఇది పాకిస్తాన్ నుంచి వచ్చినట్లు వార్తలొచ్చాయి.

వివరాలు 6లో ▸



మరో చోటా రహస్య పత్రాలు!

అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు చెందిన మరో ప్రాంతంలోనూ తాజాగా రహస్య డాక్యుమెంట్లను కనుగొన్నారని ప్రచారం జరుగుతోంది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

దూసుకొచ్చిన మృత్యువు



పొలం పనికి వచ్చి రోడ్డు వెంబడి కూర్చుని భోజనం చేస్తున్న రైతు, కూలీపై నుంచి టిప్పర్ లారీ దూసుకెళ్లింది. దీంతో ఇద్దరూ మృతిచెందారు. టిప్పర్ పల్టీ కొట్టడంతో.. డ్రైవర్ కూడా మరణించాడు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా గొరిగనూరులో జరిగింది.

వివరాలు 2 ▸

'దసపల్లా' కథనాలపై పరువునష్టం దావా



దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు దసపల్లా భూములు ప్రభుత్వానివి కావని తీర్పులిచ్చాక కూడా.. తప్పుడు కథనాలు రాస్తున్నందున 'ఈనాడు'పై పరువునష్టం దావా వేస్తున్నట్లు రాణి కమలాదేవి, ఆమె కుమారుడు, విశాఖ జిల్లా కలెక్టర్ తెలిపారు.

వివరాలు 8 ▸

పెట్టుబడులపై ఫోకస్

విశాఖ వేదికగా త్వరలో రెండు కీలక సదస్సులు

జీఐఎస్, జీ 20 సమావేశాలపై ముఖ్యమంత్రి జగన్ ఉన్నతస్థాయి సమీక్ష

- వాస్తవిక పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు
- ఇథనాల్‌తోపాటు కొత్తతరం ఉత్పత్తుల తయారీకి ఏపీ వేదికగా నిలవాలి
- రాష్ట్రంలో పెట్టుబడులకున్న అపార అవకాశాలను సమగ్రంగా వివరించాలి
- విదేశీ రోడ్‌షోల్లో పారిశ్రామికవాడలు, ఎంఎస్‌ఎంఈలను పరిశీలించాలి
- రాష్ట్రంలో మరింత మెరుగ్గా వీటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలి
- 2014–19 మధ్య సదస్సుల్లో రూ.18.87 లక్షల కోట్లకు ఎంఓయూలు
- అనామకులకు సూట్లూబూట్లూ తొడిగి మరీ ఒప్పందాలు చేసుకున్నారు
- అందుకే ఆ ఎంఓయూల్లో 10 శాతం కూడా సాకారం కాలేదు
- ఆ ఐదేళ్లలో వాస్తవ పెట్టుబడులు సగటున రూ.11,994 కోట్లు మాత్రమే
- 2019 తర్వాత మూడేళ్లలో ఏటా సగటున రూ.15,693 కోట్ల పెట్టుబడులు
- జీ 20 కోసం సర్వాంగ సుందరంగా విశాఖపట్నం



లేపాక్షి ఉత్పత్తులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కొత్తతరం ఉత్పత్తుల తయారీకి రాష్ట్రం వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. విశాఖ వేదికగా మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు (జీఐఎస్), జీ20 దేశాల సదస్సులు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు, పెట్టుబడులను ఆకర్షించడంపై అధికార యంత్రాంగంతో గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్

మిగతా 2వ పేజీలో ▶

టూరిస్ట్ పోలీసింగ్

విశాఖ ఆర్‌కే బీచ్‌లో త్వరలో ప్రారంభం.. అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం

7 లో



శరద్ యాదవ్ కన్నుమూత

సీనియర్ రాజకీయవేత్త, లోక్‌తాంత్రిక్ జనతా దళ్(ఎల్‌జేడీ) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ తుదిశ్వాస విడిచారు. 75 ఏళ్ల శరద్ యాదవ్ గుర్గావ్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె సుభాషిణి ధ్రువీకరించారు. శరద్ యాదవ్ మొత్తం పది సార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు.

- వివరాలు 6లో

నమ్మకంలేకే పొత్తుకెళ్తున్నా..



- మనకు గౌరవం తగ్గకుండా కుదిరితేనే.. లేదంటే ఒంటరిగానే
- జనం వస్తున్నారు.. కానీ ఓట్లు వేయడంలేదు
- నవరత్నాలు వంటి ప్రభుత్వ పథకాలకు ఓట్లు వెయ్యొద్దు
- నన్ను ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు అంటే చెప్పుతీసి కొడతా
- వారాహి యాత్రను ప్రారంభిస్తా.. ఎవరు అడ్డుకుంటారో చూస్తా
- యువశక్తి సభలో పవన్‌కళ్యాణ్

8 లో

ఇది చెప్పడానికే సభ పెట్టావా?



- నువ్వు చేసేది రాజకీయ వ్యభిచారం కాక మరేమిటి?
- పూటకో పార్టీతో మూడు ముక్కల రాజకీయం నీదే
- వ్యవహారిక భాషలో పవన్ తిరుగుబోతు.. నీ వేదికపై నువ్వు చెప్పిన రజక, నాయీ బ్రాహ్మణ కులాల వారేరి?
- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై మాజీమంత్రి పేర్ని నాని ధ్వజం

8 లో

శతఘ్ని దళాల్లోకి మహిళా అధికారులు

- ప్రతిపాదనలను కేంద్రానికి పంపించాం
- ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే వెల్లడి

6 లో

వైద్య రంగానికి దిక్సూచి.. మెడ్‌టెక్ జోన్

- ప్రపంచ స్థాయి సంస్థలకు కేరాఫ్‌గా మారిన జోన్.. క్యూ కడుతున్న వైద్య సంస్థలు
- వైద్య రంగంలో ప్రపంచంలోనే మొట్టమొదటి డేటా సెంటర్ ఇక్కడే ఏర్పాటు
- 2 రోజుల క్రితం ప్రపంచస్థాయి గామా రేడియేషన్ సెంటర్ ప్రారంభం
- ఎమ్మారై సహా అత్యాధునిక వైద్య పరికరాల తయారీ

2 లో

క్లుప్తంగా...

స్వామి వివేకానందకు సీఎం ఘన నివాళి



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

వివేకానందుని మాటలు స్ఫూర్తిదాయకం..

యువతకు సీఎం వైఎస్ జగన్ యువజనోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'యువత దేశానికి వెన్నెముక, వారు సాధించలేనిది ఏదీ లేదు' అన్న స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధనలో అంకిత భావంతో మనమందరం ముందడుగులు వేయాలి. జాతీయ యువజనోత్సవం సందర్భంగా యువత అందరికీ శుభాకాంక్షలు' అంటూ సీఎం గురువారం ట్వీట్ చేశారు.

సీఎంను కలిసిన కేంద్ర ప్రభుత్వ అధికారులు




సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ని కేంద్రంలో పనిచేస్తోన్న సీనియర్ ఐఏఎస్ అధికారులు వి.శ్రీనివాస్, ఎన్.బి.ఎస్.రాజ్‌పుత్ గౌరవపూర్వకంగా కలిశారు. వీరు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జీఏడి స్పెషల్ సీఎస్ కే. ప్రవీణ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

'ఆప్కోను ప్రోత్సహించి చేనేతను ఆదుకోండి'

సాక్షి, అమరావతి: ఆప్కో వస్త్రాల కొనుగోలుతో ప్రోత్సహించి చేనేత రంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ఆప్కో షోరూంను ఆయన గురువారం ప్రారంభించారు. ఏపీలో చేనేత రంగానికి ఊతమిచ్చేలా సీఎం వైఎస్ జగన్ నేతన్న నేస్తం వంటి పథకాన్ని అందిస్తున్నారని చెప్పారు. చేనేత రంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహిస్తే చేనేత కార్మికులకు ఉపాధి మెరుగుపడి, చేనేత కళ పదిలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఆప్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

19న వేమన జయంతి



మల్లికార్జునరావు గీసిన యోగి వేమన చిత్రం

సాక్షి, అమరావతి: తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తన కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేసిన కవి యోగి వేమన జయంతి వేడుకలను ఈ నెల 19వ తేదీన తొలిసారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. సత్యసాయి జిల్లా కటారుపల్లెలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు తెలిపారు. మల్లికార్జునరావు స్వయంగా గీసిన వేమన చిత్రపటాన్ని గురువారం ఆవిష్కరించి 19న నిర్వహించనున్న కార్యక్రమం వివరాలను వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా కటారుపల్లెలో నిర్మించిన వేమన విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వేమన జీవితానికి, ఆయన బోధనలకు, జ్ఞానాన్ని పొందిన విధానానికి రూపం ఇస్తూ తాను చిత్రాన్ని గీశానని, దానిని ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. సమాజంలోని మూఢనమ్మకాలను వేమన తన కవిత్వంతో ఖండించి ప్రజలను చైతన్యం చేశారన్నారు.

స్టాంపుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్టాంపు వెండర్ దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గురువారం దాడులు చేశారు. వివిధ జిల్లాల్లోని 128 స్టాంపు వెండర్ దుకాణాల్లో తనిఖీలు చేసి వాటిని ఏ ధరకు విక్రయిస్తున్నారో పరిశీలించారు. పలు అక్రమాలను గుర్తించారు. అందుబాటులో ఉన్న స్టాంపుపేపర్ల వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించకపోవడం, వాటిని విక్రయిస్తున్నప్పుడు కొనుగోలుదారుల సంతకాలు తీసుకోకపోవడం, స్టాంపు పేపర్ల ముఖ విలువకంటే రూ.10 చొప్పున అధిక ధరకు విక్రయించడం మొదలైన అక్రమాలను గుర్తించినట్టు విజిలెన్స్ విభాగం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. తాము గుర్తించిన అక్రమాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు పేర్కొంది.

వైద్య రంగానికి దిక్సూచి.. మెడ్‌టెక్ జోన్

ప్రపంచ స్థాయి సంస్థలకు కేరాఫ్‌గా మారిన జోన్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్.. వైద్య ఉపకరణాల తయారీలో అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన ఈ సంస్థ.. ఇప్పుడు ప్రపంచస్థాయి ఆవిష్కరణలకు, సంస్థలకు కూడా కేరాఫ్‌గా మారింది. వైద్య రంగానికే దిక్సూచిలా మారుతోంది. కోవిడ్ సమయంలో ర్యాపిడ్ టెస్ట్ కిట్స్‌ని తయారు చేసి ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న మెడ్ టెక్ జోన్ అదే జోరును కొనసాగిస్తోంది. వైద్య రంగంలో ప్రపంచంలోనే మొట్టమొదటి డేటా సెంటర్ ఇటీవల ఇక్కడ ప్రారంభమైంది. రెండు రోజుల క్రితం ప్రపంచస్థాయి గామా రేడియేషన్ సెంటర్ కూడా ప్రారంభమైంది. ఇలాంటి విప్లవాత్మక సంస్థలు ఎన్నో ఈ జోన్‌లో చోటు కోసం క్యూ కడుతున్నాయి.

కరోనాను ఎదుర్కోవడంలో..

కరోనా వైరస్ విజృంభించిన సమయంలో ఆ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన కిట్లు, ఉపకరణాలను మెడ్‌టెక్ జోన్ అందించింది. ర్యాపిడ్ టెస్ట్ కిట్లని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత మోల్బియో డయాగ్నోస్టిక్స్ కిట్లు, వెంటిలేటర్లు, థర్మల్ స్కానర్ల ఉత్పత్తి చేపట్టింది. ప్రపంచ దేశాలకు అవసరమైన పలు ఉపకరణాలను అందించింది. ప్రతి రోజూ 100 వెంటిలేటర్లు, 500 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, 10 లక్షల ఆర్‌టీపీసీఆర్ కిట్లు తయారు చేసేది. దీంతో ప్రపంచం దృష్టి మెడ్‌టెక్ జోన్‌పై పడింది.



ప్రపంచస్థాయి గామా రేడియేషన్ సెంటర్

అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) మార్గదర్శకాల మేరకు మెడ్ టెక్‌లో ప్రపంచస్థాయి గామా రేడియేషన్ సెంటర్‌ని రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక రేడియేషన్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. వైద్యం, వ్యవసాయం, సీ ఫుడ్‌లో నాణ్యమైన ఎగుమతులకు గామా రేడియేషన్ సేవల కేంద్రం ఉపయోగపడుతుంది. ఇందుకోసం కోబాల్ట్–60ని ఉపయోగించనున్నట్లు మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు.

పరిశోధనలు, ఆవిష్కరణలు: ప్రస్తుతం మెడ్‌టెక్ జోన్‌లో 100 సంస్థలు వైద్య పరికరాల ఉత్పత్తి, పరిశోధనలు చేపడుతున్నాయి. ఎప్పటికప్పుడు అత్యాధునిక వైద్యానికి అవసరమైన పరికరాలు, ఉత్పత్తుల్ని తయారు చేయడంలో ప్రపంచంలోనే ఈ జోన్ ముందు వరసలో నిలుస్తోంది. ఎమ్మారై పరికరాల్లో ఉపయోగించే మాగ్నెట్స్‌లో అత్యుత్తమ ఫలితాల్ని తక్కువ కాలంలోనే అందించేలా సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని ఇటీవలే తయారు చేసింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1.5 టెస్లా ఎమ్మారై కండక్టింగ్ మాగ్నెట్స్‌ని మాత్రమే వినియోగిస్తున్నారు. ఇక్కడ మాత్రం మరింత శక్తివంతమైన సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని తయారు చేస్తున్నారు. ఎమ్మారైని తయారు చేసే సంస్థకు ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తుండటం విశేషం. మరోవైపు.. దేశవ్యాప్తంగా ఆస్పత్రులు, గ్రామీణ కేంద్రాలకు టెలీ రేడియాలజీ సేవలు అందించేందుకు టెలీ రేడియాలజీ సొల్యూషన్స్ (టీఆర్ఎస్) కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. దీని ద్వారా 70 శాతానికిపైగా గ్రామీణ ప్రాంత ప్రజలు రేడియాలజీ సేవల కోసం పట్టణాలు, నగరాలకు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు.



దిగుమతుల నుంచి ఎగుమతులకు..

గతంలో భారత్.. ఏటా రూ.50 వేల కోట్ల విలువైన వైద్య పరికరాలు దిగుమతి చేసుకునేది. ఎప్పుడైతే.. ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో ఉపకరణాల ఉత్పత్తి జోరందుకుందో.. ఈ పరిస్థితి మారిపోయింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే కోట్లాది రూపాయల విలువైన అత్యాధునిక యంత్రాలు ఇక్కడే తయారవుతున్నాయి. ఎమ్మారై యంత్రాలను దిగుమతి చేసుకోవాలంటే రూ.4.5 కోట్లు ఖర్చవుతుంది. మెడ్‌టెక్‌లో కేవలం రూ.98 లక్షలకే వీటిని తయారు చేస్తున్నారు. దీనివల్ల అత్యాధునిక ఎమ్మారై స్కానర్లు తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఒక్కో యంత్రానికి దాదాపు రూ.3.5 కోట్లు ఆదా అవుతుంది. తద్వారా ఎంతో విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. మరిన్ని ఆస్పత్రులు ఎమ్మారై యంత్రాలను ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు కలిగింది.

ప్రపంచంలోనే తొలిసారిగా.. హెల్త్ క్లౌడ్

వైద్య పరికరాల పరిశ్రమల అవసరాల్ని తీర్చేందుకు డేటా సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా మెడ్‌టెక్ జోన్ మరో అడుగు ముందుకు వేసింది. రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్ టెల్ కార్పొరేషన్‌తో కలిసి కొద్ది నెలల క్రితం ప్రపంచంలోనే తొలిసారిగా వైద్య రంగానికి సంబంధించి హెల్త్ క్లౌడ్‌ని రూపొందించింది. డిజిటల్ ఆరోగ్య సేవలు, ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్ అలయన్స్, రేడియాలజీ ఇమేజింగ్ సర్వీసులు, హెల్త్ డిజిటల్ డేటా.. ఇలా భిన్నమైన ఆరోగ్య సేవల్ని అనుసంధానించేలా డేటా సెంటర్ ఏర్పాటు చేయడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి. ఈ డేటా సెంటర్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు హెల్త్ కేర్ సౌకర్యాలు అందనున్నాయి. ప్రస్తుతం ఈ హెల్త్ క్లౌడ్ అభివృద్ధి దశలో ఉంది. త్వరలోనే పూర్తిస్థాయి సేవలు అందనున్నాయి.

ఎంఎస్ఎంఈతో ఒప్పందం

ఆరోగ్య రంగంలో సహకారం కోసం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ ఆధీనంలో ఉన్న ఎంఎస్ఎంఈతోనూ మెడ్‌టెక్ జోన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆరోగ్య రంగంలోని ఎంఎస్ఎంఈల మధ్య పోటీతత్వం పెంచేందుకు ఈ ఒప్పందం ఉపయుక్తం కానుంది. ఇలా.. విభిన్న రీతుల్లో విప్లవాత్మకమైన వైద్య పరికరాల్ని ప్రపంచానికి అందించేలా.. వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు మెడ్‌టెక్ జోన్ కృషి చేస్తోంది.

పెట్టుబడులపై ఫోకస్



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మార్చి 3, 4వతేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, మార్చి 28, 29 తేదీల్లో జీ 20 దేశాల సమావేశాలు విశాఖపట్నంలో జరగనున్నాయి. వాస్తవిక పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్ (జీఐఎస్) సదస్సు సాగాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను సమగ్రంగా వివరించేలా సదస్సులో కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కొత్త తరహా ఇంధనాల తయారీతో పాటు ప్రపంచవ్యాప్తంగా నవతరం ఉత్పత్తుల తయారీకి ఏపీ వేదికగా నిలవాలని, దీనికి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఊతం ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని దిశా నిర్దేశం చేశారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సందర్భంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వివిధ దేశాల్లో రోడ్ షోలను నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానిక పారిశ్రామిక వాడలు, నిర్వహణ తీరును పరిశీలించి అంతకంటే మెరుగ్గా అమలు చేసేలా అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. ఆయా దేశాల్లో ఎంఎస్ఎంఈల నిర్వహణ తీరును పరిశీలించి రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

నాడు లక్షల కోట్ల ఒప్పందాలు.. వచ్చింది వేల కోట్లే

రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వివరాలను సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించారు. గత సర్కారు హయాంలో 2014 – 19 మధ్య రూ.18.87 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగితే వాటిలో 10 శాతం కూడా సాకారం కాలేదని, అనామకులకు సూట్లుబూట్లు తొడిగి ఒప్పందాలు చేసుకోవటంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అప్పట్లో ఏటా సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు మాత్రమే వాస్తవ రూపంలోకి వచ్చినట్లు వివరించారు. ఇప్పుడు 2019 – 22 మధ్య ఏడాదికి సగటున రూ.15,693 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి రూ.1,81,821 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని, ప్రస్తుతం వీటి పనులు వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చడం ద్వారా 1,40,903 మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.

సుందర విశాఖ.. శాశ్వత సదుపాయాలు


జీ 20 సమావేశాలకు ఆతిథ్యం ఇస్తున్న విశాఖ నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. రహదారులు, ప్రధాన జంక్షన్లు, బీచ్ రోడ్లల్లో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. సుందరీకరణ పనులను కేవలం ఈ సమావేశాల కోసం కాకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు

సమీక్షలో ఉప ముఖ్యమంత్రి (గిరిజన సంక్షేమశాఖ) పీడిక రాజన్నదొర, ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు, హోంశాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రహదారులు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా), బీసీ సంక్షేమం, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఇటు ఆతిథ్యం.. అటు అవకాశాలు

విశాఖ వేదికగా మార్చి 28, 29వ తేదీల్లో జీ 20 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరగనున్నాయి. సుమారు 250 మందికిపైగా విదేశీ ప్రతినిధులు, 100 మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు వీటికి హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జీ 20 దేశాల నుంచి ఆరుగురు చొప్పున ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల నుంచి నలుగురు చొప్పున అతిథులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో అతిథులందరికీ చక్కటి ఆతిథ్యంతోపాటు రవాణా తదితర ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక ప్రదేశాల సందర్శన సమయంలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా మంచి ఏర్పాట్లు చేయాలని, ఆయా చోట్ల ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినిధులకు భద్రత విషయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. జీ 20 దేశాల సదస్సు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ ప్రతినిధులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులకు సౌలభ్యంగా ఉండేందుకు మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.



మిలమిల.. జగనన్న కాలనీ ఇలా..

పేదలందరికీ పక్కా ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న కాలనీలు క్రమంగా కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని ఇడుపూరు వద్ద 88 ఎకరాల విస్తీర్ణంలోని జగనన్న కాలనీలో పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు 3 వేల గృహాల నిర్మాణాలు వివిధ దశలలో ఉండగా.. ప్రభుత్వం రూ.3 కోట్లతో విద్యుదీకరణ పనులు పూర్తి చేసింది. ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి.. వీధి లైట్లు ఏర్పాటు చేయటంతో ఆ ప్రాంతమంతా జిగేల్‌మంటూ మెరిసిపోతోంది. - మార్కాపురం

సీఎంను కలిసిన సోమేశ్‌కుమార్

- హైకోర్టు తీర్పు, డీఓపీటీ ఆదేశాల మేరకు ఏపీ కేడర్‌కు వచ్చిన తెలంగాణ సీఎస్

సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/గన్నవరం: హైకోర్టు తీర్పుతోపాటు డీఓపీటీ ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి రిలీవ్ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్‌కుమార్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ కేడర్‌కు చెందిన సోమేశ్‌కుమార్ తెలంగాణలో పనిచేయడం కుదరదని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో డీఓపీటీ కూడా సోమేశ్‌కుమార్ వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయన గురువారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డిని విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో కలిసి రిపోర్ట్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. సోమేశ్‌కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం.. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈఓ భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సోమేశ్‌కుమార్

ఏ బాధ్యతలిచ్చినా ఓకే..

ఇక ఏపీ ప్రభుత్వం ఎటువంటి బాధ్యతలు అప్పగించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ గన్నవరం విమానాశ్రయంలో మీడియాకు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

అన్నం తింటున్న రైతు, కూలీపై దూసుకెళ్లిన టిప్పర్.. ఇద్దరి మృతి

పల్టీ కొట్టిన టిప్పర్... డ్రైవర్ కూడా మృతి

డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం జరిగిందని పోలీసుల అంచనా



ఓబులేసు (ఫైల్)



సుబ్బారెడ్డి (ఫైల్)



డ్రైవర్ విజయ్‌కుమార్ (ఫైల్)

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్: ఉదయాన్నే పొలం పనికి వచ్చి విరామ సమయంలో రోడ్డు వెంబడి కూర్చుని అన్నం తింటున్న రైతు, కూలీపై నుంచి టిప్పర్ లారీ దూసుకువెళ్లడంతో ఇద్దరూ మృతిచెందారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ పల్టీ కొట్టడంతో డ్రైవర్ కూడా మరణించాడు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం గొరిగనూరు గ్రామంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. గొరిగనూరు గ్రామానికి చెందిన రైతు ఎనముల నాగసుబ్బారెడ్డి పొలంలో పని కోసం ఉదయం వ్యవసాయ కూలీలు వచ్చారు. కొద్దిసేపు పనిచేసిన తర్వాత ఎనిమిది మంది తమ వెంట తెచ్చుకున్న సద్దిమూటలు విప్పి అన్నం తినడానికి రోడ్డు పక్కన కూర్చున్నారు. ఆరుగురు కూలీలు అన్నం తినేసి మళ్లీ పనిలోకి వెళ్లారు. పొలం యజమాని ఎనముల నాగసుబ్బారెడ్డి(67), ధర్మాపురం గ్రామానికి చెందిన ఎనగలూరు ఓబులేసు(55) అనే కూలీ అన్నం తింటుండగా... జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపునకు వెళుతున్న టిప్పర్ వేగంగా వారి మీదుగా దూసుకువెళ్లింది. దీంతో వారి శరీరాలు ఛిద్రమయ్యాయి. ఇద్దరూ ఘటనాస్థలంలోనే మరణించారు. ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ విజయ్‌కుమార్(58) వేగాన్ని నియంత్రించలేకపోవడంతో అది పల్టీలు కొట్టి పొలంలో పడిపోయింది. డ్రైవర్ కూడా సీటు కింద నలిగిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. మృతులు సుబ్బారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలు.. ఓబులేసుకు భార్య, ఇద్దరు పిల్లలు, డ్రైవర్ విజయ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ నాగరాజు పరిశీలించారు. డ్రైవర్ విజయ్‌కుమార్‌కు ఫిట్స్‌తోపాటు లోబీపీ ఉన్నట్లు తెలుసుకున్నారు. డ్రైవర్ నోట్లో నురగ రావడంతో ఫిట్స్ వచ్చినందువల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతిచెందిన ఓబులేసు, నాగసుబ్బారెడ్డి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు.

ధర్నాకు దిగిన బాధిత కుటుంబాలు

దేవగుడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టిప్పర్‌ను మరొకరి వద్ద కొనుగోలు చేశాడు. టిప్పర్‌కు సంబంధించిన రికార్డులను తన పేరు మీద మార్చుకోకపోవడంతో పాటు ఇన్సూరెన్సు కూడా రెన్యూవల్ చేయించలేదు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్‌కు ఉన్న నంబర్ ప్లేట్‌ను తొలగించేశారు. దీంతో బాధిత కుటుంబాలు తమకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై ధర్నాకు దిగారు. వీరికి మద్దతుగా సమీపంలోని ధర్మాపురం, గొరిగనూరు గ్రామాల మహిళలు స్వచ్ఛందంగా వచ్చి రోడ్డుపై బైఠాయించారు. రెండున్నర గంటలపాటు జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి బాధితులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా గొరిగనూరులో టిప్పర్ లారీ దూసుకెళ్లిన ఘటనలో ఓ రైతు, కూలీ మృతి చెందడం పట్ల సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు

- ప్రభుత్వ వాహనాలపై అధికారుల హోదాతో కూడిన బోర్డులు తొలగించండి
- ప్రమాదాలకు ఆస్కారమున్న కూడళ్లలో సీసీ కెమెరాలు ఉండాలి
- సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్నిరకాల వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన రోడ్ సేఫ్టీ ఫండ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన వాహనాలు కొనుగోలు చేసే వారికి సంబంధిత డీలర్లు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లతో వాహనాలను అందించేలా చూడాలన్నారు. పాత వాహనదారులు కూడా నిర్దిష్ట వ్యవధిలోగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ వాహనాలపై అధికారుల హోదాతో కూడిన నేమ్ బోర్డులు ఉంటున్నాయని, ఆ విధంగా చేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వ వాహనం అని మాత్రమే ఉండాలన్నారు.

రేడియం టేప్ అతికించాలి

ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని రవాణా, అద్దె వాహనాలు, బస్సులు, ట్రాక్టర్లు, ట్రక్కులు వంటి వాహనాల వెనుక భాగంలో విధిగా రేడియం టేప్ అతికించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలున్న అన్ని ముఖ్య కూడళ్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించాలని రవాణా, పోలీస్ శాఖలను ఆదేశించారు. ఆర్ అండ్ బీ కార్యదర్శి ప్రద్యుమ్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అజెండా అంశాలను వివరించారు. 15 ఏళ్ల దాటిన పాత వాహనాలు స్క్రాపింగ్ చేసేందుకు వీలుగా స్క్రాపింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల్లో ఆటోమేషన్ ఆఫ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్ సివిల్ పనుల ప్రతిపాదనలకు కమిటీ ఆమోదించింది. కొన్ని జిల్లాల్లో ఈ ట్రాక్స్ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్‌గుప్త, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, అదనపు డీజీపీ (రోడ్డు సేఫ్టీ) కృపానంద త్రిపాఠి ఉజేల, రవాణా శాఖ అదనపు కమిషనర్ ఎస్ఏవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చెప్పడానికి తగిన మాటలు మనకు దొరకనప్పటికీ, అల్లాహ్ మన ప్రార్థనలను అర్థం చేసుకొంటాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, జనవరి, 13

ప్రజాస్వామ్య పరిహాస క్రీడ

కింద పడ్డా పైచేయి నాదే అనడమంటే ఇదే. బ్రెజిల్‌లో ఎన్నికల తుది ఫలితాలొచ్చి రెండున్నర నెలలైనా వాటిలో మతలబు ఉందంటున్న తాజా మాజీ దేశాధ్యక్షుడు జైర్ బోల్సనారో మాటలు, ఆయన మద్దతుదారుల చేష్టలు అచ్చంగా అలాగే ఉన్నాయి. ఆ దేశ రాజధాని బ్రసీలియాలోనే సైనిక శిబిరాల సమీపంలో మకాం వేసిన బోల్సనారో భక్తులు సైనిక జోక్యంతోనైనా కొత్త దేశాధ్యక్షుడైన వామపక్ష లూలాను పదవి నుంచి తప్పించాలని పట్టుబట్టడం విడ్డూరం. పది వారాలైనా ఫలితం లేక వందల మంది జనవరి 8వ తేదీ ఆదివారం విధ్వంసానికి దిగిన దృశ్యాలు నివ్వెరపరుస్తున్నాయి.

ఎన్నికల ప్రక్రియపై బురద జల్లి, ప్రజాస్వామ్యానికి పాతర వేసే ప్రయత్నాలు ఆందోళనకరం. సరిగ్గా రెండేళ్ళ క్రితం అధ్యక్ష ఎన్నికల అనంతరం అమెరికాలో జరిగిన పరిణామాలను బ్రెజిల్‌లోని తాజా దాడులు గుర్తుచేస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి పాలైనప్పుడు 2021 జనవరి 6న ఆయన మద్దతుదారులు ఇలాగే వ్యవహరించారు. వాషింగ్టన్‌లోని ఆ దేశ పార్లమెంట్ భవనంపై వారు దాడికి దిగితే, తాజాగా బ్రెజిల్‌లో బోల్సనారో సమర్థకులు అధ్యక్ష భవనం, పార్ల మెంట్ భవనం, సుప్రీమ్ కోర్ట్‌లలో చొరబడి, విధ్వంసం సృష్టించారు. ఓటమి పాలయ్యాక జనం లోకి రాకుండా కాలక్షేపం చేస్తున్న బోల్సనారో జనవరి 1న లూలా పదవీ ప్రమాణానికి రెండు రోజుల ముందే అమెరికాకు చెక్కేశారు. కొత్త దేశాధ్యక్షుడికి దండాన్ని అందించే సంప్రదాయాన్నైనా పాటించక ముఖం చాటేయడం ఆయన మనోభావాలకీ, వాస్తవ నిరాకరణ దృక్పథానికీ అద్దం.

గత అక్టోబర్ 30న ముగిసిన బ్రెజిల్ ఎన్నికల్లో అతివాద ఛాందస నాయకుడు, అప్పటి దేశాధ్య క్షుడు బోల్సనారో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. దేశానికి మరోసారి ఘనకీర్తి కట్టబెడతానని ఎన్నికల వేళ వాగ్దానం చేసిన ఆయన ఓ పట్టాన ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ మాటకొస్తే ఎన్నికల్లో ఓటమికి చాలాకాలం ముందు నుంచే ఆయన ఓ పల్లవి అందుకున్నారు. తానంటూ తిరిగి ఎన్నిక కాకపోతే, అది ఎన్నికల్లో మోసం వల్లేనని పాట పాడసాగారు. ప్రజాతీర్పు ప్రతికూలంగా వచ్చాకా ఆ మాటే ప్రచారంలో పెడుతున్నారు. ఆయన సమర్థకుల్లో నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు – ధని కులు, పేదలు – యువకులు, వృద్ధులు... ఇలా అందరినీ కలిపిన సూత్రం – కమ్యూని జమ్‌పై విద్వేషం. అంతా కలసి పార్లమెంటరీ చిహ్నాలపై దాడి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

ఈ ఘర్షణల్లో తన ప్రమేయం లేదని బోల్సనారో చేతులు దులుపుకొంటున్నారు. కానీ, ప్రాసం గిక సాక్ష్యాధారాలు విరుద్ధంగా ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను 'దొంగలు'గా పేర్కొంటూ, తాను ఓడిపోతే హింస తప్పదని ఎన్నికలప్పుడే ఆయన సెలవిచ్చారు. ఫలితాలు ప్రకటించిన నాటి నుంచి నేటికీ సాగుతున్న ఆయన సమర్థకుల నిరసనలు, విధ్వంసాలు అందుకు ఆచరణరూపమే. వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా అనేక రోజుల క్రితమే ఈ దాడులకు వ్యూహం, నిర్వహణ జరిగిందట. బ్రెజిల్‌లోని వివిధ రాష్ట్రాల నుంచి పదులకొద్దీ బస్సుల్లో వచ్చి, విధ్వంసం రేపిన వ్యక్తుల వెనుక బోల్సనారో పాలనలో యథేచ్ఛగా సాగిన పర్యావరణ విధ్వంసక వర్గాల డబ్బు ఉందనీ వినిపిస్తోంది. ప్రజా స్వామ్య పాలనను అడ్డుకోవాలనే ఈ తెర వెనుక వ్యక్తుల వ్యవహారం మరింత ఆందోళనకరం.

రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, 2.5 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి విముక్తి కల్పించిన చరిత్ర లూలాది. కమ్యూనిజాన్ని బూచిగా చూపి, అవినీతి ముద్ర వేసి ఓటర్ల దృష్టి మరల్చి, పబ్బం గడుపుకోవాలన్న బోల్సనారో పాచిక తాజా ఎన్నికల్లో పారలేదు. అదీ స్వయంకృతమే. దేశంలో 7 లక్షల పైగా మరణాలతో కరోనా కట్టడిలో వైఫల్యం, అమెజాన్ అడవుల నరికివేత, కునారిల్లిన ఆర్థిక వ్యవస్థ వగైరా ఆయనకు శాపాలయ్యాయి. అయితే, వర్గాలుగా చీలిన సమాజంలో లక్షలాది ప్రజల్లో ఎన్నికల ఫలితాలపై అపనమ్మకం, లూలా అన్నా, వామపక్షమన్నా లేనిపోని భయం కలిగించడంలో బోల్సనారో కొంత విజయవంతమైనట్టే ఉన్నారు. ఇప్పుడదే దేశానికి పెనుశాపం. తాజా విధ్వం సాలను ఆ కోణంలోనూ చూడాలి. బాధ్యులను గుర్తించి, దురంతాలను ఉక్కుపాదంతో అణచాలి.

1980లలో నిరంకుశత్వం నుంచి బ్రెజిల్ బయటపడినా, బోల్సనారోకు సైనిక నియంతృత్వం పైనే మక్కువ. ప్రజాస్వామ్య సంస్థల పట్ల గౌరవం లేని ఆయన అధికారంలో ఉన్నప్పుడు తీవ్ర మితవాదులతో, సంపన్న వర్గాలతో అంటకాగారు. ఆ ప్రయోజనాలకు లూలా అడ్డు అన్నదే ఆయన కడుపు మంట. ఈ సవాలును కొత్త అధ్యక్షుడు ఎంత సమర్థంగా ఎదుర్కొంటారో చూడాలి. ఫాసిస్టు ధోరణులకు అడ్డుకట్ట వేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం, గౌరవం కలిగించడం తక్షణ లక్ష్యం. ట్రంప్ ప్రవర్తన నుంచి ప్రేరణ పొందిన బోల్సనారో ఇకనైనా మూర్ఖత్వం వీడాలి. ఓటమిని హుందాగా అంగీకరించాలి. రాజ్యాంగానికి కట్టుబడేలా తన మద్దతుదారులకు నచ్చజెప్పాలి.

ఆగని ఈ ఎన్నికల సంక్షోభం నుంచి ఎంత తొందరగా బయటపడితే 21.5 కోట్ల బ్రెజిలియన్లకూ అంత మంచిది. 'బ్రిక్స్' గ్రూపులో సభ్యదేశంగా, ద్వైపాక్షికంగా బ్రెజిల్‌తో భారత్‌కు సత్సంబంధాలు న్నాయి. బోల్సనారోను గతంలో మిత్రుడిగా భావించిన ప్రధాని మోదీ సైతం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన తాజా ఘటనల్ని ఖండించారు. ప్రపంచంలోని మిగతా ప్రజాస్వామ్యాలూ ముం దుకొచ్చి, మితవాద విద్రోహులకు ఊతమివ్వబోమని తెలిసేలా చేయాలి. ప్రజాస్వామ్య సుస్థిరతకు భంగం కలిగే ఏ పరిణామం వాంఛనీయం కాదు. ఎందుకంటే, బ్రెజిల్ హింసాత్మక గతాన్ని విస్మరిం చలేం. నియంతృత్వాలకూ, నిరంకుశత్వానికీ పేరుబడ్డ దక్షిణ అమెరికాలో కేవలం కొన్ని పదుల వసంతాల ఈ యువ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ దేశ ప్రజలు, పార్టీలదే!

విధానాల శాపమే... ఈ పాపం!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

బద్రీనాథ్ పవిత్ర మందిరానికి ప్రవేశ ద్వారం అయిన ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్ కుంగిపోవడం పాలకుల పర్యావరణ పట్టింపులేనితనానికి నిదర్శనం. కొండచరియలు విరిగిపడే ఈ భౌగోళిక సున్నిత ప్రాంతంలో సొరంగాల తవ్వకం, పేల్చడం వంటి నిర్మాణ పనులు చేయకూడదు. అయినా అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల కోసం కేంద్రం హద్దుల్లేని మద్దతిచ్చింది. ఇది సరిపోదన్నట్టుగా, ఈ కొండల్లో 800 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల 'చార్‌ధామ్ హైవే ప్రాజెక్టు'ను ప్రారంభించింది. పైగా పర్యావరణ చట్టాల్లో 123 క్రమబద్ధీకరణ మార్పులను తీసుకొచ్చారు. ప్రధాని కార్యాలయం చార్‌ధామ్ వంటి ప్రాజెక్టులను నేరుగా పర్యవేక్షిస్తున్నప్పుడు, జోషీమఠ్ కుంగిపోతున్న ఘటనకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

జోషీమఠ్ కుంగిపోతోంది. ఈ ప్రాంతంలోని 600 ఇళ్లు బీటలు వారాయి. డజన్లకొద్దీ కుటుం బాలు నిరాశ్రయులయ్యారు. హోటల్స్ వంటి కొన్ని వాణిజ్య భవనాలు అనిశ్చితంగా ఒకదానిపై ఒకటి ఒరిగిపోయాయి. సముద్ర మట్టానికి 6 వేల అడుగుల ఎత్తులో ఉండే ఈ పట్టణం 'చార్ ధామ్'లలో ఒకటైన బద్రీనాథ్ పవిత్ర మందిరం, హేమ్‌కుండ్ సాహిబ్ దగ్గరి సిక్కు తీర్థయాత్రా స్థలం, ఔలి దగ్గరి స్కీయింగ్ ఆకర్షణకు ప్రవేశ ద్వారం. హిమాలయాల్లో పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంలో జోషీమఠ్ ఉంది. సాపేక్షికంగా యువ పర్వతమైన దీని భౌగోళికత ఇతర పర్వతాలతో పోలిస్తే భిన్నమైంది. సమీపంలోని హాథీ పర్వతం, ఔలి స్థిరమైన శిలలపై ఏర్పడి ఉండగా, జోషీమఠ్ ప్రాచీన కొండ చరియలలో భాగంగా ఉన్న స్థిరపడని బండరాళ్లతో ఏర్పడింది. అందువల్ల ఇది కొండచరియలు విరిగిపడే ప్రాంతం. ఇక్కడ సొరంగాల తవ్వకం, పేల్చడం వంటివి చేస్తే నేలకు భంగం కలుగుతుంది.

1970లో ఒక కొండ నుంచి పెద్ద బండరాయి విడివడి అలకనంద నదిలో పడిపోయింది. ఆ ప్రాంతంలో పెరిగిన నిర్మాణ కార్యకలాపాలు, పెరుగుతున్న జనాభా ఒత్తిడి వంటివే ఇలా కొండ చరియలు విరిగిపడటానికి కారణం అవుతున్నాయని డజన్ల కొద్ది శాస్త్రీయ అధ్యయనాలు నిర్ధారించాయి. స్థానిక ప్రజలకు రోడ్లు, నీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ, స్థానిక వినియోగం కోసం చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టు వంటివి హేతుబద్ధమే కావొచ్చు. కానీ వరుసగా ఏర్పడుతూ వచ్చిన ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో హైవేలు, జలవిద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధి వగైరా అతిపెద్ద ప్రాజెక్టులకు తెరతీశాయి. జోషీమఠ్ వంటి ఘటనలకు ప్రకృతిని, వాతావరణ మార్పును లేదా స్థానిక ప్రజలను తప్పు పట్టి ప్రయోజనం లేదు. ఇవన్నీ న్యూఢిల్లీలో రూపొందిస్తున్న విధానాలు కలిగిస్తున్న విపత్తుల ఫలితమేనని కింది కారణాల వల్ల చెప్పవచ్చు.

మొదటి కారణం, 2013 కేదార్‌నాథ్ విషాదం జరిగిన తర్వాత కూడా ఈ ప్రాంతంలో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం హద్దుల్లేని మద్దతును ఇవ్వడమే. ఉత్తరాఖండ్‌లో ఉనికిలో ఉన్న, నిర్మాణంలో ఉన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సుదీర్ఘ మన్నిక; అస్థిరమైన జోన్లలో అధిక అవక్షేపాల భారం... తీవ్ర సమస్యలుగా ఉంటూనే వచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే సుప్రీంకోర్టుచే నియమితులైన నిపుణుల బృందం, 'మెయిన్ సెంట్రల్ థ్రస్ట్' (ఎమ్‌సీటీ)పై ఉన్న భూభాగాన్ని సాధారణంగానూ, పేరుకుపోయే చలికాలపు మంచు భూభాగాన్ని ప్రత్యేకంగానూ జలవిద్యుత్ పనుల నుంచి దూరంగా ఉంచాలని సూచించింది.

2014 డిసెంబర్‌లో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ ఒక అఫిడవిట్ దాఖలు చేసింది. 2013లో వరదలు ముంచెత్తడానికి జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రత్యక్షంగా, పరోక్షంగా



ప్రభావం చూపుతున్నాయని ఇందులో పేర్కొంది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ కూడా ఈ ప్రాంతంలో నివసించే ప్రజల భద్రతను పరిరక్షించడానికి ఇలాంటి ప్రాజెక్టులపై సమీక్ష అత్యవసరమని 2016లోనే సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే 2013 నుంచి ఈ ప్రాంతంలోని ఏ జలవిద్యుత్ ప్రాజెక్టును కూడా సమీక్షించడం కానీ, నిలిపి వేయడం కానీ జరగలేదు. వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన ఈ అఫిడవిట్లన్నీ కాగితాల మీదే ఉండిపోయాయి.

హిమాలయాలపై జలవిద్యుత్ ప్రాజెక్టుల దాడి సరిపోలేదని కాబోలు... కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ కొండల్లో 800 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల 'చార్ ధామ్ హైవే ప్రాజెక్టు'ను ప్రారంభించింది. దీనికోసం మైదానాల్లో ఉండే విధంగానే రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రాంతంతో 12 మీటర్ల వెడల్పు డబుల్ లేన్‌ను డిజైన్ చేశారు. అంటే వందలాది చెట్లను విచ్చలవిడిగా నరకడం, కొండ వాలులను అస్థిర పరచడం, సహజమైన ఊటలను ధ్వంసం చేయడం, వీటితో పాటు లోయల కింది భాగంలో చెత్త, వ్యర్థాలను కుప్పతెప్పలుగా పోయడం అని అర్థం.

ఈ ప్రాజెక్టును మదింపు చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన అత్యున్నత సాధికారిక కమిటీ ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసానికి రోడ్డు వెడల్పే ప్రత్యక్ష కారణంగా ఉంటోందని భావించింది. అందుకని వెడల్పును తగ్గించినట్లయితే నష్టాన్ని కనీస స్థాయికి తగ్గించే అవకాశముందని పేర్కొంది. నిజానికి 5.5 మీటర్ల 'క్యారేజ్ వే'తో పర్వత ప్రాంత రోడ్లను భిన్నంగా డిజైన్ చేయాలని సూచిస్తూ 2018లోనే రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. కానీ తన సొంత నిబంధనలను అదే లెక్కచేయకుండా, ఆ సర్క్యులర్‌ను కోర్టు నియమించిన ప్యానెల్‌కు కూడా చూపకుండా దాచింది. బలహీనమైన పర్వత ప్రాంతాల్లో వెడల్పాటి హైవే నిర్మాణం కోసం ఒత్తిడి చేయడం ద్వారా రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ పర్యావరణ విధ్వంసం జరగడాన్ని అనుమతించింది.

రెండో కారణం, ప్రాజెక్టుల కోసం పర్యావరణ నిబంధనలను పాతరేయడానికి సాహసించడమే. అన్ని భారీ ప్రాజెక్టులూ పర్యావరణ ప్రభావ మదింపు (ఈఐఏ)నకు లోబడి ఉండాలి; పర్యావరణ నిర్వహణ పథకాన్ని(ఈఎంపీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. రోడ్డు ప్రాజెక్టుల కోసం, ఈఐఏ పరిధి 100 కిలోమీటర్లు మాత్రమే. కానీ ఈ నిబంధన నుంచి తప్పించుకోవడానికి చార్ ధామ్ ప్రాజెక్టును ఒక్కొక్కటీ 100 కిలోమీటర్ల కంటే తక్కువ ఉండేలా 53 ప్రాజెక్టులుగా విభజించారు. కాబట్టి పర్యావరణంపై అవిచ్ఛిన్నమైన, సంచిత ప్రభావాలు ఉంటున్నట్లు తెలుస్తున్నప్పటికీ ఎలాంటి క్రమబద్ధీకరణ, తనిఖీ లేకుండా; ప్రతిక్రియాత్మక పర్యావరణ నిర్వహణ పథకం లేకుండా ప్రాజెక్టును ప్రారంభించేశారు. సరళతర వాణిజ్యం కోసం ప్రభుత్వం పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడవడం కూడా అతిపెద్ద సమస్య అయింది. 2020 మార్చ్ నుంచి 2022 మార్చ్ వరకు పర్యావరణ చట్టాల్లో 123 క్రమబద్ధీకరణ మార్పులను తీసుకొచ్చారని 'విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ' చేసిన అధ్యయనం తెలిపింది. ఈ మార్పుల్లో నాలుగింట మూడొంతులు చట్టాలను సడలించడానికీ, చట్టబద్ధమైన అవసరాలకు మినహాయింపులు ఇవ్వడానికీ సంబంధించినవే కావడం గమనార్హం.

మూడో కారణం ఏమిటంటే, ధార్మిక పర్యాటకం పేరుతో దాని సామర్థ్యాన్ని పట్టించుకోకుండా, పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో విచ్చలవిడి టూరిజాన్ని ప్రోత్సహించడమే. హైవే ప్రాజెక్టుకు అదనంగా ప్రభుత్వం చార్ ధామ్ ప్రాంతంలో రైలు సర్వీసులను, రోప్ వేలను ప్రవేశపెట్టడానికి పథకాలు రూపొందిస్తోంది. క్రితంసారి కేదార్‌నాథ్‌ను సందర్శించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ– రైళ్లు, రోడ్లు, రోప్ వేలు తమతో పాటు ఉద్యోగాలను కొనితెస్తాయనీ, జీవితాన్ని సులభతరం చేసి సాధికారతను కలిగిస్తాయనీ గొప్పగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు 17 గంటలపాటు ఏకాంతంలో గడిపిన ధ్యాన గుహ భక్తులకు ముఖ్య ఆకర్షణ కేంద్రంగా మారిపోయింది. దీని ఫలితంగా ఇలాంటి మరో మూడు ధ్యాన గుహలను పర్యాటకుల కోసం నిర్మిస్తున్నారు.

అంతిమంగా, జోషీమఠ్‌లో విపత్తు కలిగిన తర్వాత కూడా ప్రభుత్వ స్పందన మిడిమిడి జ్ఞానంతోనే ఉంటోంది. ప్రధాని కార్యాలయం నిర్వహించిన ఒక సమావేశంలో, ఈ ప్రమాదంలో 350 మీటర్ల కొండ ప్రాంతం మాత్రమే ప్రభావితమైందని తేలికచేసి మాట్లాడారు. ప్రధానమంత్రి, ప్రధాని కార్యాలయం ఛార్ ధామ్ వంటి ప్రాజెక్టులను నేరుగా పర్యవేక్షిస్తున్నప్పుడు, జోషీమఠ్ కుంగిపోతున్న ఘటనకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆకర్షణీయమైన ప్రదర్శనలు కాకుండా, నిజమైన ప్రతిక్రియకు పూనుకోవాల్సిన సమయం ఇది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోకూడని క్రీడా?



హాకీ మీద ప్రధాన స్రవంతి మీడియా, భారత పెద్ద పత్రికల్లో ఏ కవరేజీ లేకపోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. రేపు హాకీ ప్రపంచ కప్ ప్రారంభం అవుతోంది. ఇండియా ఆతిథ్యం ఇస్తోంది. ఏ వ్యాసాలు లేవు. కనీసం మన క్రీడాకారుల పైన కూడా. మనకు మంచి హాకీ జర్నలిస్టులు ఉన్నారు. వాళ్లకు దయచేసి కొంత స్థలం ఇవ్వండి.

– వీరేన్ రస్‌కిన్హా, హాకీ మాజీ కెప్టెన్

విచారిస్తావ్!



పాకిస్తాన్ నుంచి విచారంగా తిరిగొచ్చాను. ఊహించలేనంత గందరగోళంగా ఉంది పరిస్థితి. ఏ ఆశా లేదు. నేను కలిసిన అందరూ(పాత్రికేయులు, సివిల్ సర్వెంట్లు, రాజకీయ నాయకులు, ట్రాఫిక్ పోలీసులు, క్యాబ్ డ్రైవర్లు, వ్యాపారులు) భవిష్యత్ మీద ఆతురత, అనిశ్చితి, నిరాశతోనూ; ఎలాగైనా దీన్నుంచి బయట పడాలన్న తెగింపుతోనూ ఉన్నారు.

– అకీల్ షాహ్, ప్రొఫెసర్

చావాల్సిందేనా?



మహిళా రోగులకు మగ వైద్యులు చికిత్స చేయకూడదంటూ తాలిబన్లు ఉత్తర్వులిచ్చినట్టు వార్తలొచ్చాయి. అంటే, మహిళలను విశ్వవిద్యాలయాలకు వెళ్లకుండా, వాళ్లు వైద్యులు కాకుండా నిషేధిస్తారు. మళ్లీ మగ వైద్యులతో వైద్యం చేయించుకోకూడదు. వాళ్లు మరేం చేయాలి? రోగంతో చచ్చిపోవడమేనా?

– షబ్నమ్ నసీమీ, అఫ్గాన్ మాజీ సలహాదారు

పేరుకే భయమా?



తమిళనాడు' అనే మాట (తమిళనాడు గవర్నర్) రవికి విభజన వాదంలా వినబడితే, మరి మహా 'రాష్ట్ర'? ఇంకా నాగా'లాండ్'?

– చంద్రు, వ్యాఖ్యాత

కఠిన సత్యం



పెద్దవాళ్లవుతున్నాకొద్దీ ఎదుర్కోవాల్సిన కఠినమైన అంశం, తల్లిదండ్రులు వృద్ధులుగా మారడాన్ని చూస్తుండటం!

– మినీ చౌదరి, న్యాయవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్నాళ్లకొకడి 'ధర్మాన'

ఇన్నాళ్లకొకరు (ధర్మాన ప్రసాదరావు) ఉత్తరాంధ్ర వివక్ష మీద గొంతు విప్పి మాటాడేరు. ఇప్పటికైనా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం, పాలనా రాజధాని విశాఖలో ఏర్పాటు చేయకుంటే కనీసం మా ఉత్తరాంధ్ర ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్నారు. అలా అయితే ఉత్తరాంధ్రకు గల సహజవనరుల సాయంతో, ఆర్థిక కేటాయింపులతో, పాలనా ఏర్పాటుతో... ఏ నగరానికీ లేని ఓడరేవు, విమానాశ్రయం; భారీ, మధ్యతరగతి పరిశ్రమలతో మహానగరంగా ఎదగాల్సిన విశాఖను రాజధానిగా చేసి, ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తామని రాజకీయ ప్రకటన చేశారు. విశాఖను పాలనా రాజధాని చేయాలన్నదే ప్రసాదరావు కోరుకునేది. అది మరింత బలంగా విన్పించడానికి విశాఖను పాలనా రాజధానిగా చేయకపోతే, కనీసం ఉత్తరాంధ్రను రాష్ట్రంగా చేయాలన్నారు తప్పా ఉత్తరాంధ్రను రాష్ట్రంగా చేయాలనేమీ అనలేదు. అయినా ప్రసాదరావు మాటల్ని వక్రీకరించి, ఒక్కదాన్నే పట్టుకొని సోషల్ మీడియాలో గోల చేస్తున్నారు.

నిజానికి ప్రసాదరావు ఉత్తరాంధ్రను రాష్ట్రంగా చేయాలని డిమాండ్ చేస్తే బాగుండేది. అయినా, ఈ సందర్భంలో ప్రసాదరావు ఆమాత్రం అనడం ఘనతే! ఇప్పటిదాకా ఇలాంటి ప్రకటనలు ఉత్తరాంధ్ర పౌరసమాజం నుండి అరాకొరా (కె.ఎస్.చలం, నల్లి ధర్మారావు, అట్టాడ అప్పల్నాయుడు తదితరులు) వచ్చేయి తప్పా రాజకీయశక్తుల నుంచి రాలేదు. పాలకవర్గ పార్టీల నుంచీ రాలేదు, కమ్యూనిస్టు, విప్లవకారుల నుంచీ రాలేదు.

చాలా ఆశ్చర్యంగా ధర్మాన ప్రసాదరావు ప్రకటనపై విచ్ఛిన్నకారుడు, సమైక్య వ్యతిరేకి వంటి వ్యక్తిగత దాడి మాత్రమే కాక ప్రసాదరావు రాజకీయ ప్రయాణాన్నీ, ఆ ప్రయాణంలో ఉత్తరాంధ్రకు అతను చేసినదేమిటీ, ఇపుడెందుకిలా ప్రకటించాడంటూ... ఉత్తరాంధ్రేతరులే కాక ఉత్తరాంధ్రులూ ప్రశ్నిస్తున్నారు. విచిత్రంగా ఒక్క నల్లి ధర్మారావు తప్పా, ఉత్తరాంధ్ర గురించి తొలినాడు గొంతు విప్పిన కె.ఎస్. చలం గానీ ఇంకెవరుగానీ ఇపుడేమీ మాటాడడం లేదు. స్పందనా రాహిత్యం ఉత్తరాంధ్ర స్వభావంలోకి ఇంకిపోయినట్టుంది.

తొలి తరం రచయితలు తప్పా వర్తమాన రచయితలెవరికీ ఉత్తరాంధ్ర జీవన సంక్షోభానికి కారణమయిన రాజకీయార్థిక విషయాలమీద అవగాహనా లేదు, ఆసక్తీ లేదు. అణు విద్యుత్ వ్యతిరేక పోరాటం, నిర్వాసితుల పోరాటాలు, విశాఖ ఉక్కు కర్మాగార కార్మిక పోరాటం వంటివాటిని వీరు సాహిత్యీకరించలేదు. అటు రచయితలుగానీ, ఇటు మేధావులుగానీ ఉత్తరాంధ్ర వివక్షమీద ప్రాంతీయవాద దృష్టితో స్పందించటం లేదు. విశాఖలో



స్థిరపడిన (వ్యాపారాలు, ఉద్యోగాలు, రాజకీయాలు చేసి) వారు ఉత్తరాంధ్ర గురించి వ్యాఖ్యానిస్తుంటారు, ఉత్తరాంధ్రుల తరఫున బాధ్యత తీసుకుంటారు. రాజకీయాల్లో, సాహిత్య, సాంస్కృతికాంశాల్లో ఉత్తరాంధ్రపై వివక్ష చూపి, 'వెనకబడిన జిల్లా' అనే టాగ్ తగిలించి సానుభూతి చూపుతారు ఉత్తరాంధ్రేతరులు.


పాతిక లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా ఎనిమిదిలక్షల ఎకరాలకు మాత్రమే ఇప్పటికీ సాగునీరు అందుతోంది. నాగావళి, వంశధార వంటి పద్దెనిమిది నదులూ, అధిక వర్షపాతం వల్ల అయిదువందల టీఎంసీల నీరు లభ్యమవుతున్నా... సాగునీరందించే ప్రాజెక్టులు పూర్తికాకపోవటంతో నీళ్లన్నీ సముద్రం పాలవుతోన్నవి. వ్యవసాయాధార పరిశ్రమలు లేక, ఉన్నవి మూతపడి ఇటు రైతులూ, అటు కార్మికులూ నష్టపోతున్నారు. ఉపాధుల్లేక ఏటా ఏభయి వేలమంది ఇక్కడినుంచి వలసలు పోతున్నారు. వలసల నివారణకుగానీ, వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకుగానీ, విశాఖ వంటి నగరంలోని పరిశ్రమలను అభివృద్ధి చేయడానికిగానీ ప్రత్యేక రాజకీయ నిర్ణయాలు, ఆర్థిక కేటాయింపులూ, అధికార యంత్రాంగమూ ఉండాలి. ఇవన్నీ ఉమ్మడి రాష్ట్రంలో ఉత్తరాంధ్రకు ఒనగూరలేదు. ప్రత్యేక రాష్ట్రమయితే ఒనగూరే అవకాశాలుంటాయి, ఒనగూరకపోతే కనీసం వీటికోసం తమదయిన ప్రాంతంలో ప్రజలు ఉద్యమించగలరు. పాలనా యంత్రాంగాన్ని ప్రభావితం చేయగలరు.

సమగ్ర ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రమనేది ఉపకరిస్తుందే తప్పా నష్టపెట్టదు. గనక ధర్మాన ప్రసాదరావేమీ విచ్ఛిన్నకారుడు కాదు, వారి ప్రకటనేమీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ క్రీడలో భాగం కాదు. ఉత్తరాంధ్రుల లోలోపలి భావాన్నే ప్రసాదరావు పలికేరు. ఇపుడు కాకపోతే మరొకప్పుడయినా ఉత్తరాంధ్ర తన లోలోపలి ఆకాంక్షను కోటిగొంతులతో బహిరంగ పరచగలదు!

– వంశధార సూరి, శ్రీకాకుళం

రాజకీయ సంక్రాంతి

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు మోటర్ దీస్కోని బొందల గడ్డ దిక్కు బోయిండు. రొండం త్రాల బంగ్లల బేతాలుడుంటున్నడు. ఆకలైతున్నా బేతాలునికి బొందుకోబుద్ధి గాలేదు. నాబి కాడ సల్ల బడితె నవాబ్ కైన జవాబ్ జెప్పొచ్చు అనుకోని ఆన్‌లైన్ల చికెన్ బిర్యాని దెప్పిచ్చుకుండు. తిన్నంక కతల వయ్యి సద్దు కుంట గూసున్నడు.

సరింగ నాత్రి ఒకటి గొట్టంగ, విక్రమార్కుడు హారన్ గొట్టిండు. బేతాలు డింట్ల కెల్లి ఇవుతలి కొచ్చిండు. మోటరెన్క సీట్ల ఆరాంగ గూసున్నడు. ఎప్పటి లెక్కనే విక్రమార్కుడు మోటర్ నడ్పలేదు. ఎన్కకు దిర్గి సకినాలు, నూల ముద్దలు ఇచ్చిండు.

''గియెందుకిస్తున్నవ్?'' అని బేతాలుడు అడిగిండు.

''సంక్రాతి పండ్గని.''

''లీడర్లు బిర్యాని పొట్లాలు ఇచ్చిన తీర్గ ప్రేమతోని నువ్వు గివ్వి నాకిచ్చినందుకు శెనార్తిలు. ఏం పండ్గనో ఏమో! ఒక్క దినం ఏసంకు మూతి మీసం గొర్గిచ్చుకును దెందుకో! అన్ని పండ్గలేమొ గని సంక్రాతి పండ్గకు అందరు సంత ఊర్లకు బోవాలనుకుంటరు. మోకేకా ఫాయిదా ఉటాయించి బస్సు చార్జిలు డబల్, త్రిబల్ జేస్తరు. రేల్ గాడిలల్ల నిలబడెతందుక్క గూడ జాగ దొర్కది. భారత్ జోడో అన్కుంట రాహుల్ గాంధి పాదయాత్ర జేస్తున్నడు. బండి సంజయ్, రేవంత్ రెడ్డి, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమారే గాకుంట యువగళం పేరు మీద లోకేశ్ గుడ్క పాదయాత్రలు జేస్తమంటున్నరు. గాల్ల తీర్గనే పాదయాత్ర జేస్కుంట పండ్గకు ఊర్లకు బోతె బాగుంటదని జెన మనుకుంటున్నరు. యథా లీడర్ తథా క్యాడర్.''

''ముగ్గుల సంగతేంది?''

''కిసాన్ సర్కార్ అన్కుంట బీఆర్ఎస్, రామరాజ్జెమన్కుంట బీజేపీ, ఇందిరమ్మ సర్కార్ అన్కుంట కాంగ్రెస్ జెనంను ముగ్గుల దించెతందుక్క ఒక్క తీర్గ కోషిష్ జెయ్యబట్టినయి.''

''పతంగులెక్కిస్తున్నరా?''

''ఫాంహౌస్‌ల సుతాయించిన మాంజతోని బీఆర్ఎస్ పతంగు లెక్కిస్తున్నది. ఈడీ, సీబీఐ మాంజతోని బీజేపీ పతంగులెక్కిస్తున్నది. సర్పంచుల మాంజ సుతాయించి కాంగ్రెస్ పతంగులెక్కిస్తున్నది. మేడినిండియా మాంజ అనుకుంటనే చైన మాంజతోని బీజేపీ పతంగులెక్కిస్తున్నదని అనుకుంట ఆల్ పిరీ మాంజతోని ఆప్ పతంగులెక్కి



స్తున్నది. సీపీఐ, సీపీఎం తోక పతంగులు ఎక్కిస్తున్నయి. బీఆర్ఎస్, బీజేపీ పతంగుల నడ్మనే పేంచి నడుస్తున్నది'' అని బేతాలుడన్నడు.

''రాజకీయ బోగి మంటలు గిన ఉన్నయా?''

''ఎందుకు లెవ్వు. లీడర్లు దినాం జెనంల మంటలు బెడ్తున్నరు. గీ నెలల కమ్మంల బీఆర్ఎస్ లచ్చల మందిల మంట బెడ్తది. బీజేపీ గుడ్క గిదే నెలల లష్కర్ల లచ్చల మందితోని మంటలు షురువు జేస్తనని జెప్పింది. జన సేన, టీడీపీ గల్సి ఆంద్రల మాటల మంటలు బుట్టిస్తమంటున్నయి. అమెరికల డల్లాస్ల గుడ్క తెలుగోల్ల నడ్మ కులం, రాజకీయ మంటలు లేసినయి.''

''రాజకీయ కోడి పందాల సంగతేంది?''

''సంక్రాంతనంగనే కోడి పందాలే యాదికొస్తయి. కోల్ల కాల్లకు చిన్న కత్తులు గట్టి దంగల కిడుస్తరు. గవ్వి ఒక్క తీర్గ ఫైటింగ్ జేస్తయి. గా కోల్ల మీద కోట్ల రూపాయలు బిట్టు గడ్తరు. గీ నడ్మ ఆన్‌లైన్ కోడి పందాలు షురువు జేసింద్రు. గివ్వి యాడాదంత నడుస్తనే ఉంటాయి. లీడర్ల నడ్మ దినాం తిట్ల పందా లుంటయి. గీ రాజకీయ కోల్ల నాల్కలే కత్తులు. అసల్ కోడి పందాలల్ల రెండు కోల్లు ఉంటె ఒకటి సస్తది. రాజకీయ కోల్ల పందాలల్ల ఒక కోడి ఓడి పోతె ఇంకొక కోడి గెలుస్తది. గియ్యాల ఓడిన కోడి రేపు గెల్సినా గెలుస్తది. సంక్రాతి దినాలల్ల నోములు జేసేటి ఆడోల్లు వాడకట్టుల సకినాలు, నూల ముద్దలు బంచుతరు. కుర్సి నోములు జేసేటి లీడర్లు కొత్త కొత్త పద్కాలు బెట్టి జెనంకు రూపాయలు బంచుతరు. నిండ ముంచుతరు.''

''వహవ్వా, ఏం చెప్పినవ్ బేతాలా!''

''గది గంట్లుండ నియ్యి. ఉప్పరిపల్లి మూసీ నది ఒడ్డుకు మొసల్లు ఎందుకొచ్చినయి. గీ సవాల్కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ బిరక్ ఫేలైతది'' అని బేతాలుడన్నడు.

''బేతాలా! సంక్రాతిని మకర సంక్రాంతం టరు. మకరము అంటె మొసలి. రాజకీయ మొసల్లు ఎట్లున్నయో అర్సుకునేతందుక్క పండ్గ నాడు అసలు మొసల్లు మూసీ నది ఒడ్డుకొచ్చినయి'' అని విక్రమార్కుడు జెప్పిండు.

చౌరస్తల రెడ్ సిగ్నల్ బడ్డది. మోటరాగింది. ఎన్క తలుపు దీస్కోని కిందికి దిగిన బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

గ్రహం అనుగ్రహం
శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.58 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఉత్తర ప.1.07వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.9.51 నుండి 11.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.33 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.15 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.39


కడప 43వ డివిజన్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


తిరుపతి జిల్లా రామరెడ్డిపాలెంలో ముస్లిం మైనారిటీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం


గుంటూరులో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా


పార్వతీపురం మన్యం జిల్లా అప్పయ్యపేటలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

మన ప్రభుత్వం

క్లుప్తంగా...

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డైరీ–2023, నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి ఎండీ మస్తాన్ ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పలు జిల్లా యూనిట్ల పోలీసు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎస్‌తో డీఏఆర్‌పీజీ బృందం భేటీ

రాష్ట్రంలో పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల పరిష్కారంపై చర్చ

సాక్షి, అమరావతి: కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవియెన్సెస్ – డీఏఆర్‌పీజీ) కార్యదర్శి వి.శ్రీనివాస్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డితో సమావేశమైంది. డీఏఆర్‌పీజీ కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు జాతీయస్థాయిలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి రాష్ట్రాలకు తగిన సమాచారం అందిస్తుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ గవర్నెన్స్ ఇండెక్సు, నేషనల్ ఈ–సర్వీసెస్ డెలివరీ అసెస్మెంట్, డిస్ట్రిక్ట్ గుడ్ గవర్నెన్స్ ఇండెక్సు, సెక్రటేరియట్ రిఫార్మ్స్, గ్రీవియెన్స్ రిడ్రెస్సల్ అంశాల్లో మెరుగైన రీతిలో పనిచేస్తుండటంతో డీఏఆర్‌పీజీ కార్యదర్శి బృందం సీఎస్‌తో సమావేశమైంది. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేపట్టిన పరిపాలన సంస్కరణలు, పబ్లిక్ గ్రీవియెన్సెస్ పరిష్కారం తదితర అంశాలపై సీఎస్‌తో శ్రీనివాస్ చర్చించారు. అందుకు సంబంధించి రూపొందించిన పుస్తకాలు, డాక్యుమెంట్లను సీఎస్‌కు అందించారు. సీఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న పరిపాలన సంస్కరణలు, పబ్లిక్ గ్రీవియెన్సెస్ పరిష్కారం, రాష్ట్ర, జిల్లాస్థాయిలో అమలు చేస్తున్న గుడ్ గవర్నెన్స్, జాతీయ ఈ–సర్వీసెస్ డెలివరీ సిస్టమ్ అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

సచివాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను గురువారం వెలగపూడి సచివాలయంలో ఘనంగా నిర్వహించారు.సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టేలా కళాకారుల కర్రసాము, కత్తి సాముల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు, సన్నాయి, మేళతాళాలతో సందడి వాతావరణాన్ని తలపించింది. మహిళా ఉద్యోగుల రంగవల్లుల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఇందులో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామి రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ ముఖ్య కార్యదర్శి సెక్రటరీ కె.సునీత, కమిషనర్ ఎం.ఎం.నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలోని సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న మహిళలు

తెలుగు సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీక

గవర్నర్ సతీమణి సుప్రవ హరిచందన్

సాక్షి, అమరావతి: తెలుగింటి సంప్రదాయానికి రంగవల్లులు ప్రతీకగా నిలుస్తాయని గవర్నర్ సతీమణి సుప్రవ హరిచందన్ అన్నారు. రాజ్ భవన్ ఆవరణలో గురువారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. సుప్రవ హరిచందన్ మాట్లాడుతూ..తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పండుగలు, వేడుకల ద్వారా భావితరాలకు పరిచయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులు విద్యులత, సరిత, అరుణశ్రీ బృందాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజ్ భవన్ సంయుక్త కార్యదర్శి సూర్య ప్రకాష్, ఉప కార్యదర్శి నారాయణ స్వామి పాల్గొన్నారు.


రాజ్ భవన్‌లో జరిగిన వేడుకలలో పాల్గొన్న గవర్నర్ సతీమణి సుప్రవ హరిచందన్

మద్యం మత్తులోనే వందేభారత్ రైలుపై దాడి

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- రైలును పరిశీలించిన డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): నిర్వహణ పనుల నిమిత్తం విశాఖకు వచ్చి.. బుధవారం కోచింగ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్న వందేభారత్ రైలుపై రాళ్లు వేసిన నిందితులను స్థానిక పోలీసులు, జీఆర్‌పీ పోలీసుల సహకారంతో రైల్వే భద్రతా దళం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం కంచరపాలెం రైల్వే గేటు వద్ద మద్యం మత్తులో ఉన్న శంకర్, చందు, రాజు అనే వ్యక్తులు కొత్త రైలు వెళ్లడం గమనించి రాళ్లతో దాడి చేశారు. గమనించిన ఆర్పీఎఫ్ సిబ్బంది ఆ ముగ్గురినీ వెంబడించగా శంకర్ చెప్పును వదిలేసి పారిపోయాడు. రైల్వే పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఆదేశించగా.. వెస్ట్ ఏసీపీ, కంచరపాలెం సీఐ, టాస్క్‌ఫోర్స్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులు ముగ్గురినీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ ముగ్గురూ పాత కేసుల్లో నిందితులని పోలీసులు తెలిపారు.


వందేభారత్ రైలును పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌లో వందేభారత్ రైలును వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి గురువారం తనిఖీ చేశారు. రైలులో ఎల్లవేళలా అందుబాటులో ఉండే ఆన్‌బోర్డ్ టెక్నీషియన్స్‌తో డీఆర్ఎం మాట్లాడారు. బుధవారం రాత్రి ఈ రైలును కోచ్ కేర్ సెంటర్‌కు తరలిస్తున్న సమయంలో కంచరపాలెం వద్ద ఆకతాయిల వల్ల దెబ్బతిన్న పగిలిన కోచ్‌ల అద్దాలను పరిశీలించారు. పాక్షికంగా పగిలిన అద్దాలను న్యూకోచింగ్ కేర్ సెంటర్‌లో మార్చారు. గురువారం రాత్రికే ఈ రైలును సికింద్రాబాద్ పంపించేందుకు వాల్తేర్ డివిజన్ అధికారులు ఏర్పాటు చేశారు. ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్ రఘువీర్, సీనియర్ కోచింగ్ డిపో ఆఫీసర్ మోనిష్ బ్రహ్మ, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ ఎస్‌కే పాత్ర పాల్గొన్నారు.

షెల్‌కు 'యుద్ధ' లాభాలు

- రష్యా–ఉక్రెయిన్ ఉద్రిక్తతలతో రికార్డు లాభాలు
- గతేడాది 3 క్వార్టర్స్‌లోనే 30 బిలియన్ డాలర్లు
- 18 బిలియన్ డాలర్ల షేర్ల బైబ్యాక్; హరిత ఇంధనాలపై పెట్టుబడులు

సాక్షి బిజినెస్ డెస్క్: రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధంతో చమురు, గ్యాస్ రేట్లు భగ్గుమంటున్నాయి. సామాన్య ప్రజానీకానికి ఇది కష్టంగానే ఉంటున్నా చమురు కంపెనీలకు మాత్రం లాభాల పంట పండుతోంది. షెల్ లాంటి సంస్థలు రికార్డు లాభాలు నమోదు చేస్తుండటమే దీనికి నిదర్శనం. బ్రిటన్‌కు చెందిన చమురు దిగ్గజం షెల్ గతేడాది (2022) మూడు త్రైమాసికాల్లోనే ఏకంగా 30 బిలియన్ డాలర్ల పైగా ప్రాఫిట్స్ ఆర్జించింది. తొలి త్రైమాసికంలో (జనవరి–మార్చి) షెల్ 9.1 బిలియన్ డాలర్లు నమోదు చేసింది. అప్పటికది కంపెనీ చరిత్రలో రికార్డు (త్రైమాసికాలపరంగా). ఆ తర్వాత రెండో త్రైమాసికానికి వస్తే దాన్ని తిరగరాసి ఏకంగా 11.5 బిలియన్ డాలర్లు సాధించింది. ఇక మూడో క్వార్టర్‌లో లాభాలు 9.5 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. రెండో క్వార్టర్‌తో పోలిస్తే తగ్గినప్పటికీ అత్యుత్తమ త్రైమాసికాల్లో ఒకటిగా క్యూ3 నిల్చింది. ఇలా షెల్ లాభాలు రికార్డుల మోత మోగిస్తున్నాయి. నాలుగో త్రైమాసికంలోనూ ఇదే జోరు కొనసాగుతుందని, తద్వారా పూర్తి ఏడాదికి గాను 2008లో నమోదు చేసిన రికార్డును తిరగరాయొచ్చని అంచనాలు నెలకొన్నాయి. ఇలా వచ్చిన లాభాలతో షెల్ భారీ స్థాయిలో తమ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టింది. ఇప్పటిదాకా ప్రకటించిన దాన్ని బట్టి ఇందుకోసం దాదాపు 18.5 బిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. అలాగే, పర్యావరణ అనుకూల ఇంధనాల ఉత్పత్తిపైనా ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. షెల్ ఇప్పటికే పలు హైడ్రోజన్ ప్రాజెక్టులపై కసరత్తు చేస్తోంది.

విండ్‌ఫాల్ పన్నుల దెబ్బ..

రేట్ల మోత మోగిస్తూ ఇంధన కంపెనీలు జోరుగా లాభాలు గడిస్తుండటంతో ప్రభుత్వాలూ వాటిపై దృష్టి సారిస్తున్నాయి. సాధారణంగా వేసే ట్యాక్సులతో పాటు ఆకస్మికంగా, అసాధారణంగా వస్తున్న లాభాలపైనా పన్నులు వడ్డిస్తున్నాయి. వీటిని విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తున్నారు. షెల్ కూడా ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటోంది. దీనితో 2022కి సంబంధించి 2.4 బిలియన్ డాలర్ల మేర పన్నుల భారం పడుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. నాలుగో త్రైమాసిక ఫలితాల్లో ఇవి ప్రతిఫలించే అవకాశం ఉందని పేర్కొంది.

రాజ్యాంగ స్ఫూర్తితో శాసన, న్యాయ వ్యవస్థలు పనిచేయాలి

- సామరస్య సంబంధాన్ని కొనసాగించాలి
- ఆ రెండు వ్యవస్థలు పరిధిని అతిక్రమించకూడదు
- ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ తమ్మినేని

సాక్షి, అమరావతి: రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా శాసన, న్యాయవ్యవస్థ మధ్య సామరస్య సంబంధాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఎటువంటి జోక్యం లేకుండా శాసనసభ, న్యాయస్థానాలు వారి హక్కుల పరిధిలో పనిచేయాలని, ఆ పరిధిని అతిక్రమించరాదని చెప్పారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో రెండు రోజుల పాటు జరిగిన 83వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో గురువారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడారు. భారతదేశంలో శాసన వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందని, చట్టాలను రూపొందించడంతో పాటు కార్యనిర్వాహక జవాబుదారీతనాన్ని నిర్ధారించే అధికారం శాసన వ్యవస్థకు ఉందన్నారు. శాసనసభ తన అధికార పరిధిలో అత్యున్నతమైనదని, సభ ప్రయోజనాలను రక్షించడంతో పాటు స్వతంత్రలో రాజీపడకుండా చూడటం స్పీకర్ విధి అని సీతారాం తెలిపారు.

జీవో 1 అమలు తాత్కాలికంగా నిలుపుదల

- ఈ నెల 23 వరకు అమలు నిలిపేసిన హైకోర్టు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుకు ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో సభలు, రోడ్‌షోలను నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1 అమలును హైకోర్టు తాత్కాలికంగా ఈ నెల 23వ తేదీ వరకు నిలిపివేసింది. ఈ జీవో పోలీసు చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

జీవో 1ని సవాలు చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకు రామకృష్ణ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం మధ్యాహ్నం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ జీవో పోలీసు చట్ట నిబంధనలకు విరుద్ధమని రామకృష్ణ తరఫు న్యాయవాది అశ్వనీ కుమార్ చెప్పారు. తరువాత అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. 10 రోజుల కిందట ఇచ్చిన జీవోపై ఇప్పుడు ఈ వెకేషన్ బెంచ్ విచారణ జరిపేందుకు వీలుగా ఈ వ్యాజ్యం దాఖలు చేశారని తెలిపారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలపై విచారణ జరిపే పరిధి వెకేషన్ కోర్టుకు లేదన్నారు. సభలు, రోడ్‌షోల కోసం ఏ పార్టీ దరఖాస్తు చేయడం గానీ, తాము అనుమతులు నిరాకరించడం గానీ జరగలేదన్నారు. ఈ దశలో న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ స్పందిస్తూ.. 'పోలీసు చట్టం 1861 అమల్లోకి తెచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం ఇలాంటి జీవో తెచ్చి ఉంటే స్వాతంత్య్రోద్యమం జరిగేదా? స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి జీవో రాలేదు. ఈ వ్యాజ్యం విచారణకు రాకుండా చేసేందుకు తెర వెనుక ఏం జరిగిందో మాకు తెలుసు. హైకోర్టు వ్యవహారాలను థర్డ్‌పార్టీ నడిపిస్తోంది.' అని వ్యాఖ్యానించారు. అనంతరం ఏజీ వాదనలను కొనసాగిస్తూ.. జీవోలో నిషేధం అన్న పదమే లేదని తెలిపారు. నెల్లూరు, గుంటూరుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన కార్యక్రమాల్లో తొక్కిసలాట జరిగి పలువురు చనిపోయారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే పోలీసులకు పలు సూచనలు చేస్తూ జీవో 1 జారీ చేశామన్నారు. సభలు, రోడ్‌షోల నిషేధానికి కాదని చెప్పారు.

అడవికి ఊపిరి.. తుపాకీకి ఉరి

- బ్రెజిల్ కొత్త అధ్యక్షుడు లూలా ముందున్న సవాళ్లు
- గన్ కల్చర్, గోల్డ్ మైనింగ్ కట్టడికి చర్యలు షురూ

కొత్త సంవత్సరంలో ముచ్చటగా మూడోసారి బ్రెజిల్ గద్దెనెక్కిన లూలా డ సిల్వా రెండు కీలక అంశాలపై దృష్టి సారించారు. జనవరి 1న దేశాధ్యక్షుడిగా ప్రమాణం చేసినప్పుడు తుపాకుల సంస్కృతిని కట్టడి చేస్తానని, అమెజాన్‌లో బంగారం తవ్వకాలకు అడ్డుకట్ట వేసి అడవులకి కొత్త ఊపిరిలూదుతానని ప్రకటించారు. ఈ రెండు అంశాలు లూలా ప్రభుత్వానికి ఎందుకంత ప్రాధాన్యంగా మారాయి ? వామపక్ష భావజాలం కలిగిన నాయకుడైన లూలా రెండు పర్యాయాల పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చి జన హృదయాలను గెలుచుకున్నారు. వీటిని కూడా నెరవేరిస్తే ఆయన పేరు మరోసారి ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోవడం ఖాయం.

సరిగ్గా 20 ఏళ్ల కిందట బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా డ సిల్వా తొలిసారి అధ్యక్షుడైనప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఈ సారి ఎన్నికల్లో లూలా అత్యంత స్వల్ప మెజార్టీతో నెగ్గారు. 50.9% ఓటు షేర్ లూలాకు వస్తే, మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకి 49.1% ఓట్లు వచ్చాయి. కేవలం రెండు శాతం ఓట్లతో తేడాతో నెగ్గిన లూలా తాను అనుకున్నవీ ఎంత సాధించగలరో అన్న అనుమానాలైతే ఉన్నాయి. ఇప్పటికే బోల్సోనారో మద్దతుదారులు రోడ్లపైకెక్కి తిరిగి తమ నాయకుడినే అధ్యక్షుడిని చేయాలంటూ దేశాన్ని రణరంగంగా మారుస్తున్నారు. శాంతి భద్రతలకే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో లూలా తన పీఠాన్ని కాపాడుకోవడానికే సర్వశక్తులు ఒడ్డాల్సి వస్తోంది. దేశానికి ఒకప్పుడు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 4.4 కోట్ల మంది ప్రజల్ని పేదరికం నుంచి బయటపడేసి ప్రపంచవ్యాప్తంగా అందరి మన్ననలు అందుకున్న లూలా అధ్యక్ష పదవి నుంచి దిగిపోయాక అవినీతి ఆరోపణలపై జైల్లో గడపడంతో ఆయన పైనున్న విశ్వాసం కొంతవరకు ప్రజల్లో సన్నగిల్లింది. ఆ తర్వాత కేసుల నుంచి విముక్తుడైనప్పటికీ తుపాకుల సంస్కృతిని, అమెజాన్ అడవుల్ని కాపాడితే మరోసారి లూలా పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోవడం ఖాయం. అందుకే తన ప్రమాణ స్వీకారం రోజే బోల్సోనారో తుపాకులు సులభంగా కొనుక్కోవడానికి వీలుగా జారీ చేసిన డిక్రీలను రద్దు చేశారు. తుపాకుల నియంత్రణకు, బంగారం తవ్వకాలకి సంబంధించి కొత్త డిక్రీలు జారీ చేసి అభిమానుల నుంచి జేజేలు అందుకున్నారు.



పెచ్చు మీరుతున్న తుపాకుల సంస్కృతి



బ్రెజిల్‌లో మార్కెట్‌కి వెళ్లి బీన్స్ కొనుక్కోవడం ఎంత తేలికో తుపాకుల కొనుగోలు కూడా అంతే సులభం. జైర్ బోల్సోనారో 2019 జనవరి 1న దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక తుపాకుల నియంత్రణ చట్టాలను సులభతరం చేశారు. గన్ లైసెన్స్ లకుండే గడువుని అయిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. దీంతో ఆత్మరక్షణ పేరుతో తుపాకుల్ని విచ్చలవిడిగా కొనేవారి సంఖ్య పెరిగిపోయింది. తుపాకుల మరణాల్లో ప్రపంచంలో బ్రెజిల్ మొదటి స్థానంలో ఉంది. సగటున ఏడాదికి 40 వేల మంది మృత్యువాత పడడం చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల్ని బహిరంగంగా ప్రశంసించే బోల్సోనారో అమెరికా బాటలో విచ్చలవిడి తుపాకుల విక్రయానికి తెరతీశారు. దీంతో బ్రెజిల్ తుపాకుల కాల్పుల ఘటనతో రక్తమోడుతోంది. లూలా డ సిల్వా అధ్యక్షుడయ్యాక తుపాకుల నియంత్రణకి చేపడుతున్న చర్యలు ప్రజల్ని ఆకర్షిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం దేశంలో మూడింట రెండు వంతుల మంది ప్రజలు తుపాకులు ప్రజల చేతుల్లో ఉండడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెజాన్ అడవుల్లో గోల్డ్ మైనింగ్

అమెజాన్ అటవీ ప్రాంతంలో 60శాతానికిపైగా బ్రెజిల్‌లో ఉంది. భూమ్మీద ఉండే ఆక్సిజన్‌లో 10శాతం ఇక్కడ నుంచి వస్తూ ఉండడంతో భూమాతకి ఊపిరితిత్తులుగా అమెజాన్‌ను అభివర్ణిస్తారు. ప్రపంచంలో అతి పెద్ద అన్‌రిజిస్టర్డ్ మైనింగ్ ఇండస్ట్రీకి ఈ అడవులే వేదికయ్యాయి. గనుల నుంచి బంగారాన్ని వెలికి తీయడానికి పాదరసాన్ని వాడుతుంటారు. ఈ పాదరసంతో అమెజాన్ నదుల్లో నీరు విషతుల్యంగా మారుతున్నాయి. దీంతో ఈ అడవుల్లో ఉన్న 25 లక్షల రకాల జీవజాలానికి ముప్పు ఏర్పడుతోంది. అడవుల్లో నివసించే స్థానిక గిరిజనులకు గోల్డ్ మైనర్ల నుంచి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బ్రెజిల్ అటవీ ప్రాంతంలో బంగారం స్మగ్లర్లను గారింపేర్స్ అని పిలుస్తారు. వీరందరి వెనకాల మాజీ అధ్యక్షుడు బోల్సోనారో ఉన్నారనే ప్రచారం ఉంది. బోల్సోనారో తండ్రి కూడా గారింపేర్ కావడంతో అమెజాన్ అడవులు నాశనం కావడానికి బోల్సోనారో కుటుంబమే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కరోనా సంక్షోభ సమయంలో అయిదు నెలల కాలంలో బంగారం ధరలు 40% పెరిగిపోవడంతో గోల్డ్ స్మగ్లర్లు ఈ ప్రాంతంలో తమ పట్టు పెంచుకున్నారు. వీరికి రాజకీయ నేతల అండదండలు ఉండడంతో వీరిని కాదని చర్యలు తీసుకోవడం అంత సులభం కాదు. అధ్యక్ష ఎన్నికల్లో అమెజాన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న అన్ని జిల్లాల్లోనూ బోల్సోనారో కంటే లూలా వెనుకబడ్డారు. అందుకే ఆయన ప్రతీ నిర్ణయం ఆచితూచి తీసుకోవాల్సి ఉంటుంది.

- ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే బంగారంలో 20% అమెజాన్ అడవుల నుంచే వస్తుంది.
- ఈ గోల్డ్ మైనింగ్‌లు 2 లక్షల మందికి జీవనాధారంగా ఉన్నాయి.
- అమెజాన్‌లో బంగారం తవ్వకాల కోసం 2017 నుంచి అడవుల నరికివేత పెరిగిపోతోంది.
- అమెజాన్ అటవీ విస్తీర్ణం ఇప్పటికే 20% తగ్గిపోయింది. అంటే ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల సైజుతో ఇది సమానం. ఇందులో మైనింగ్ కోసమే 90% చెట్లను నరికేశారు.
- పర్యావరణ పరిరక్షణ చట్టాలను మాజీ అధ్యక్షుడు బోల్సోనారో తుంగలో తొక్కడంతో 2019లో అమెజాన్ అడవుల్లో 10,500 హెక్టార్ల విస్తీర్ణం తగ్గిపోయింది.
- 2018 సంవత్సరంతో పోలిస్తే గోల్డ్ మైనింగ్ కోసం 2019లో 23% అధికంగా, 2020 నాటికి 80శాతం అధికంగా అడవుల్ని నరికివేశారు.

- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో తుపాకుల సంఖ్య దాదాపుగా 20 లక్షలకి చేరుకుంది.
- 2018తో పోల్చి చూస్తే తుపాకుల్ని వినియోగించే ప్రజల సంఖ్య రెట్టింపైంది.
- గత ఏడాది జులైలో తుపాకులకి లైసెన్స్ ఇచ్చే సంస్థ సీఏసీ దగ్గర 6 లక్షలకు పైగా తుపాకుల లైసెన్స్ మంజూరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.
- 2018తో పోల్చి చూస్తే ఇది ఏకంగా 500% ఎక్కువ.
- 2019లో అత్యధికంగా 49,436 మంది తూటాలకు బలయ్యారు.

శరద్ యాదవ్ కన్నుమూత



న్యూఢిల్లీ: సీనియర్ రాజకీయవేత్త, లోక్‌తాంత్రిక్ జనతా దళ్(ఎల్‌జేడీ) అధినేత, కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ తుదిశ్వాస విడిచారు. 75 ఏళ్ల శరద్ యాదవ్ గుర్గావ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె సుభాషిణి ధ్రువీకరించారు. అనారోగ్యం పాలై అపస్మారక స్థితికి చేరుకున్న యాదవ్‌ను తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని, ఎమర్జెన్సీ వార్డులో చేర్చి చికిత్స ప్రారంభించామని, నాడి పనిచేయలేదని, రక్తపోటు రికార్డు కాలేదని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. రాత్రి 10.19 గంటలకు మరణించారని తెలియజేసింది. శరద్ యాదవ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శరద్ యాదవ్ మొత్తం పదిసార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారు. ఏడు సార్లు లోక్‌సభకు, మూడు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1970వ దశకంలో జయప్రకాశ్ నారాయణ్ శిష్యుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సోషలిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జనతాదళ్ నుంచి బయటకు వచ్చి 1997లో జేడీ(యూ)ను స్థాపించారు. జేడీ(యూ) నితీశ్ వర్గానికే చెందుతుందని 2017లో ఈసీ ప్రకటించింది. 2018లో తాను స్థాపించిన ఎల్‌జేడీని శరద్ యాదవ్ ఇటీవలే జేడీ(యూ)లో విలీనం చేశారు. శరద్ మృతి పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

క్లుప్తంగా...

వంట గ్యాస్ లీకై.. ఇంట్లో మంటలు

దంపతులు, పిల్లలు సజీవదహనం

చండీగఢ్: వంటగ్యాస్ సిలిండర్ లీకై ఇంట్లో మంటలు చెలరేగిన ఘటనలో దంపతులు, వారి నలుగురు సంతానం సజీవ దహనమయ్యారు. హరియాణా రాష్ట్రం పానిపట్ జిల్లా బిచ్‌పారీ గ్రామంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన ఇరుగుపొరుగు వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చే సరికే ఇంట్లో ఉన్న మొత్తం ఆరుగురూ ఆహుతయ్యారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన బాధిత దంపతులు అబ్దుల్(45), ఆయన భార్య(40) గ్రామంలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తుండే వారని స్థానికులు తెలిపారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అబ్దుల్ ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకుల వయస్సు 10–18 ఏళ్ల మధ్య ఉంటుంది.

'అంజలి' కేసులో నిందితుడికి నో బెయిల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి అంజలీ సింగ్(20)ను కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లిన ఘటనలో నిందితుడు అశుతోష్ భరద్వాజ్‌కు మెట్రోపాలిటన్ కోర్టు బెయిల్ నిరాకరించింది. ఘటన సమయంలో సహ నిందితుడైన దీపక్ కారు నడుపుతున్నట్లుగా అశుతోష్ దర్యాప్తును పక్కదోవ పట్టించారని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఆయనకు స్వేచ్ఛ లభిస్తే దర్యాప్తును మళ్లీ పక్కదోవ పట్టించే అవకాశం ఉందని తెలిపారు. ఘటన సమయంలో వాస్తవానికి మరో నిందితుడు అమిత్ కారు నడుపుతున్నట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. కేసు దర్యాప్తు ప్రాథమిక దశలో ఉండటం, నిందితుడిపై మోపిన ఆరోపణలపై సెషన్స్ కోర్టు ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నందున బెయిల్ ఇవ్వడం కుదరదని మేజిస్ట్రేట్ సాన్యా దలాల్ స్పష్టం చేశారు.

ఆస్ట్రేలియాలో హిందూ దేవాలయం అపవిత్రం


మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని స్వామి నారాయణ్ మందిరంపై ఖలిస్తాన్ మద్దతుదారులు రంగులతో దాడిచేశారు. గోడలపై తమ హిందూ విద్వేషాన్ని చూపించారు. ప్రధాని మోదీ వ్యతిరేక రాతలు రాశారు. మెల్‌బోర్న్ సమీపంలోని మిల్ పార్క్‌లోని స్వామి నారాయణ్ మందిరంపై గురువారం కొందరు ఖలిస్తాన్ మద్దతుదారులు దాడిచేశారు. 1980లలో పంజాబ్‌లో స్వర్ణదేవాలయంలో దాక్కొన్న నాటి సిక్కు వేర్పాటువాద నేత, ఖలిస్తాన్ ఉద్యమకారుడు దివంగత జర్నేల్ సింగ్ భింద్రావాలే 'అమరుడు', ప్రధాని మోదీ ఒక హిట్లర్ అంటూ నలుపు రంగుతో గ్రాఫిటీ చేశారు. భారతదేశాన్ని వ్యతిరేకిస్తూ హిందుస్తాన్ ముర్దాబాద్ వంటివి రాశారు. దాడి ఘటనను ఆస్ట్రేలియాలోని భారతీయ హిందువులు, భారతీయ మూలాలున్న నేతలు తీవ్రంగా ఖండించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, ఎంపీలకు ఫిర్యాదుచేశారు.

మరో చోటా రహస్య పత్రాలు లభ్యం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరహాలో ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ దేశ రహస్య పత్రాల వివాదంలో మరింతగా కూరుకుపోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో తన ప్రైవేట్ కార్యాలయంలో దేశ రహస్య పత్రాలు లభించాయని మీడియాకు చెప్పకుండా దాచిపెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బైడెన్‌కు మరో సమస్య ఎదురైంది. తాజాగా బైడెన్‌కు చెందిన మరో ప్రాంతంలోనూ రహస్య డాక్యుమెంట్లను ఆయన వ్యక్తిగత లాయర్లు కొనుగొన్నారనే వార్త అమెరికాలో పెద్ద చర్చనీయాంశమైంది. రెండో చోట పత్రాలు లభించాయన్న వార్తపై స్పందించేందుకు అమెరికా అధ్యక్ష భవనం(వైట్‌హౌజ్), న్యాయ మంత్రిత్వ శాఖ నిరాకరించాయి.

మోదీ కార్యక్రమానికి యడ్డి డుమ్మా

- అధికారిక కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి గైర్హాజరు
- కర్ణాటక రాజకీయాల్లో చర్చ
- బీజేపీ, సీఎం బొమ్మైపై అసంతృప్తే కారణం!



సాక్షి బెంగళూరు: కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి (హుబ్లీ) నగరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న అధికారిక కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప గైర్హాజరయ్యారు. ఆయన గైర్హాజరు ప్రస్తుతం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గురువారం హుబ్లీ రైల్వే మైదానంలో జాతీయ యువ జనోత్సవానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. పలువురు బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నప్పటికీ బీఎస్ యడియూరప్ప మాత్రం కనిపించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయన కొన్ని నెలలుగా పార్టీ వైఖరి పట్ల అసంతృప్తితో ఉన్నారని ప్రచారం సాగుతోంది. బీజేపీ తనను నిర్లక్ష్యం చేస్తోందని, ప్రజల్లో వ్యక్తిగతంగా బలమున్న తనను రాజకీయంగా ఎవరూ అంతం చేయలేరని పలు సందర్భాల్లో అనుచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తన రాజకీయ జీవితానికి ఎవరూ ఫుల్‌స్టాప్ పెట్టలేరని యడియూరప్ప ఒకసారి బహిరంగంగా వ్యాఖ్యానించారు. మరోవైపు ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, యడియూరప్ప మధ్య విభేదాలు ముదురుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తనను ముఖ్యమంత్రి పదవి నుంచి అర్ధాంతరంగా తప్పించారని యడియూరప్ప రగిలిపోతున్నారు. తన అనుచరుడైన బొమ్మైని సీఎం కుర్చీలో కూర్చోబెట్టడం జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రభుత్వంలో పదవి లేకపోవడం వల్లే..

యడియూరప్ప అసంతృప్తిని గుర్తించిన బీజేపీ అధిష్టానం గత ఏడాది పార్టీ పార్లమెంటరీ బోర్డు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమించింది. అయితే, రాష్ట్ర బీజేపీలో ఆశించిన గౌరవం దక్కకపోవడంతో జనసంకల్ప యాత్రలో ఆయన పాల్గొనలేదు. పార్టీ పెద్దలు దిగివచ్చి బుజ్జగించాల్సి వచ్చింది. ఇటీవలే మాండ్య జిల్లాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు యడియూరప్ప డుమ్మా కొట్టారు. తాజాగా ప్రధాని మోదీ హుబ్లీ పర్యటనకు సైతం దూరంగా ఉండిపోయారు. రాష్ట్ర బీజేపీ వాదన మరోలా ఉంది. జాతీయ యువజనోత్సవానికి మాజీ సీఎంకు ఆహ్వానం అందించలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కావడంతో ఆహ్వానించలేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వంలో యడియూరప్పకు ప్రస్తుతం ఎలాంటి పదవి లేదని, అందుకే ఆహ్వానం పంపలేదని కర్ణాటక బీజేపీ వెల్లడించింది.

యువశక్తి.. దేశ చోదక శక్తి

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ప్రధాని మోదీ

హుబ్బళ్లి: మన దేశాన్ని ముందుకు నడిపించే చోదక శక్తి యువశక్తేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశ ఆర్థిక ప్రగతి యువతరానికి ఎన్నో గొప్ప అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం కర్ణాటకలోని హుబ్బళ్లిలో రైల్వే స్పోర్ట్స్ గ్రౌండ్ నేషనల్ యూత్ ఫెస్టివల్‌ను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బొమ్మల తయారీ నుంచి పర్యాటకం దాకా, రక్షణ నుంచి డిజిటల్ దాకా ఎన్నో అంశాల్లో మనదేశం ప్రపంచ యవనికపై తనదైన ముద్ర వేస్తోందని, వార్తల్లో నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఈ శతాబ్దం భారత దేశ శతాబ్దమని ప్రపంచమంతా ముక్తకంఠంతో అంగీకరిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇది మన శతాబ్దం, భారతదేశ యువతకు చెందిన శతాబ్దమని పేర్కొన్నారు. చరిత్రలో ఇదొక ప్రత్యేక సందర్భమని అన్నారు. ఇప్పటి యువతరం ప్రత్యేక తరమని తెలిపారు. అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టను మరింత పెంచాల్సిన బాధ్యత యువతపై ఉందని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత్‌ను అత్యంత ప్రభావవంతమైన దేశంగా తీర్చిదిద్దడానికి యువతరం నడుం బిగించాలని సూచించారు.



హుబ్బళ్లిలో రోడ్ షోలో మోదీ అభివాదం

మోదీ రోడ్డు షో

ప్రధాని మోదీ గురువారం హుబ్బళ్లిలో రోడ్డు షోలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరి ఆయనకు అభివాదం చేశారు. మోదీ, మోదీ.. భారత్‌మాతా కీ జై అంటూ బిగ్గరగా నినదించారు. మోదీ వాహన శ్రేణిపై పూలు చల్లుతూ తమ అభిమానం చాటుకున్నారు. మోదీ సైతం చేతులు ఊపుతూ ఉత్సాహంగా ప్రజలకు అభివాదం చేశారు.

మోదీ రోడ్డు షోలో యువకుడి కలకలం

హుబ్బళ్లిలో ప్రధాని మోదీ రోడ్డు షోలో భద్రతా లోపాలు బహిర్గతమయ్యాయి. ఓ యువకుడు తీవ్ర కలకలం సృష్టించాడు. వాహనంపై ఉన్న మోదీ మెడలో పూలమాల వేసేందుకు ప్రయత్నించాడు. భద్రతా వలయాన్ని ఛేదించుకొని మరీ వేగంగా ముందుకు దూసుకొచ్చాడు. మోదీకి అత్యంత సమీపానికి చేరుకున్నాడు. మోదీ సైతం యువకుడి నుంచి పూలదండను స్వీకరించేందుకు తన వాహనం లోంచి చేతులు చాపారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై యువకుడిని అడ్డుకున్నారు. అతడి వద్ద నుంచి దండను తీసుకొని ప్రధానమంత్రికి అందజేశారు. ఆయన ఆ దండను తన కారులో ఉంచారు. స్థానిక పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

శతఘ్ని దళాల్లోకి మహిళా అధికారులు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద సాయుధ దళం 'ఆర్మీ' పోరాట విభాగంలోనూ మహిళలను చేర్చుకోవాలని నిర్ణయించింది. ముందుగా ఆర్టిలరీ (శతఘ్ని)దళాల్లో మహిళా అధికారులను చేర్చుకునేందుకు ఉద్దేశించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపించినట్లు ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే చెప్పారు. ఈ ప్రతిపాదన ఆమోదం పొందుతుందని భావిస్తున్నామన్నారు. ఇది కార్యరూపం దాలిస్తే బోఫోర్స్ హొవిట్జర్, కె–9 వజ్ర, ధనుష్ వంటి తుపాకులను ఇకపై మహిళలు కూడా ఉపయోగించగలుగుతారు. వీరు ఆర్టిలరీ పోరాట సహాయక విభాగంలో ఉంటారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పదాతి దళం తర్వాత రెండో అతి పెద్ద రెజిమెంట్ శతఘ్ని దళమే. నిర్ణాయక విభాగంగా భావించే కీలకమైన ఈ దళంలో మిస్సైళ్లు, మోర్టార్లు, రాకెట్ లాంఛర్లు, డ్రోన్లు మొదలైనవి ఉంటాయి. పదాతి దళం, శతఘ్ని, మెకనైజ్డ్ శతఘ్ని రెజిమెంట్లలో ఇప్పటి వరకు మహిళా అధికారులకు పర్మినెంట్ కమిషన్లు లేవు. సుప్రీంకోర్టు తీర్పుతో ఆర్మీ మార్పులు తెచ్చింది. మహిళలకు పర్మినెంట్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 2022లో ఖడక్‌వాస్లాలోని డిఫెన్స్ అకాడమీలోకి 19 మంది మహిళా కేడెట్లతో మొదటి బ్యాచ్‌కు మూడేళ్ల శిక్షణ ప్రారంభించింది. అయితే, ఇన్‌ఫాంట్రీ, ఆర్మర్డ్ రెడ్ కార్ప్స్, మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీల్లోకి మహిళా అధికారులను చేర్చుకోవాలన్న ప్రణాళికలేవీ లేవని రక్షణ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

గంగా నదిలో హైలెస్సా..

- ప్రపంచంలో అత్యంత సుదీర్ఘమైన నది నౌకా ప్రయాణం
- నేడు వారణాసిలో గంగావిలాస్ నౌకను ప్రారంభించనున్న మోదీ
- అత్యంత విలాసవంతమైన నౌకలో 50 రోజుల ప్రయాణం



ప్రపంచంలో నదుల మీదుగా సాగే అరుదైన, అత్యంత సుదీర్ఘమైన నౌకా ప్రయాణానికి పుణ్యక్షేత్రం వారణాసి వేదిక కానుంది. ఎంవీ గంగావిలాస్ అని పిలిచే ఈ నౌకా ప్రయాణం 27 నదుల మీదుగా సాగుతుంది. సాధారణంగా నౌక ప్రయాణాలంటే సముద్ర జలాల మీదుగా సాగుతాయి. కానీ ఇలా నదుల మీదుగా సాగే అరుదైన నౌకా ప్రయాణం భారత్‌లో ప్రారంభం కావడం ఇదే తొలిసారి. భారత్ ఘనమైన సంస్కృతి, చరిత్రలను తెలుసుకుంటూ, మన దేశ వారసత్వ పరంపరని అవగాహన చేసుకుంటూ, జాతీయ ఉద్యాన వనాల అందాలను తిలకిస్తూ ఈ ప్రయాణం సాగుతుంది. భారత్‌తో పాటు బంగ్లాదేశ్ చారిత్రక, సాంస్కృతిక మూలాలను తెలుసుకునే అద్భుతమైన అవకాశం ఈ ప్రయాణం ద్వారా లభిస్తుంది. భారత్‌లో పర్యాటక రంగానికి పెరుగుతున్న ఆదరణని దృష్టిలో ఉంచుకొని ఈ నౌక ప్రయాణాన్ని తీర్చి దిద్దారు. ఈ నెల 13, శుక్రవారం నాడు ఈ నౌక ప్రయాణాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నౌకా ప్రయాణం విశేషాలేంటో తెలుసుకుందాం.

- వారణాసి నుంచి బయల్దేరే గంగా విలాస్ మొత్తం 3,200 కి.మీ. ప్రయాణించి బంగ్లాదేశ్ మీదుగా అసోంలో దిబ్రుగఢ్‌కు చేరుకుంటుంది.
- ఈ మొత్తం ప్రయాణానికి 51 రోజులు సమయం పడుతుంది. 27 నదుల్ని దాటుకుంటూ ప్రయాణం సాగుతుంది.
- మూడు అంతస్తులు ఉండే గంగా విలాస్‌లో 18 సూట్స్ ఉన్నాయి.
- గంగావిలాస్ మొదటి జర్నీ కోసం 32 మంది న్యూజిలాండ్ పర్యాటకులు ఏకంగా నౌక మొత్తాన్ని బుక్ చేసుకున్నారు.
- ఇందులో ప్రయాణానికి ఒక్కో వ్యక్తికి రోజుకి రూ.25,000 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. అంటే మొత్తం ప్రయాణానికి 12 లక్షల 50 వేలు ఖర్చు అవుతుంది.
- antara luxury river cruises సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే సదుపాయం ఉంది.
- 62 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు , సౌకర్యవంతంగా ప్రయాణించడానికి వీలుగా 1.4 మీటర్ల డ్రాఫ్ట్ ఉంది .
- ప్రయాణికుల కోసం అత్యంత విలాసవంతమైన ఏర్పాట్లు చేశారు. ప్రతీ రోజూ నౌకలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. జిమ్, స్పా వంటి సదుపాయాలతో పాటు వ్యక్తిగతంగా బట్లర్ సర్వీసు, నౌకపైకి వెళ్లి ప్రయాణాన్ని ఎంజాయ్ చేసే అవకాశం ఉంటుంది.
- ప్రపంచ వారసత్వ కట్టడాలు, జాతీయ ఉద్యానవనాలు, నదుల ఒడ్డున ఉండే పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రాధాన్యం కలిగిన పట్టణాలు వంటి 50 పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.
- బిహార్‌లో పట్నా, జార్ఖండ్‌లో సాహిబ్‌గంజ్, పశ్చిమ బెంగాల్‌లో కోలకతా, బంగ్లాదేశ్‌లో ఢాకా, అసోంలో గౌహతి పట్టణాలను గంగా విలాస్ కవర్ చేస్తుంది.
- బీహార్ స్కూల్ ఆఫ్ యోగ, విక్రమశిల యూనివర్సిటీలను విజ్ఞానం పంచే ప్రాంతాలు, సుందర్ బన్స్, బెంగాల్ డెల్టా ప్రాంతాలు, కజిరంగ నేషనల్ పార్క్ వంటి జాతీయ ఉద్యానవనాలను సందర్శించవచ్చు.
- మొదటి రోజు వారణాసిలో గంగా హారతిని సందర్శించిన అనంతరం ఈ నౌక బయల్దేరుతుంది. ఎనిమిదో రోజు పట్నాకి, 20వ రోజు కోల్‌కతాకి 35వ రోజున బంగ్లాదేశ్‌లో ఢాకాకి చేరుకుంటుంది. ఇక 50వ రోజు అంటే మార్చి 1న తిరిగి అసోంలోని దిబ్రుగఢ్‌కి చేరుకుంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంక్షోభంలో ప్రపంచం

న్యూఢిల్లీ: ప్రపంచం మొత్తం సంక్షోభ స్థితిలో చిక్కుకుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అనిశ్చిత పరిస్థితి ఇంకా ఎంతకాలం ఉంటుందో చెప్పడం చాలా కష్టమని అన్నారు. ఈ నేపథ్యంలో మనం తయారు చేయని వ్యవస్థలు, పరిస్థితులపై ఆధారపడడం సరైంది కాదని గ్లోబల్ సౌత్‌కు సూచించారు. 21వ శతాబ్దంలో ప్రపంచ అభివృద్ధికి దక్షిణాది దేశాలే చోదక శక్తులని తేల్చిచెప్పారు. గురువారం 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' వర్చువల్ సదస్సు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆహారం, ఇంధనం, ఎరువుల ధరల పెరుగుదల, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్–19 ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న ప్రకృతి విపత్తులపై ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరం మనందరికీ కొంగొత్త ఆశలు, నూతన శక్తిని తీసుకొస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలను గ్లోబల్ సౌత్‌గా వ్యవహరిస్తారు.

అరవణ ప్రసాద విక్రయాలు ఆపండి

తిరువనంతపురం: శబరిమలలో అరవణ ప్రసాదం విక్రయాలను నిలిపివేయాలని ట్రావెన్‌కోర్ దేవాస్వోమ్ బోర్డు (టీడీబీ)ను కేరళ హైకోర్టు తాజాగా ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ఈ ప్రసాదం తయారీకి ఉపయోగించిన యాలకుల్లో పరిమితికి మించి పురుగు మందుల అవశేషాలు ఉన్నట్లు నిర్ధారణ కావడమే ఇందుకు కారణం. యాలకులు లేకుండా తయారు చేసిన లేదా నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యమైన యాలకులు ఉపయోగించిన తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు విక్రయించవచ్చని న్యాయస్థానం సూచించింది. కొల్లాంకు చెందిన అయ్యప్ప స్పైసెస్ అనే కంపెనీ నుంచి దేవాస్వోమ్ బోర్డు కొనుగోలు చేసిన యాలకుల్లో 14 రకాల పురుగు మందుల ఆనవాళ్లు అనుమతించిన పరిమితి(ఎంఆర్ఎల్) కంటే అధికంగా ఉన్నట్లు రసాయన విశ్లేషణలో తేలింది. అయ్యప్ప స్పైసెస్ సంస్థ విజ్ఞప్తి మేరకు తిరువనంతపురంలోని ప్రభుత్వ ప్రయోగశాలతోపాటు భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు పొందిన ప్రయోగశాలలోనూ యాలకులపై పరీక్షలు నిర్వహించారు. అవి సురక్షితం కాదని తేటతెల్లమయ్యింది. ప్రమాణాల మేరకు లేని యాలకులతో తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆహార భద్రత కమిషనర్‌కు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. 2021–22లో యాలకుల కొనుగోలు కోసం టీడీబీ అయ్యప్ప స్పైసెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. 2022–23లోనూ కొనడానికి అంగీకరించింది. వేలం పాట గానీ, పత్రికల్లో ప్రకటన గానీ లేకుండానే ఈ ఒప్పందం కుదరడం గమనార్హం.

ఎయిర్‌పోర్ట్‌లో యురేనియం కలకలం

- పాకిస్తాన్ నుంచి వచ్చిన పార్సిల్‌లో కనుగొన్న సిబ్బంది

లండన్: లండన్‌లోని అత్యంత రద్దీగా ఉండే హీత్రో అంతర్జాతీయ విమానాశ్రయంలో యురేనియం ఉన్న పార్సిల్ కలకలం సృష్టించింది. రెండు వారాల క్రితం అంటే గత ఏడాది డిసెంబర్ 29న జరిగిన ఈ ఘటనలో ఆలస్యంగా వెలుగుచూసింది. పాకిస్తాన్‌లోని కరాచీ నగరం నుంచి ఈ పార్సిల్ బ్రిటన్‌కు చేరినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. తుక్కు, ఖనిజాలకు సంబంధించిన కార్గో పార్సిళ్ల మధ్యలో ఈ యురేనియం నింపిన పార్సిల్ ఒకదానిని ఎయిర్‌పోర్ట్ కార్గో సిబ్బంది స్కానింగ్ తనిఖీల సమయంలో గుర్తించారు. ఒక ఖనిజం కడ్డీల అడుగున దీనిని దాచి ఉంచినట్లు అధికారులు తెలిపారు. వెంటనే దీనిని బోర్డర్ ఆఫీసర్లకు అప్పగించగా దూరంగా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దేశ ఉగ్రవ్యతిరేక దళాలకు ఇచ్చేశారు. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతుంది. కరాచీ నుంచి ఒమన్‌లోని మస్కట్‌కు అక్కడి నుంచి ఒమన్ ఎయిర్‌లైన్స్ ద్వారా లండన్‌కు వచ్చినట్లు తేల్చారు. ఇరాన్ జాతీయులకు అందజేసేందుకే దానిని బ్రిటన్‌కు తరలించారని బ్రిటిష్ మీడియాలో వార్తలొచ్చాయి. పాక్, ఒమన్‌లలో తనిఖీలను దాటించేసి బ్రిటన్‌కు యురేనియంను తరలించడం ఆందోళనకర విషయమని బ్రిటన్ సైన్యంలో రసాయనిక ఆయుధాల విభాగం మాజీ అధిపతి హ్యామిస్ బ్రెటన్ గార్డన్ వ్యాఖ్యానించారు. శిలల నుంచి సేకరించే రేడియోధార్మిక యురేనియంను అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, రియాక్టర్లలో ఇంధనంగా వినియోగిస్తారు. జలాంతర్గామి, అణ్వాయుధాల్లోనూ వాడతారు. లండన్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమైన పార్సిల్‌తో మాకు ఎలాంటి ప్రమేయం లేదని పాకిస్తాన్ తేల్చి చెప్పింది. మీడియాలో వచ్చే వార్తలన్నీ ఊహాత్మకమని పాకిస్తాన్ విదేశాంగ శాఖ స్పష్టంచేసింది.

ప్రభుత్వ నిర్ణయంపై భట్రాజు సంఘం హర్షం

సాక్షి, అమరావతి: 'భట్రాజు పొగడ్తలు' అనే పదాన్ని ఉపయోగించకూడదంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై భట్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ కూరపాటి రామరాజు, భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల ఫకీర్‌రాజు తదితరులు హర్షం వ్యక్తంచేశారు. వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక టూరిస్ట్ పోలీసింగ్

విశాఖ ఆర్‌కే బీచ్‌లో త్వరలో ప్రారంభం.. అన్ని పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం

- సమాచారం ఇవ్వడమే కాకుండా సమస్య వస్తే తక్షణ స్పందన
- జీ-20 సదస్సు నేపథ్యంలో వేగవంతమైన చర్యలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ వెళ్లే పర్యాటకులను 'హాయ్ వెల్‌కం టు వైజాగ్. హౌ కెన్ ఐ హెల్ప్ యూ'.. 'ఇన్ వైజాగ్ యూ కెన్ సీ ఆర్‌కే బీచ్, రుషికొండ, భీమిలి, కైలాసగిరి, సింహాచలం టెంపుల్. ఇఫ్ యూ హేవ్ ఎనీ ప్రాబ్లమ్. ప్లీజ్ కాంటాక్ట్ అజ్' అంటూ ప్రేమగా పలకరించేందుకు ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీసులు అందుబాటులోకి రానున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు సమస్త సమాచారాన్ని అందివడంతో పాటు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించేలా టూరిస్ట్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. మొదటగా విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీస్ కియోస్క్ ఏర్పాటు చేయనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన పర్యాటక ప్రదేశాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తారు. ఉమ్మడి విశాఖలో చూడదగిన పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని బ్రోచర్ల రూపంలో అందుబాటులో ఉంచనున్నారు. పర్యాటకులు ఏదైనా వస్తువు పోగొట్టుకున్నా.. ఎవరైనా తప్పిపోయినా వీరికి ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. పర్యాటకుల నుంచి ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే కూడా వీరికి సమాచారం ఇస్తే చర్యలు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి ప్రయాణం సాఫీగా సాగేలా చూడటం తోపాటు మరోసారి వచ్చే విధంగా ఆకర్షించేందుకు టూరిస్ట్ పోలీసింగ్ తోడ్పడుతుందనేది ప్రభుత్వ వర్గాల భావన.


ఆర్‌కే బీచ్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కియోస్క్

జీ-20 సమావేశాల నేపథ్యంలో..

విశాఖలో వరుసగా వివిధ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 28, 29 తేదీల్లో జీ-20 దేశాల సమావేశాలకు కూడా విశాఖ వేదిక కాబోతోంది. దీనికి విదేశాల నుంచి ప్రతినిధులు రానున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం ప్రతినిధులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కూడా ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీసింగ్ విధానం ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. దేశవ్యాప్తంగా మొత్తం 55 ప్రాంతాల్లో 200 వరకూ జీ-20 గ్రూప్ సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే.

2016 నుంచీ చేయాలనుకున్నా..

వాస్తవానికి దేశంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసింగ్ అభివృద్ధి చేయాలని కేంద్రం స్పష్టంగా చెప్పింది. ఇందుకు అనుగుణంగా 2016లోనే ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఈ విధానం అమలుకు నోచుకోలేదు. 2019లో 25 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. అయితే, కోవిడ్ నేపథ్యంలో అమలుకు నోచుకోలేదు. తాజాగా జీ-20 సమావేశాల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ విశాఖలో ఈ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

కియోస్క్ ఏర్పాటు చేస్తున్నాం

విశాఖ నగరంలో టూరిస్ట్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం ఆర్‌కే బీచ్ ప్రాంతంలో మొదటగా ఒక కియోస్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ ప్రత్యేకంగా పర్యాటకులకు సేవలందించేందుకు పోలీసులు అందుబాటులో ఉంటారు. తర్వాత మిగిలిన పర్యాటక ప్రదేశాలైన భీమిలి, రుషికొండ, తెన్నేటి పార్కు, కైలాసగిరి, యారాడ వంటి ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

– శ్రీకాంత్, నగర పోలీస్ కమిషనర్

క్విజ్ చాంపియన్‌షిప్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి క్విజ్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు ఉన్నత విద్యాసంస్థల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి వై.నజీర్ అహ్మద్ తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 13 నుంచి 31 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులను 'హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్/క్విజ్.పీహెచ్‌పీ' వెబ్‌పోర్టల్ ద్వారా అందించాలన్నారు. ఈ క్విజ్ పోటీల్లో విజేత టీమ్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1 లక్ష, రూ.75వేలు, రూ.50వేలు అందించనున్నారు. ఎలిమినేషన్, ప్రిలిమినరీ, క్వాలిఫయర్స్, క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్, ఫైనల్ దశల కింద ఈ క్విజ్ పోటీలుంటాయి.

ఏప్రిల్ 14కు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం పూర్తి: మంత్రులు మేరుగు, ఆదిమూలపు

సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులు ఏప్రిల్ 14కు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఈ విగ్రహ నిర్మాణ పనుల్ని గురువారం మంత్రులు నాగార్జున, ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పి ఐదేళ్లు కాలయాపన చేసిందని విమర్శించారు. చేతల మనిషిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి చూపిస్తున్నారన్నారు. దేశచరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన బూట్లు వచ్చాయని, మిగిలిన భాగాలు దశలవారీగా వస్తాయని ఆయన తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పోలీసులు సూచించిన ప్రాంతాల్లో కాకుండా ఇరుకుసందుల్లోను, ఇబ్బందికరమైన రోడ్లపైన ఇష్టానుసారం సభలు జరపడంతో నిండుప్రాణాలు బలిగొన్న ఘటనలు ఆందోళన కలిగించాయని చెప్పారు. ప్రతిపక్షంలోను ప్రచారయావను ఆపుకోలేక 11 నిండుప్రాణాలు పోవడానికి చంద్రబాబు నిర్వహించిన సభలే కారణమని చెప్పారు.


పనులను పరిశీలిస్తున్న మంత్రులు

'డిపెండబిలిటీ' జలాలే అసలు సమస్య

- సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన ఏపీ న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా జలాల డిపెండబిలిటీ (కొంతకాలం వ్యవధిలో వార్షిక నీటి అభివృద్ధిపై ఆధారపడే ఉపరితల జలాలు)నే అసలు సమస్య అని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్త సుప్రీం కోర్టుకు స్పష్టంచేశారు. అనుమతుల్లేకుండానే కర్ణాటక నిర్మిస్తున్న నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల ఏపీకి తీరని నష్టమని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలిపారు. కృష్ణా జలాల వాటాల పంపకం (అవార్డు)పై ఏపీ, కర్ణాటక దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ రామసుబ్రహ్మణ్యన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. కర్ణాటక ఎలాంటి అనుమతులు లేకుండా 130 టీఎంసీల అదనపు జలాలతో 5 లక్షల హెక్టార్లకు సాగు నీరు అందిస్తామని చెబుతోందని వైద్యనాథన్ తెలిపారు. ఈ అదనపు నీటిని ఎలా తీసుకొస్తారో చెప్పాల్సిన బాధ్యత ఆ రాష్ట్రానిదే అని తెలిపారు. కేటాయించిన జలాల కంటే ఎక్కువ నీటిని కర్ణాటక, మహారాష్ట్ర వినియోగించుకుంటే ఏపీ, తెలంగాణకు చుక్క నీరు ఉండదన్నారు. ఏపీ న్యాయవాది జైదీప్ గుప్త జోక్యం చేసుకుంటూ డిపెండబిలిటీ జలాలపై మూడు రకాల లెక్కలతో ట్రిబ్యునల్ తీర్పు ఇవ్వడం వల్లే నష్టం జరుగుతోందన్నారు. 75% డిపెండబిలిటీ ఆధారంగా 70వ దశకంలో ఏపీకి 667 టీఎంసీలు, 80వ దశకంలో 893 టీఎంసీలు మాత్రమే దక్కాయన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర వాదనల ప్రకారం 65% డిపెండబిలిటీ ఆధారంగా అయితే తెలుగు రాష్ట్రాలకు ఇంకా అన్యాయం జరుగుతుందన్నారు.

విమాన టికెట్ ధరలకు రెక్కలు

గన్నవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా విమాన టికెట్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ నుంచి విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చే విమానాలకు డిమాండ్ ఉంది. సాధారణ రోజుల్లో ఈ విమానాల టికెట్ ధరలు రూ.3,200 నుంచి రూ.6 వేలు వరకు ఉండగా, గురు, శుక్ర, శనివారాల్లో రూ. 8 వేలు నుంచి రూ.12 వేలకు పెరిగాయి. న్యూఢిల్లీ నుంచి వచ్చే ఎయిర్ ఇండియా విమాన టికెట్ ధరలు సాధారణ రోజుల్లో రూ.7,355 ఉండగా, శుక్రవారం టికెట్ ధర ఏకంగా రూ. 24,947కు చేరుకుంది.

ఫిబ్రవరిలో 'తెలుగు సేన' బస్సు యాత్ర: గద్దర్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కులాల ఔన్నత్యం పెరుగుతోన్న ఈ రోజుల్లో 675 కులాలుగా ఉండి, భౌగోళికంగా విడిపోయిన తెలుగు జాతిని ఐక్యం చేసేందుకు సాంస్కృతిక తెలుగు సేన ముందుకు వచ్చిందని ప్రజా గాయకుడు గద్దర్ తెలిపారు. తెలుగు సేన పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు సేన అధ్యక్షుడు సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాద్‌లో బస్సు యాత్రను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 10 రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలు, బస్సు యాత్రలు, రోడ్ షోలు నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా అన్ని ప్రాంతాల్లో ఈ యాత్ర సాగుతుందని చెప్పారు. తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఒక జాతిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సామాన్య భక్తుల గదుల అద్దె పెంచలేదు

- టీటీడీపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల: సామాన్య భక్తులు బస చేసే గదుల అద్దెను అసలు పెంచలేదని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్పష్టం చేశారు. వారి సౌకర్యార్థం రూ.50, రూ.100 అద్దె గదులను రూ.120 కోట్లతో ఆధునీకరించామని చెప్పారు. సామాన్య భక్తులపై అధిక భారం మోపారంటూ ప్రసార మాధ్యమాల్లో టీటీడీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులను కోరారు. గురువారం ఆయన తిరుమలలో మీడియాతో మాట్లాడారు. తిరుమలలో మొత్తం 7,500 గదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో సామాన్య భక్తుల కోసం రూ.50, రూ.100 అద్దె గల గదులు 5 వేల వరకు ఉన్నాయని తెలిపారు. వీటిని భక్తులకు అత్యంత సౌకర్యవంతంగా తీర్చిదిద్దామని చెప్పారు. ఇందుకోసం విద్యుత్ చార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులకు గాను రోజుకు ఒక గదికి రూ.250 వ్యయమవుతోందని చెప్పారు. ఇలా అదనపు భారం పడుతున్నా కూడా అద్దెను పెంచలేదని స్పష్టం చేశారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం రూ.100 కోట్లతో పీఏసీ-5 నిర్మిస్తున్నట్టు తెలిపారు. వీఐపీలకు కేటాయించే నారాయణగిరి-1, 2, 3, 4 విశ్రాంతి గృహాలు, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్ టైప్, వీవీఆర్‌హెచ్ విశ్రాంతి గృహాల్లోని మొత్తం 170 గదులను గీజర్, ఏసీ, ఉడెన్‌కాట్, దివాన్‌కాట్ తదితర వసతులతో రూ.8 కోట్లతో ఆధునీకరించినట్టు చెప్పారు. వీఐపీల కోసం కేటాయించే గదుల్లో అద్దె వ్యత్యాసం లేకుండా చేసేందుకు.. నారాయణగిరి, ఎస్వీఆర్‌హెచ్, స్పెషల్ టైప్ విశ్రాంతి గృహాలను ఆధునీకరించి తగిన అద్దెను మాత్రమే నిర్ణయించామన్నారు.

ఆగమశాస్త్రం ప్రకారమే వైకుంఠ ద్వార దర్శనం

వైష్ణవాలయాల్లో 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించవచ్చని దేశవ్యాప్తంగా ఉన్న 32 మంది మఠాధిపతులు, పీఠాధిపతులు తెలియజేశారని ఈవో ధర్మారెడ్డి చెప్పారు. తద్వారా ఎక్కువ మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకోగలిగారని తెలిపారు. కానీ 10 రోజుల పాటు వైకుంఠ ద్వారం తెరిచి వ్యాపారం చేశారని టీటీడీ మాజీ చైర్మన్ ఆరోపించడం భావ్యం కాదన్నారు. ఆధునీకరించిన గదులను ధర్మారెడ్డి మీడియాకు చూపించారు. అక్కడి సౌకర్యాల గురించి వారికి వివరించారు.

దుర్గమ్మ సేవలో నీతి ఆయోగ్ సభ్యుడు సారస్వత్

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి పంచ హారతుల సేవలో పాల్గొనేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన సారస్వత్‌కు ఆలయాధికారులు స్వాగతం పలికారు. పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.


ఆశీర్వచన మండపంలో సారస్వత్

16 నుంచి మహాసౌరం, అరుణ యాగం

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠాధిపతులు జగద్గురు భారతీ తీర్థమహాస్వామి ఆదేశంతో 16వ తేదీ నుంచి 73 రోజులపాటు శృంగేరీ శారదాపీఠం రామకోటిలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పీఠం ధర్మాధికారి శిష్ట్యా హనుమత్ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని రామకోటిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతీ తీర్థ మహాస్వామి 73వ జన్మదిన వేడుకలు ప్రపంచ శాంతి స్థాపన కోసం ప్రతి రోజూ గురు వందనం, శ్రీ సూర్యనారాయణ స్వామి అర్చన, మహాసౌరం, అరుణ యాగం, సూర్య నమస్కారాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పూజాది కార్యక్రమంలో పాల్గొన వచ్చునని దక్షిణభారత దేశంలో తొలి సారిగా పెద్ద ఎత్తున జరుగుతోందని తెలిపారు. శృంగేరీ శారదాపీఠం నగరశాఖ నిర్వాహణ సంఘం బాధ్యులు గండూరి చంద్రశేఖర సాంబమూర్తి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వేద పండితులు మహాయాగ క్రతువుల్లో భాగస్వాములు అవుతారన్నారు. 73 రోజులలో సౌర అష్టాక్షరి నామజపం 8 లక్షల సంఖ్య లక్ష్యంగా జరుగుతుందన్నారు. మార్చి 29 వ తేది జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి జన్మదినం సందర్భంగా అరుణహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రోచర్‌ను హనుమత్ ప్రసాద్, చంద్రశేఖర సాంబమూర్తి ఆవిష్కరించారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హనుమత్ ప్రసాద్, చంద్రశేఖర సాంబమూర్తి

2023 క్రీడా షెడ్యూల్‌ను విడుదల చేసిన శాప్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాప్ లీగ్-2023 పోటీలకు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతి నెలా క్రీడా పోటీలను నిర్వహించనుంది. 36 క్రీడాంశాల్లో జిల్లా, జోనల్ స్థాయిలో టోర్నీలకు డీఎస్‌ఏలు, చీఫ్ కోచ్‌లు సన్నద్ధం కావాలని ఆదేశించింది. క్రీడా ప్రాధికార సంస్థ స్వయంగా టోర్నీలు నిర్వహించడం దేశంలోనే తొలిసారిగా ఏపీ నుంచే ప్రారంభమవడం విశేషం. గతేడాది శాప్ లీగ్స్‌కు భారీ స్పందన రావడం, క్రీడాకారుల వ్యక్తిగత, నైపుణ్య వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం మంచి ఫలితాలను ఇస్తోంది.

క్లుప్తంగా...

పశుసంవర్ధక సహాయక పోస్టుల భర్తీకి అనుమతి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 4,765 పశుసంవర్ధక సహాయక పోస్టుల భర్తీకి అనుమతినిస్తూ పాడి, పశుసంవర్ధక శాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ వై.మధుసూదనరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో 10,778 ఆర్బీకేలు ఉండగా, 4,652 ఆర్బీకేల్లో పశుసంవర్ధక సహాయకులు విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన ఆర్బీకేల్లో ఉన్న పాడి సంపదను బట్టి 4,765 ఆర్బీకేల్లో పోస్టులు భర్తీ చేయాలని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ నివేదిక ఇచ్చారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా ఈ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసేందుకు అనుమతినిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: డిపార్ట్‌మెంటల్ టెస్ట్–నవంబర్ 2022లోని లాంగ్వేజ్, సర్వే డిస్క్రిప్టివ్ టైప్ పేపర్లకు సంబంధించిన ఫలితాలను విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ గురువారం తెలిపింది. ఫలితాలను 'పీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఐఎన్'లో పొందుపరిచినట్లు పేర్కొంది.

'స్పాన్సర్డ్' కోటా పీజీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో 2022–23 విద్యా సంవత్సరానికి ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీ. రామారావు గురువారం తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి చేసిన దరఖాస్తులను వ్యక్తిగతంగా కానీ, పోస్టు ద్వారా కానీ ఈ నెల 31వ తేదీలోగా రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాంఫాం, గుంటూరు 522034 అడ్రస్‌కు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

ఏపీ ఆర్‌సెట్ కన్వీనర్‌గా ఆచార్య దేవప్రసాద్‌రాజు



దేవప్రసాద్‌రాజుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్

తిరుచానూరు (తిరుపతి జిల్లా): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఏపీ ఆర్‌సెట్–2023 నిర్వహణ బాధ్యతలను ఎస్వీ యూనివర్సిటీకి అప్పగించింది. ఈ సెట్‌కు కన్వీనర్‌గా ఎస్వీయూ భౌతికశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ దేవ ప్రసాద్ రాజును నియమించింది. ఈ మేరకు నియామకపత్రాన్ని గురువారం ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య మహ్మద్ హుస్సేన్, ఆచార్య దేవప్రసాద్‌రాజుకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

ఆర్టీసీని ప్రగతి పథంలోకి తీసుకువెళ్దాం

ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం (ఆర్టీసీ) అభివృద్ధికి ఉద్యోగులు అందరూ పునరంకితం కావాలని ఆ సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆర్టీసీ ఉద్యోగులకు గురువారం లేఖ రాశారు. ఆర్టీసీని ప్రగతి పథంలోకి తీసుకువెళ్లేందుకు సహకరించాలని ఉద్యోగులను కోరారు. ఆర్టీసీ పట్ల సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వ పే స్కేల్ వర్తింపజేశారని గుర్తు చేశారు. కొత్త బస్సులు, తొలిసారిగా ఈ–బస్సులను ప్రవేశపెట్టడం, కార్గో సేవలను విస్తరించడం మొదలైన చర్యలతో ఆర్టీసీ ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేటు పెరుగుతుండటం శుభసూచకమన్నారు. ఆర్టీసీ పలు అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమన్నారు.

జెరుసలేం యాత్రకు ప్రభుత్వ సాయం

యాత్రను ప్రారంభించిన మైనారిటీ సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్



జెరుసలేం యాత్రను ప్రారంభిస్తున్న ఇంతియాజ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రైస్తవ సోదరుల జెరుసలేం యాత్రకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. ఈ ఏడాది ఏపీ నుంచి జెరుసలేం యాత్రకు తొలి విడత వెళ్తున్న యాత్రికుల బస్సును విజయవాడలో గురువారం రాత్రి ఇంతియాజ్ జెండా ఊపి ప్రారంభించారు. 40 మంది బస్సులో హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి జెరుసలేం యాత్రకు వెళ్తారన్నారు. క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎలీషా, డైరెక్టర్ జక్కుల ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.



అరుదైన కలివికోడి



వైట్ బ్యాక్డ్ రాబందు



సైబీరియన్ క్రేన్



బెంగాల్ ఫ్లోరికన్ పక్షి

అంతరిస్తున్న అతిథి పక్షులు



కొల్లేరులో పక్షులు

దేశానికి వచ్చే 29 పక్షి జాతులు ప్రమాదం అంచున ఉన్నట్టు గుర్తింపు

- 15 జాతుల పక్షుల ముప్పును గుర్తించిన ఐయూసీఎన్
- ఆందోళన కలిగిస్తున్న రెడ్ లిస్ట్ హెచ్చరికలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వలస పక్షులకు ముప్పు వచ్చి పడుతోంది. విదేశాల నుంచి కొల్లేరు వలస వచ్చే వైట్ బ్యాక్డ్ రాబందు, సైబీరియన్ క్రేన్, బెంగాల్ ఫ్లోరికన్ వంటి పక్షి జాతులు కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా.. తరుగుతున్న అడవులు.. మిరుమిట్లు గొలిపే కాంతులు.. ఆహార కొరత పక్షుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ప్రకృతిలో సంభవిస్తున్న మార్పులు, మానవ తప్పిదాల కారణంగా అరుదైన పక్షి జాతులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. విదేశాల నుంచి మన దేశానికి వచ్చే 29 పక్షి జాతులు ప్రమాదం అంచున ఉన్నట్టు పక్షి ప్రేమికుల పరిశీలనలో వెల్లడైంది. ఇప్పటికే 15 జాతుల పక్షులు అంతరించే జాబితాలో చేరాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) రెడ్ లిస్ట్ ద్వారా ప్రకటించింది. రాష్ట్రంలోని కొల్లేరు ప్రాంతానికి ఏటా దాదాపు 6 లక్షల పక్షులు వస్తుంటాయి. వీటిలో అనేక జాతులు ప్రమాదం అంచున ఉన్నాయని పక్షి శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

గ్రేట్ ఇండియన్ బస్టర్డ్.. సైబీరియన్ క్రేన్ కనిపించట్లేదు

ఐయూసీఎన్ విడుదల చేసిన రెడ్‌లిస్ట్‌లో ఐత్య బేరీ, అటవీ గుడ్ల గూబ, గ్రేట్ ఇండియన్ బస్టర్డ్, బెంగాల్ ఫ్లోరికన్, సైబీరియన్ క్రేన్, స్నేహశీల లాఫ్టింగ్, వైట్ బ్యాక్డ్ రాబందు, రెడ్‌హెడ్ రాబందు, సన్న రాబందు, ఇండియన్ రాబందు, పింక్‌హెడ్ బాతు, హిమాలయ పిట్టను పూర్తిగా కనుమరుగవుతున్న జాబితాలో చేర్చారు. కలివికోడి జాడ కోసం కోసం పక్షి ప్రేమికులు కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ గాలిస్తున్నారు.

కనుమరుగవడానికి కారణాలెన్నో...

జీవరాశులన్నీ ఆహారపు గొలుసులో భాగంగా ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి. పూర్వం పశు కబేళాలను పీక్కు తినడానికి రాబందులు వచ్చేవి. వాటికి ఇప్పుడు ఆహార కొరత ఏర్పడింది. ఇటీవల ఆకాశ హర్మ్యాలలో అద్దాల గోడల వెనుక వెలిగే దీపాలను ఢీకొని అనేక పక్షులు మృత్యువాత పడుతున్నట్టు గుర్తించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, అయస్కాంత తరంగాలు, కరెంటు తీగలు, అడవుల్లో చెట్లు నరకడం, ధ్వని తరంగాలు, వేటగాళ్లు, వాయు, నీటి, భూమి కాలుష్యం పక్షి జాతుల అంతానికి కారణంగా మారుతున్నాయి.

ఆవాసాలు కోల్పోతున్నాయి



పక్షులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. ఇవి అక్షాంశాలు, రేఖాంశాల మధ్య సముద్ర తీరంలో ప్రయాణిస్తాయి. రసాయనాల వినియోగం పెరగడంతో వాటిని తిని పక్షులు మరణిస్తున్నాయి. పక్షులకు కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేయాలి. చెరువుల విస్తీర్ణం తగ్గడంతో వీటి మనుగడకు ప్రమాదం వాటిల్లుతోంది. పక్షులను రక్షించుకోవడం అందరి బాధ్యత.

- డాక్టర్ వి.సంధ్య, జువాలజీ లెక్చరర్, కైకలూరు

వినియోగదారులకు అండగా కాల్‌సెంటర్

- సమస్యల పరిష్కారానికి 1967 టోల్‌ఫ్రీ నంబరు
- పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వినియోగదారుల సాధికారతే ధ్యేయంగా.. వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు 1967 టోల్‌ఫ్రీ నంబర్‌తో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్టు పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ పంపిణీలో జాప్యం, నాణ్యత లోపాలు, బరువులో వ్యత్యాసం, ఎండీయూల నిర్లక్ష్యం, డీలర్లపై ఫిర్యాదులు, కొత్త బియ్యం కార్డుల మంజూరు, సభ్యుల విభజన, చేర్పులు, మార్పులు, కొత్తకార్డు అప్లికేషన్ స్థితి, ఒకే దేశం – ఒకే రేషన్, గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయకపోవడం, అదనపు రుసుము వసూలు, రశీదులు లేని వ్యవహారాలు, వస్తువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించడం, పెట్రోల్, డీజిల్ నాణ్యత, పెట్రోబంకుల్లో కనీస సౌకర్యాల కొరత, ధాన్యం సేకరణలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగే ప్రతి వ్యవహారంపైనా ఈ కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఆ ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ కాల్‌సెంటర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను బియ్యం పంపిణీచేసే ఎండీయూ వాహనాలపైన కూడా ముద్రించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో మండల వినియోగదారుల సేవాకేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తూ వినియోగదారులకు హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారాలపై సూచనలు చేస్తారని తెలిపారు.

నమ్మకంలేకే పొత్తుకెళ్తున్నా..

శ్రీకాకుళం జిల్లా యువశక్తి సభలో పవన్‌కళ్యాణ్



పవన్ సభ నుంచి బయటకు ఇనుప కంచెను ఎక్కి వెళ్లిపోతున్న యువతి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/ఎచ్చెర్ల క్యాంపస్, రణస్థలం, లావేరు, జి.సిగడాం: బలమైన శత్రువుతో పోరాడేందుకు అవసరమైనప్పుడు మనకు ఇష్టంలేకుండా ఓట్లు చీలకూడదన్న ఉద్దేశ్యంతో కొందరితో కలిసి వెళ్లాల్సి వస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. మనకు గౌరవం తగ్గకుండా పొత్తు కుదిరితే కలిసి వెళ్తామని లేదంటే ఒంటరిగా పోటీచేస్తామని తెలిపారు. అయినా, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పోటీచేసి గెలిచే సత్తాలేదన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తాళ్లవలసలో జరిగిన యువశక్తి బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. 'దశాబ్ద నుంచి ఒంటరిగానే పోరాడాను. ఒంటరిగా గెలిపిస్తామని గ్యారంటీ ఇవ్వగలుగుతారా? మీపై నమ్మకంలేదు. నమ్మకం వస్తే ఒంటరిగా పోటీచేస్తా. ఒంటరిగా వెళ్లి వీరమరణం పొందడం అవసరంలేదు.. మీ తల్లిదండ్రులతో మాట్లాడి చెప్పండి' అని సభకు హాజరైన పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. వచ్చేది జనసేన ప్రభుత్వం, లేదంటే మిశ్రమ ప్రభుత్వమని చెప్పారు. ఇక తన సభలకు జనాలు ఎక్కువగా వస్తారని, ఓట్లు మాత్రం వేయడంలేదని.. అలాగే, భారీగా సభలకు రావడంకాదని, ఎన్నికల వరకు ఇదే తీరులో వెళ్లి ఓట్లు వేయాలని కోరారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో రాజాంలో భారీగా ప్రజలు వచ్చారని.. తనకు ఓటు వేయలేదన్నారు.

జగన్ మూడు ముక్కల ముఖ్యమంత్రి..

'నా మూడు పెళ్లిళ్ల గురించి వైఎస్సార్‌సీపీ నేతలు ప్రస్తావిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌ను నేను మూడు ముక్కల ముఖ్యమంత్రి అంటాను. రాష్ట్రాన్ని ముక్కలు చేయాలని చూస్తే సహించేదిలేదు. వైఎస్సార్‌సీపీ నేతలు తనను నిలకడలేని రాజకీయ నాయకుడు, పార్ట్‌టైమ్ పొలిటీషియన్ అని అంటున్నారు. అసలు పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు ఎక్కడున్నారు? మంత్రులు అంబటి రాంబాబు, ధర్మాన ప్రసాదరావు వంటి వారికి నన్ను విమర్శించే స్థాయిలేదు. ప్రభుత్వ భూములు తనఖా పెడుతున్నా ప్రశ్నించలేని రెవెన్యూ మంత్రి ధర్మాన. మంత్రి రోజాకు నన్ను విమర్శించే స్థాయిలేదు. అంబటి రాంబాబు సంబరాల రాంబాబు. నాతో ఫొటో తీయించుకునే వాళ్లకు నన్ను విమర్శించే అర్హత ఉందా. చంద్రబాబుతో భేటీ గురించి సజ్జల ఏదో మాట్లాడుతున్నారు. ఈ మూడు ముక్కల ముఖ్యమంత్రికి అంతా దంకాపలాసు సలహాదారులే. ఏపీలో ఎక్కువ మంది బూతుల మంత్రులే. ఇక నా వారాహి యాత్రను త్వరలోనే ప్రారంభిస్తా. ఎవరు అడ్డుకుంటారో చూస్తా. నవరత్నాలు వంటి ప్రభుత్వ పథకాలకు ఓట్లు వెయ్యొద్దు. భవిష్యత్ తరాల కోసమే రాజకీయం చేస్తున్నాను. నన్ను ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు అంటే చెప్పుతీసి కొడతాను. నేను చిన్నప్పుడే తీవ్రవాద గ్రూపుల్లో చేరాలని అనుకున్నాను. ఏపీలో మిశ్రమ ప్రభుత్వం వచ్చినా యువతకు ఉపాధి కల్పన, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు.. తీరంలో జెట్టీల నిర్మాణం చేపట్టి మత్స్యకారుల వలసలు నిర్మూలించేందుకు ముందుకుసాగుతాం. విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేయకుండా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాలి. అమిత్ షాతో మాట్లాడి ఏదో విధంగా దానిని ఆపడానికి ప్రయత్నిస్తా.' అని పవన్ అన్నారు.

ఇది చెప్పడానికే సభ పెట్టావా?

- నోరు అదుపులో పెట్టుకో.. నా దగ్గరా రెండు చెప్పులు ఉన్నాయి
- పవన్‌పై మాజీమంత్రి పేర్ని నాని ఆగ్రహం

సాక్షి, అమరావతి: చంద్రబాబు సంకలో చేరుతున్నానని, ఈ విషయం చెప్పడానికే రణస్థలంలో సభ పెట్టావా? అంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను మాజీమంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. మిమ్మల్ని నమ్మలేను.. ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేయరు అంటూ సభకు వచ్చిన నీ అభిమానులనే నువ్వు అవమానించడం నీకు సిగ్గుగా అన్పించడంలేదా? అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం రాత్రి పేర్ని మీడియాతో మాట్లాడుతూ పవన్ వ్యవహారశైలిని ఏకిపారేశారు. ఎన్నికల్లో ఇప్పటికే ఒకసారి ఒంటరిగా పోటీచేసి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతిలో వీరమరణం పొందాను.. మళ్లీ ఒంటరిగా పోటీచేసి కుక్కచావు చావలేననే నిజాన్ని పవన్ అంగీకరించారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఒంటరిగా పోటీచేస్తే కుక్కచావు తప్పదనే చంద్రబాబు సంకలో దూరుతున్నానని జనసేన కార్యకర్తలకు స్పష్టత ఇచ్చారంటూ దెప్పిపొడిచారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

మన ఇంటిముందు అత్తతో కొట్లాడితే మళ్లీ మాట్లాడమా.. అదే రీతిలో చంద్రబాబు, లోకేశ్‌లతో మళ్లీ కలిస్తే తప్పా అని నువ్వే అన్నావు.. అంటే.. చంద్రబాబుతో నీది అత్తా అల్లుడి సంబంధమని నువ్వే ఒప్పుకున్నావ్. దత్త తండ్రితో దత్తపుత్రుడికి ఉన్న సంబంధం అని నీ నోటితో నువ్వే అంగీకరించావు.. అదే మాట నిన్ను సీఎం వైఎస్ జగన్ అంటే ఎందుకంత ఉలికిపాటు? ఇక నుంచైనా నోటి జాడింపు మానుకుంటే మంచిది. లేదంటే నా దగ్గరా రెండు చెప్పులున్నాయి.. నేను కూడా తీయగలను.

మూడు ముక్కల నేతవు నువ్వే

- ఉత్తరాంధ్ర యువతకు స్ఫూర్తినింపుతానని, ప్రభుత్వానికి సూచనలు చేస్తానని నెలరోజులుగా చెప్తూ ఇవ్వాళ సీఎంను బూతులు తిట్టడం మినహా ఏమైనా చేశావా?
- 2014లో బీజేపీ, టీడీపీతో అంటకాగింది ఒక ముక్క.. 2019లో చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిట్టి సీపీఐ, సీపీఎం, బీఎస్పీలతో అంటకాగింది రెండో ముక్క.. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు సంకలో దూరింది మూడో ముక్క... నిజానికి మూడు ముక్కల నేతవు నువ్వే.
- బీజేపీతో మైత్రిబంధంలో ఉన్నానని చెబుతూనే చంద్రబాబుకు కన్నుకొడుతూ కాలుతొక్కుతున్నావు.. ఇది రాజకీయ వ్యభిచారం కాదా?
- 2014–19 మధ్య చంద్రబాబు, నువ్వు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పు. అప్పుడు ఉద్దానాన్ని ఎందుకు ఉద్ధరించలేకపోయావో చెప్పు. మత్స్యకారులు కనిపించలేదా..? జెట్టీ కట్టించాలని తెలియలేదా?
- రాజకీయం అంతా మూడు కులాలు మధ్యనే తిరుగుతోంది అంటున్న నువ్వు నీ వేదికపై ఇద్దరు కాపులు, ఒక కమ్మ మాత్రమే ఎందుకున్నారు? ఒక రజకుడు, బీసీ కూడా దొరకలేదా?
- చంద్రబాబు నువ్వు ఏం మాట్లాడుకున్నారో రాష్ట్రమంతా తెలుసు. అంబటి రాంబాబు గురించి 27 నిమిషాలు, ఐటీ మంత్రి గురించి 38 నిమిషాలు మాట్లాడుకున్నారట. హోంమంత్రి గురించి 22 నిమిషాలు మాట్లాడుకున్నారట.
- ఇంట్లో భార్య ఉండగా పరాయి మహిళతో సంబంధం పెట్టుకున్న వారిని వ్యవహారిక బాషలో తిరుగుబోతు అంటారని గిడుగు, గురజాడ అన్నారు.
- కార్యకర్తలనే నమ్మనంటున్నావు.. పోలింగ్ బూత్‌కి వెళ్లి ఫ్యాన్‌కి ఓటేశారని అంటున్నావు.. నీ బాధ పగవాడికి కూడా వద్దు.
- నువ్వు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలంటే 175 సీట్లకు పోటీచేయాలి కదా.. నువ్వే కుక్క చావు చస్తున్నానని నీ నోటితోనే చెప్తున్నావు...చంద్రబాబు సంకనెక్కితే కానీ ఏడవలేను అంటున్నావు.. మరి ముఖ్యమంత్రి ఎవరు? నిన్ను సీఎంగా చేయడానికి చంద్రబాబు ఒప్పుకోడు కదా.. పోనీ చంద్రబాబు వద్ద మంత్రిగా చేస్తావా? లేక ఎమ్మెల్సీ, రాజ్యసభ లాంటివి చేస్తావా.. అసలు నీ ఆలోచన ఏంటి?
- భావదారిద్ర్యంతో దిగజారి మా పార్టీ వారిని ఎన్ని తిట్టినా వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిటికెనవేలిపై వెంట్రుక కూడా ఊడదు.

మహిళలపై ఇదేనా నీకున్న గౌరవం?

- ఒక మాజీ నటి, మంత్రి రోజా గురించి దిగజారి మాట్లాడతావా? మీ ఇంట్లో ఆడవారు సినిమాల్లో నటించలేదా? వారిపట్ల కూడా నీది ఇదే అభిప్రాయమా? రోజా దమ్ముగా రెండుసార్లు జనంలో గెలిచింది. మంత్రిగా చేస్తోంది. నీలాగా రెండుచోట్లా ఓడిపోలేదు.

పవన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- వెనుకబడిన ప్రాంతాలను విమర్శించడం సరికాదు
- రాష్ట్ర వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్




మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదించిన మూడు రాజధానుల అంశంతోపాటు ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను కించపరుస్తూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట్లాడటాన్ని రాష్ట్ర వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ తీవ్రంగా ఖండించారు. త్వరలోనే కిడ్నీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న విషయం పవన్‌కళ్యాణ్‌కు తెలియదా... అని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సౌకర్యాన్ని సమకూర్చి, ఆ ప్రాంతంలో రీసెర్చ్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న వాస్తవాన్ని గ్రహించకుండా విమర్శించడం సరికాదన్నారు. ఇప్పటికే 63 డయాలసిస్ మెషిన్లు హరిపురం, కవిటి, పలాస, సోంపేట తదితర ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా ఈ పని చేశాయా అని ప్రశ్నించారు. ఇలాంటి ఎన్నో సమస్యలు పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రాంతాల అభివృద్ధికి మూడు రాజధానులను ప్రతిపాదించిందన్నారు. విశాఖ పరిపాలన రాజధానిగా కాకుండా ఆపడం ఎవరితరం కాదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సానుకూల ప్రకటన చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావును విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. మూడు రాజధానులకు, ఉత్తరాంధ్రకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా జాయింట్ యాక్షన్ కమిటీ నుంచి ప్రతిఘటన ఎదురవుతుందని హెచ్చరించారు.

'దసపల్లా' కథనాలపై పరువునష్టం దావా

- ఈ భూములు ప్రభుత్వానివి కావని ఇప్పటికే చెప్పిన కోర్టులు
- కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా ఇప్పటికే పలు తీర్పులు
- అమలు చేయకపోతే కోర్టు ధిక్కారం తప్పదన్న హైకోర్టు
- ఈ నెల 23లోగా చేయకుంటే వ్యక్తిగతంగా రావాలని కలెక్టర్‌కు స్పష్టీకరణ
- మార్గాంతరం లేక గతనెల 31న కోర్టు ఆదేశాలను అమలు చేసామన్న కలెక్టర్
- వివిధ శాఖలు క్లెయిమ్ చేస్తున్న 18.41 ఎకరాలు మాత్రం 22(ఏ)లోనే
- ఈ వాస్తవాలను ప్రస్తావించకుండా అబద్ధాలతో రెచ్చిపోయిన 'ఈనాడు'

'ఈనాడు'కు ఇప్పటికే నోటీసులిచ్చాం: రాణి కమలాదేవి

తప్పుడు కథనాలపై చట్టపరమైన చర్యలు: కలెక్టర్ మల్లికార్జున



హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ 2012 మొదట్లో సుప్రీం కోర్టు వెలువరించిన ఉత్తర్వులివి.

సుప్రీంకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను అదే సంవత్సరంలో కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు.

రివ్యూ పిటిషన్‌ను కొట్టివేయటాన్ని సవాలు చేస్తూ దాఖలైన క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా 2014లో సుప్రీం కోర్టు కొట్టివేసిన ఉత్తర్వులివి.

రివ్యూ, క్యూరేటివ్ పిటిషన్లను సైతం సుప్రీంకోర్టు కొట్టివేసిన తరువాత.. ఇక హైకోర్టు తీర్పును అమలు చేయటం తప్ప ప్రభుత్వం చేయగలిగిందేమీ లేదని అప్పటి అడ్వకేట్ జనరల్ ఏ. వేణుగోపాల్ నాటి రాష్ట్ర ప్రభుత్వానికి 2015లో ఇచ్చిన అభిప్రాయమిది.

దసపల్లా భూములపై రాసిందే పదేపదే రాస్తున్నారు రామోజీరావు. పేదలు ఏళ్ల తరబడి అడుగుతున్నా పట్టించుకోని అధికారులు... దసపల్లా భూముల్ని మాత్రం 22(ఎ) జాబితా నుంచి తొలగించడానికి అత్యుత్సాహం చూపిస్తున్నారంటూ బుధవారం మరో బ్యానర్ కథనాన్ని వండేశారు. ఇదే కథనాన్ని అటుతిప్పి.. ఇటు తిప్పి గతంలోనే పలుమార్లు రాయగా... వాస్తవాలు వివరిస్తూ స్థానిక ప్లాట్ల యజమానులు, భూ యజమాని రాణి కమలాదేవి, ప్లాట్ల యజమానులతో డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకున్న కంపెనీ... అందరూ ఖండించారు. దిగువ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ ఈ భూములు ప్రభుత్వానివి కావని, రాణి కమలాదేవికే చెందుతాయని పదేపదే తీర్పులిచ్చాక కూడా ప్రభుత్వం వీటిని వ్యూహాత్మకంగా వారికి అప్పగించేస్తోందని 'ఈనాడు' రాస్తోందంటే దాని అర్థమేంటి? కోర్టు తీర్పులను అమలు చేయకూడదనా? కోర్టు ధిక్కారాన్ని ఎదుర్కోవాలనా? ఎందుకు రామోజీరావు గారూ ఈ రాతలు? రాసిందే పదేపదే రాయటం వెనక అర్థమేంటి? బుధవారం రాసిన కథనానికి సంబంధించి 'ఈనాడు'పై పరువునష్టం దావా వేస్తామంటూ రాణి కమలాదేవి, ఆమె కుమారుడు నోటీసులివ్వగా... విశాఖపట్నం జిల్లా కలెక్టరు కూడా పరువునష్టం దావా వేస్తున్నట్లు తెలియజేశారు.

చట్టపరమైన చర్యలు...

''దసపల్లా భూములపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ భూములకు సంబంధించి న్యాయస్థానాలు జారీ చేసిన ఆదేశాలు ఈ నెల 23 నాటికి అమలు చేయాలని కోర్టులు స్పష్టంచేశాయి. లేకుంటే హైకోర్టుకు జిల్లా కలెక్టర్ వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. అందుకే కోర్టు తీర్పులను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం'' అని పేర్కొనటంతో పాటు... ఆ భూముల చరిత్రను కూడా వివరించారు కలెక్టర్.

ఇదీ... దసపల్లా భూముల కథ

- మొదటి నుంచీ రాణి కమలాదేవి కుటుంబీకుల చేతుల్లోనే ఉన్న ఈ భూములపై... సర్వే సెటిల్మెంట్ డైరెక్టర్‌తో పలు వ్యాజ్యాలు నడిచినా... చివరకు డైరెక్టరు కూడా ఆ భూములు వారివేనని స్పష్టం చేస్తూ తీర్పునిచ్చారు. 1985లో ఈ భూములపై తహశీల్దార్ హైకోర్టులో కేసు వేయగా... వాదోపవాదాలు విన్న న్యాయస్థానం 1992లో ఆ భూములు కమలా దేవికి చెందినవి అంటూ తీర్పునిచ్చింది.
- ఇంతలో జీవో నం. 657 విడుదల చేసి... ఆ భూముల్ని ప్రభుత్వ పోరంబోకు భూములుగా గుర్తిస్తూ సెక్షన్ 22(ఏ)లో నమోదు చేశారు. దీనిపై 2005లో హైకోర్టులో రాణి కమలాదేవి రిట్ పిటిషన్ వేశారు. దీంతో జీవో ఈ భూములకు వర్తించదని కోర్టు తీర్పునిచ్చింది.
- నాటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా ప్రభుత్వ పిటిషన్లని సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో 2012లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసింది. దాన్నీ కోర్టు డిస్మిస్ చేసింది. 2014లో రాష్ట్ర ప్రభుత్వం చివరి ప్రయత్నంగా క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. దాన్ని కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది.
- తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వం పదే పదే సుప్రీంకి వెళ్తుండటంతో రాణి కమలాదేవి 2012లో హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు వేశారు. ఇది పెండింగ్‌లో ఉండగానే... ఆ భూముల్ని 22(ఏ)లో పెట్టి నోటిఫై చేసింది ప్రభుత్వం. దీనిపై రాణి కమలాదేవి మళ్లీ కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు జిల్లా గెజిట్‌ను రద్దుచేసి... ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలని అడ్వకేట్ జనరల్‌కు చెప్పింది. ఏజీ ప్రభుత్వానికి అదే సూచన చేశారు. అయినా అమలు చేయకపోవడంతో మరోసారి పిటిషనర్లు కోర్టుకు వెళ్లారు. దీంతో.. దసపల్లా భూములకు సంబంధించి ఈ నెల 23 నాటికి కోర్టు ఆదేశాలు అమలు చేయాలని... లేకుంటే కలెక్టర్ హైకోర్టుకు వ్యక్తిగతంగా రావాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టంచేసింది.
- అన్ని దారులు మూసుకుపోవడంతో పాటు కోర్టు ధిక్కార పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున, సుప్రీం ఆదేశాలను, ఏజీ సూచనను అంగీకరిస్తూ.. న్యాయస్థానాల ఆదేశాల్ని 2022 డిసెంబర్ 31న అమలు చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ రాతలు... మరీ ఘోరం

''విశాఖలో 2002లో ఓ అపార్ట్‌మెంట్ కట్టారు. అందులో పిసరంత ప్రభుత్వ భూమి ఉందని మొత్తం అపార్ట్‌మెంట్‌నే 22(ఏ)లో పెట్టేశారు. ఈ సంగతి అపార్ట్‌మెంట్లోని ఫ్లాట్ల ఓనర్లకు ఏడెనిమిదేళ్ల కిందట తెలిసింది. అప్పటి నుంచి తిరుగుతున్నా ఇప్పటికీ 22(ఏ) నుంచి తొలగించలేదు. ఇదీ ఈ ప్రభుత్వం సామాన్యుల విషయంలో అనుసరిస్తున్న వైఖరి'' అంటూ తన కథనంలో 'ఈనాడు' ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టింది. మరి ఎనిమిదేళ్ల కిందట అంటే అప్పుడు అధికారంలో ఉన్నది చంద్రబాబునాయుడు కదా? ఐదేళ్ల పాటు ఆయనే ఉన్నారు కదా? ఐదేళ్లూ వారు 22(ఏ) నుంచి తొలగించలేదంటే ఏమని అనుకోవాలి? మరి అప్పుడెందుకు ప్రశ్నించలేదు? ఐదేళ్లూ బాబు ప్రభుత్వంలో చేయని పనిని... ఈ ప్రభుత్వం మూడేళ్లలో చేయలేదని విమర్శించటం సబబేనా? ఎందుకీ దుర్మార్గపు రాతలు రామోజీరావు గారూ? బాబు అధికారంలో ఉంటే ప్రశ్నించాల్సిన మీ కలంలో సిరా అయిపోతుందా? లేక మీ గొంతు మూగబోతుందా?

కానీ ప్రభుత్వాస్తులు, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, రెవెన్యూ విభాగాలవిగా చెబుతున్న 18.41 ఎకరాల్ని మాత్రం 22(ఏ)లో అలాగే ఉంచినట్లు తెలిపారు.

ఎవరైనా ఇంకేం చేస్తారు?

ఇవీ వాస్తవాలు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిందే కదా? అన్ని స్థాయిల్లోనూ న్యాయ పోరాటం చేసి ఓడిపోయాక... కోర్టు ధిక్కార కేసులను సైతం ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయస్థానాలు హెచ్చరించాక ఏ ప్రభుత్వమైనా ఆ ఆదేశాలను అమలు చేయక ఇంకేం చేస్తుంది? కథనాలు రాసేముందు ఈ మాత్రం ఆలోచించకపోతే ఎలా రామోజీరావు గారూ?

ఫ్యాషన్





సంక్రాంతి అంటేనే ప్రకృతి పండగ
పతంగుల సంబరం
ఈ వేడుకకు మరింత వన్నె తెచ్చేవి
సంప్రదాయ దుస్తులే కాదు
వాటిని మరింత మెరుపులీనేలా చేసే
ఆభరణాలు కూడా!

పండగ ఆభరణాలు









సుగర్ బాల్ జ్యువెలరీ

సంక్రాంతికి సుగర్ బాల్స్‌తో చేసిన ఆభరణాలను ధరించడం కొన్ని చోట్ల ఆచారంగా ఉంది. పెళ్లయిన ఏడాదికి నవ వధువుకు చేసే ఈ అలంకరణ మరాఠాలోనూ ఇతర సంప్రదాయాల్లో కనిపిస్తుంది. గసగసాలు లేదా నువ్వులను పంచదార పాకంలో కలుపుతారు. వీటిని సన్నని మంటమీద మిశ్రమం బాగా చిక్కబడేవరకు కలుపుతూ ఉంటారు. ఈ మిశ్రమంతో పూసలల్లాంటి చిన్న చిన్న బాల్స్‌ని తయారుచేస్తారు. ఈ చక్కెర బాల్స్‌ని అందమైన వివిధ రకాల ఆభరణాలుగా రూపుకడతారు. ఇవి వధువు భవిష్యత్తు జీవితాన్ని ఆనందకరంగా మార్చుతాయని వారి నమ్మకం. అలాగే ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా వీటి అలంకరణ చూడముచ్చటగా ఉంటుంది.

పువ్వుల క్రాంతి

ఆభరణం అంటే బంగారమే కానక్కర్లేదు. భారతదేశ వివాహ వేడుకల్లో మెహిందీ సమయాల్లో ధరించే ప్రత్యేకమైన పుష్ప హారాలు సంక్రాంతినీ సందడిచేస్తున్నాయి. అమ్మాయిల అందాన్ని పువ్వులతో రెట్టింపు చేస్తున్నాయి. వీటిలో పొడవు హారాలు, చోకర్స్, జూకాలు, గాజులు పువ్వుల అల్లికతో అందంగా అమర్చుకోవచ్చు. ధరించే దుస్తులతోనూ వీటిని మ్యాచ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ పువ్వుల ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి.



జనవరి రాగానే చాలా మంది ఎదురుచూసే పండగ సంక్రాంతి. ఢిల్లీ వాసులు సక్రాత్ అని, గుజరాతీయులు ఉత్తరాయణం అని, తమిళనాడులో పొంగల్ అని, తెలుగు రాష్ట్రాలలో మకర సంక్రాంతి అనీ అంటారు. పేరు భిన్నంగా ఉండవచ్చు. కానీ వేడుకలో ఉత్సాహం ప్రతి చోటా అధికంగానే ఉంటుంది. అందుకు తగినట్టుగానే మగువలు అలంకరణలోనూ వైవిధ్యం చూపుతుంటారు.

గోటా పట్టీ

ధరించే దుస్తుల రంగులతో ఫ్యాబ్రిక్, గోటా పట్టీ జ్యువెలరీ కూడా పోటీపడుతుంటాయి. దీంతో ఇవి పండగ కళను మరింత పెంచుతాయి.











ఎంత ఈజీ అయితే మాత్రం...
ఎప్పుడూ సేమ్యా పాయసమేనా?
ఈసారి... శనగపప్పు పాయసం చేద్దాం.
నూనెలో మునిగి తేలే బూరెలకు సెలవిద్దాం.
ఈసారి... బొబ్బట్లు చేసుకుని ఆరగిద్దాం.
మినప గారెల బదులు సగ్గుబియ్యం టేస్ట్ చేద్దాం.
క్షీరాన్నం సూర్యుడికి నివేదించి కప్పుల్లో పోసుకుందాం.
వెన్న మురుకులు... నువ్వుండలు డబ్బాలో వేద్దాం.

వంటిల్లు

సంక్రాంతి విందు

బొబ్బట్లు



కావలసినవి: గోధుమ పిండి – అర కేజీ; శనగపప్పు – పావు కేజీ; బెల్లం తురుము – పావుకేజీ; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● గోధుమపిండిని చపాతీలకు కలుపుకున్నట్లు కలిపి నానబెట్టాలి. ● శనగపప్పును ఉడికించి నీరు మొత్తం పోయేటట్లు వడపోసి గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో బెల్లం తురుము, ఏలకుల పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని (పూర్ణం) బాణలిలో వేసి ఒక మోస్తరుగా వేడి చేస్తే... బొబ్బట్లు రెండు – మూడు రోజుల వరకు తాజాగా ఉంటాయి. ఒక రోజుకైతే బెల్లం– శనగపప్పు మిశ్రమాన్ని వేడిచేయనవసరం లేదు. ● గోధుమ పిండిని నిమ్మకాయంత తీసుకుని ప్రెస్సర్‌లో పూరీలా వత్తాలి. ఇందులో చిన్న గోళీ అంత పూర్ణం పెట్టి అన్ని అంచులూ కలుపుతూ మడత వేయాలి. ఈ రౌండ్‌ని మరలా ప్రెస్సర్‌లో జాగ్రత్తగా పూరీల్లా వత్తాలి (వత్తేటప్పుడు పూర్ణం బయటకు రాకూడదు). వీటిని పెనం మీద వేసి తిరగేస్తూ రెండు వైపులా దోరగా కాల్చాలి. కాల్చేటప్పుడు ఒక టీ స్పూను నెయ్యి వేయాలి. నేతితో కాల్చిన బొబ్బట్లు ఘుమఘుమ లాడుతూ నోరూరిస్తాయి.

శనగపప్పు పాయసం



కావలసినవి: పచ్చి శనగపప్పు – 200 గ్రా; కొబ్బరి పాలు లేదా గేదెపాలు– 100 మి. లీ; బెల్లం తురుము – 150 గ్రా; నెయ్యి – 4 టేబుల్ స్పూన్‌లు; జీడిపప్పు – 20; కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; ఏలకుల పొడి – అర టీ స్పూన్.

తయారీ: ● శనగపప్పును కడిగి పది నిమిషాలు నానబెట్టిన తర్వాత రెండింతలు నీటిని పోసి ప్రెషర్ కుక్కర్‌లో నాలుగైదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● పాలను మరిగించి పక్కన ఉంచాలి. ● కుక్కర్ వేడి తగ్గిన తర్వాత శనగపప్పును ఒక మోస్తరుగా మెదపాలి (మరీ మెత్తగా చేయరాదు). ● వెడల్పాటి బాణలి పెట్టి అందులో మెదిపిన శనగపప్పు వేసి పాలు పోసి కలుపుతూ మరిగించాలి. మిశ్రమంలో బుడగలు వచ్చేటప్పుడు బెల్లం తురుము, ఏలకుల పొడి వేసి సన్న మంట మీద (పెద్ద మంట చేస్తే పాయసం అడుగు పడుతుంది) కలుపుతూ ఉడికించాలి. ● మరొక స్టవ్ మీద పెనం పెట్టి నెయ్యి వేడి చేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించాలి. వీటిని ఉడుకుతున్న పాయసంలో వేసి కలిపి దించేయాలి. **గమనిక:** వీగన్ డైట్‌ను అనుసరించేవాళ్లు యానిమల్ మిల్క్‌కి బదులుగా కొబ్బరిపాలతో, నెయ్యికి బదులుగా వంట కొబ్బరి నూనెతో చేసుకోవచ్చు.

నువ్వుల ఉండలు



కావలసినవి: నువ్వులు – పావు కేజీ; బెల్లం పొడి – 200 గ్రా; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – కొద్దిగా.

తయారీ: ● నువ్వులను వేయించి పొడి చేయాలి. కొన్నింటిని పొడి చేయకుండా అలాగే ఉంచాలి. ఇందులో బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి రెండూ సమంగా కలిసే వరకు రోట్లో దంచాలి. చేతికి నెయ్యి రాసుకుని కావలసిన సైజులో ఉండలు చేయాలి. ఇవి రెండు–మూడు రోజుల వరకు నిల్వ ఉంటాయి. బెల్లం పాకం పట్టి నువ్వులు కలిపి ఉండలు చేసుకుంటే నెల వరకు తాజాగా ఉంటాయి. **గమనిక:** తెల్ల నువ్వులు కాని నల్ల నువ్వులు కాని వాడవచ్చు. నల్ల నువ్వులైతే వేయించిన తర్వాత కాస్త నలిపి పొట్టు వదిలించాలి.




సగ్గు బియ్యం వడలు



కావలసినవి: సగ్గుబియ్యం – వందగ్రాములు ; బంగాళాదుంప – 4 మీడియం సైజువి; వేరు శనగపప్పు – ఒక టేబుల్ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2 (సన్నగా తరగాలి); అల్లం తరుగు – టీ స్పూన్; నిమ్మరసం – 2 టీ స్పూన్‌లు; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత; నూనె – పావు కేజీ.

తయారీ: ● సగ్గుబియ్యాన్ని కడిగి రెండు గంటల సేపు నానబెట్టాలి (లావు సగ్గుబియ్యం అయితే ఐదు గంటల సేపు నానాలి). సగ్గుబియ్యం గోరుతో గుచ్చి చూస్తే లోపల గట్టిదనం లేకుండా మెత్తగా ఉండాలి. ● ఈ లోపు బంగాళాదుంపలను కడిగి ఉడికించాలి. ● ఒక బాణలిలో వేరుశనగపప్పును వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలో కొంచెం పలుకుగా గ్రైండ్ చేసుకోవాలి. ● బంగాళాదుంపలు చల్లారిన తర్వాత చిదిమి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు, జీలకర్ర, కొత్తిమీర తరుగు, నిమ్మరసం, వేరుశనగ పప్పు పొడి వేయాలి. సగ్గుబియ్యాన్ని వడపోసి నీరు పోయిన తర్వాత చేత్తో మెదిపి బంగాళాదుంప మిశ్రమంలో వేసి కలపాలి. సగ్గుబియ్యం వడల పిండి రెడీ. ● బాణలిలో నూనె వేడి చేసి పిండిని పెద్ద ఉల్లిపాయంత తీసుకుని అరచేతిలో వేసి వత్తి నూనెలో వేయాలి. రెండువైపులా ఎర్రగా కాలిన తరవాత టొమాటో కెచప్ లేదా పుదీన పచ్చడితో తింటే చాలా రుచిగా ఉంటాయి. **గమనిక:** పిండిని చేతిలో వేసి వత్తినప్పుడు జారిపోతున్నా, నూనెలో వేసిన తర్వాత విడిపోతున్నా వదులుగా ఉందని అర్థం. అలాంటప్పుడు తగినంత ఉప్మారవ్వ కలిపి మిశ్రమాన్ని వడ చేయడానికి తగినట్లుగా గట్టిగా చేసుకోవాలి.

క్షీరాన్నం



కావలసినవి: కొత్త బియ్యం – పావు కేజీ; వెన్న తీయని పాలు – లీటరు; చక్కెర లేదా బెల్లం పొడి – 150 గ్రాములు; ఏలకుల పొడి – టీ స్పూన్; కుంకుమ పువ్వు – పది రేకలు; బాదం – టేబుల్ స్పూన్ (సన్నగా తరగాలి); జీడిపప్పు – టేబుల్ స్పూన్; పిస్తా – టేబుల్ స్పూన్ (ఉప్పు వేయని పిస్తా తీసుకోవాలి); కిస్‌మిస్ – టేబుల్ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● బియ్యం కడిగి అర గంటసేపు నానబెట్టాలి. ● పాలను మందంగా, వెడల్పుగా ఉన్న పాత్రలో పోసి మరిగించాలి. ఓ కప్పులో ఒక టేబుల్ స్పూన్ పాలను తీసుకుని కుంకుమ పువ్వు వేసి నానబెట్టాలి. ● పాలు మరుగుతుండగా బియ్యాన్ని నీటిలో నుంచి తీసి పాలలో వేసి కలిపి ఉడకనివ్వాలి. బియ్యం ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత చక్కెర వేసి కలిపి మంట తగ్గించి మూత పెట్టాలి. మధ్యలో కలుపుతూ ఉడికించాలి. ● ఈ లోపు ఒక చిన్న బాణలిలో నెయ్యి వేడి చేసి కిస్‌మిస్, బాదం, జీడిపప్పు, పిస్తా వేసి దోరగా వేయించాలి. వీటిని పాలలో ఉడుకుతున్న అన్నంలో వేసి కలపాలి. చివరగా ఏలకుల పొడి, కుంకుమ పువ్వు కలిపిన పాలు కూడా వేసి బాగా కలపాలి. అన్నం ఉడికిన తర్వాత దించేయాలి. **గమనిక:** రుచికి తగినట్లు తీపి మోతాదు పెంచుకోవచ్చు.

వెన్న మురుకులు



కావలసినవి: బియ్యప్పిండి – అర కేజీ; శనగపిండి – పావు కేజీ; వెన్న – పావు కేజీ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచికి తగినంత; జీలకర్ర పొడి – టీ స్పూన్; ఇంగువ – అర స్పూన్; వేడి నీరు – అర లీటరు; నూనె – అర కేజీ.

తయారీ: ● బియ్యప్పిండి, శనగపిండిని కలిపి జల్లించాలి. ఇందులో వెన్న వేసి సమంగా కలిసే వరకు వేళ్లతో మర్దన చేస్తూ కలపాలి. ఇప్పుడు ఉప్పు, జీలకర్ర పొడి, ఇంగువ వేసి మరోసారి కలపాలి. ఇందులో వేడినీటిని పోసి ముద్దగా కలుపుకోవాలి. మురుకుల గొట్టంలో వేసి ఒకసారి వత్తుకుని చూసుకోవాలి. తీగ సరిగ్గా పడకుండా మధ్యలో విరిగిపోతుంటే పిండి మీద కొద్దిగా నీటిని చిలకరించి కలుపుకోవాలి. ● బాణలిలో నూనె వేడి చేసి పిండిని మురుకుల గొట్టంలో వేసుకుని నూనెలోకి వత్తుకోవాలి. దోరగా కాలిన తరవాత చిల్లుల గరిటెతో తీసుకోవాలి. పిండినంతటినీ ఇలాగే చేసుకోవాలి. ఈ మురుకులు రెండు వారాల వరకు తాజాగా ఉంటాయి.

కిచెన్‌టిప్స్

వంటలో ఉప్పు ఎక్కువైతే...

● ఒక బంగాళదుంప ని నాలుగు ముక్కలు చేసి ఆ ముక్కలని ఈ వంటకంలో వేయండి. లో ఫ్లేమ్ మీద కాసేపు ఉంచండి. అయితే, బంగాళదుంప ఉప్పుతో పాటూ నీటిని కూడా పీల్చుకుంటుంది. ఈ వంటకం గ్రేవీ అయితే దానికి తగ్గట్టుగా నీటిని కలుపుకోవాలి. ఆ తరువాత ఈ బంగాళదుంప ముక్కల్ని తీసేయవచ్చు. ● కొద్దిగా కొబ్బరి పాలు పోసినా కూడా ఎక్కువైన ఉప్పు సరిపోతుంది. ● ఉప్పు ఎంత ఎక్కువైంది అన్న దాన్ని బట్టి కొంచెం నీరు లేదా నిమ్మరసం యాడ్ చేయవచ్చు. ● కొద్దిగా పెరుగు, లేదా ఫ్రెష్ క్రీం కూడా కలపవచ్చు. ● కొద్దిగా పిండి వేస్తే ఎక్కువైన ఉప్పుని ఈ పిండి పీల్చుకుని గ్రేవీలో పైకి తేలుతుంది. అప్పుడు దాన్ని తీసేయవచ్చు. ● ఉప్పు కొద్దిగానే ఎక్కువైతే, అర స్పూను నుంచి స్పూను వరకు పంచదార వేసినా సరిపోతుంది. అయితే, ఉప్పు చాలా కొద్దిగానే ఎక్కువ పడితే మాత్రమే ఈ టిప్ పని చేస్తుంది

ముగ్గు ముచ్చట

చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరి పేరుతోపాటు కాలనీ, వీధి పేరు కూడా రాయండి)



25 చుక్కలు, 11 వరుసలు 11 వచ్చే వరకు, సరి చుక్క



గడగోజు స్రవంతి
ఈదులూరు, నల్గొండ జిల్లా



మహంకాళి సంధ్య
అంబేద్కర్ కాలనీ, మాటేడు మహబూబాబాద్ జిల్లా





24 చుక్కలు, 8 వచ్చే వరకు, సరి చుక్క



ఈదర విజయ మాధురి రెడ్డి
మాచర్ల



ఎం. వనజ
అనకాపల్లి, విశాఖపట్నం



15 చుక్కలు, 8 వచ్చే వరకు మధ్య చుక్క

ఏం బ్రౌజ్ చేస్తున్నారు?!

సైబర్ టాక్

మాంచి బిర్యానీ రెస్టారెంట్ కోసం లేదంటే, ఏదో ఒక ఐటమ్ కొనుగోలు చేయడానికి ఇంటర్నెట్‌లో చేసే ఒక సాధారణ బ్రౌజ్ వినియోగదారులను సోషల్ ఇంజనీరింగ్ స్కామ్‌ల ప్రపంచంలోకి నెట్టేస్తుంది. పెరిగిన ఇంటర్నెట్ వినియోగం దీనికి ప్రధాన కారణంగా మారింది. ఇలాంటప్పుడు ఏం చేయాలి?! డిజిటల్ యుగంలో అడుగులు వేస్తున్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

సురక్షితం కాని నెట్‌వర్క్‌లు, అప్లికేషన్లు, మితి మీరిన వ్యక్తిగత, షేరింగ్ పరికరాలు, దైనందిన జీవితంలో మనం తరచుగా యాక్సెస్ చేసే వర్చువల్ మీటింగ్‌లలో పరస్పర చర్యల ఫలితంగా కొత్త సమస్యలు వచ్చిపడుతున్నాయి. కోవిడ్ తర్వాత ఇవి మరింత హాని కలిగిస్తున్నాయి.

బ్రౌజ్ చేస్తున్నప్పుడు...

యూజర్‌కు తెలియకపోయినా ఇతర సీక్రెట్ చొరబాట్లు తరచుగా జరుగుతాయి. దాదాపు అన్ని బ్రౌజర్లు .. (ఎ) క్రాష్ రిపోర్టర్‌లు (బి) అనలిటిక్స్ (సి) ప్రొఫైలింగ్ (డి) గుర్తింపు (ఇ) యాడ్స్ (ఎఫ్) లొకేషన్ ... ఈ రూపంలో మన డేటాను సేకరిస్తాయి. మన బ్రౌజింగ్ కుకీల ద్వారా ట్రాక్ చేయబడుతుంది. యూజర్ సౌలభ్యం సాకుతో వెబ్‌సైట్‌లలో డేటా షేర్ చేయబడుతుంది.

సీక్రెట్ స్థాయి ఆధారంగా సురక్షితమైన బ్రౌజింగ్ అలవాట్లను సాధన చేయడం మన ప్రత్యేకతగా ఉండాలి. అంటే, అమెజాన్, ఈబే, నెట్‌ఫ్లిక్స్ వంటి వెబ్‌సైట్‌లు మీ ప్రాధాన్యతల గురించి డేటాను సేకరిస్తాయి. ఇందులో వేటిని ఇష్టపడతారో వాటికి సంబంధించిన సూచనలను అందిస్తాయి. (బి)గూగుల్, ఫేస్‌బుక్ యాప్‌లు అంతటా యూజర్ డేటాను అందించడానికి బ్రౌజింగ్‌ను ట్రాక్, షేర్ చేస్తుంది. విషయ ధ్రువీకరణకు.. https://myactivity.google.com & https://www.facebook.com/off_facebook_activity చూడచ్చు.

గూగుల్‌లో శోధన..

- మీరు మీ సెర్చ్ పారామీటర్లను కోట్స్‌లో ఉంచినప్పుడు, ఇది మొత్తం పదబంధాన్ని శోధించమని గూగుల్‌కు సూచిస్తుంది. మీ శోధన ఉదాహరణకు.. 'డిజిటల్ వెల్‌బీయింగ్' అయి ఉండాలి.
- పదాలను మినహాయించడానికి హైఫన్‌ని ఉపయోగించండి. ఉదాహరణకు మీరు మారుతీ టెంపుల్ కోసం వెతికితే అది డిఫాల్ట్‌గా మారుతీ కార్‌ని చూపుతుంది. దీన్ని నివారించడానికి మీ శోధన వాక్య నిర్మాణం మారుతి–టెంపుల్ అయి ఉండాలి.
- శోధించడానికి కోలన్‌ని ఉపయోగించండి. మీరు www.endnowfoundation.org కి లాగిన్ చేసి సైబర్ భద్రతపై కథనం కోసం వెతుకుతున్నట్లయితే site:endnowfoundaton.org అయి ఉండాలి.

సురక్షిత బ్రౌజర్లు

కుకీల వంటి థర్డ్ పార్టీ సాధనాలను ఆపడానికి సురక్షితమైన బ్రౌజర్‌లు సహాయపడతాయి. వారు మీ ప్రైవేట్/వ్యక్తిగత సమాచారం, ఇతర ట్రాకింగ్ డేటా మొత్తాన్ని సేకరిస్తారు. బ్రేవ్, డక్ డక్ గో, టోర్, మొజిల్లా , క్రోమ్ కొన్ని సురక్షితమైన బ్రౌజర్‌లు. ఈ సురక్షిత బ్రౌజర్‌లు (ఎ) సురక్షితం కాని సైట్‌లు, డౌన్‌లోడ్‌ల గురించి మిమ్మల్ని హెచ్చరిస్తాయి (బి) ఏ అనుమతులను మంజూరు చేయాలో ఎంచుకోవడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. (సి) కుకీలను నిలిపివేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. (డి) డిఫాల్ట్‌గా పాపప్‌లను నిలిపివేయడం. (ఇ) డిఫాల్ట్‌గా దారి మళ్లింపులను నిలిపివేయడం (ఎఫ్) స్క్రిప్ట్‌లను ఆఫ్ చేయడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది (జి) మీ బ్రౌజింగ్ హిస్టరీకి యాక్సెస్‌ను మీకు అందిస్తుంది.





- నిర్దిష్ట పేజీ కోసం సెర్చ్ చేయడానికి బదులుగా, మీరు నిర్దిష్ట పేజీకి లింక్ చేసే పేజీ కోసం సెర్చ్ చేస్తుంటారు. ఉదాహరణకు మీరు శోధించే వాక్య నిర్మాణం link:endnowfoundation.org అయి ఉండాలి
- ఇతర సైట్‌ల మాదిరిగా ఉండే సైట్‌లను కనుక్కోవాలంటే.. సంబంధిత సైట్‌ల కోసం శోధించడానికి ఒక మంచి మార్గం ఉంది. మీ సెర్చ్ సింటాక్స్‌గా ఉండాలి, related:endnowfoundation.org
- మ్యాథ్స్ కోసం గూగుల్ సెర్చ్‌ను ఉపయోగిస్తే మీ సెర్చ్ వాక్య నిర్మాణం 8x5+9+8 ... మొదలైనవి ఉండాలి.
- ఒక నిర్దిష్ట ఫైల్‌ను కనుక్కోవడానికి ఉదాహరణకు మీరు సైబర్ సేఫ్టీ ఫైల్ కోసం ప్రయత్నిస్తుంటే సెర్చ్ సింటాక్స్ cybersafetyfiletype:pptx అయి ఉండాలి
- డబ్బు, యూనిట్ మార్పిడులు రెండు కరెన్సీల మధ్య మార్పిడి రేటును చూడటానికి తనిఖీ చేస్తోంది. మీ శోధన సింటాక్స్ యుఎస్‌డి నుండి ఐఎన్‌ఆర్ వరకు ఉండాలి

బ్రౌజింగ్ చిట్కాలు..

- చిన్న లింక్‌లపై క్లిక్ చేయవద్దు లేదా గూగుల్ ఫారమ్‌లను పూరించవద్దు (ఇమెయిల్, వాట్సప్ ద్వారా) తెలిసిన సోర్స్ ద్వారా కూడా పంపబడినప్పటికీ, అది ఫిషింగ్ లింక్ కాదా అని మీరు తనిఖీ చేశారని నిర్ధారించుకోండి https://www.isitphishing.org
- సున్నితమైన, వ్యక్తిగత సమాచారాన్ని ఇమెయిల్ ద్వారా ఎప్పటికీ పంపకండి. ఎవరెవరు ఎప్పుడైనా కోరినప్పటికీ.
- ఎవరైనా ఇ మెయిల్‌లో డబ్బును బదిలీ చేయమని అడిగినప్పుడు, అది మీ యజమాని నుండి వచ్చినప్పటికీ, ప్రామాణికత కోసం ఇమెయిల్ యొక్క హెడర్‌ను ఎల్లప్పుడూ తనిఖీ చేయండి. https://mxtoolbox.com/EmailHeaders.aspx
- కస్టమర్ కేర్ నంబర్‌ల కోసం గూగుల్‌లో ఎప్పుడూ శోధించకండి, సంబంధిత పోర్టల్‌లలో పేర్కొన్న నంబర్‌లకు కాల్ చేయండి
- ఎప్పుడూ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయవద్దు. ఓటీపీ, యుపిన్, బ్యాంక్ కార్డ్, సివివి నంబర్‌లను ఇవ్వవద్దు. అంటే మీరు మీ ఖాతా నుండి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, స్వీకరించడం లేదని అర్థం.
- అన్ని ఇ–మెయిల్‌లు, సోషల్ మీడియా ఖాతాల కోసం రెండుకారకాల ప్రమాణీకరణను సెటప్ చేయండి.
- మీ బ్రౌజర్‌ను అప్‌డేట్ చేసుకోండి మరియు httpr://తో ప్రారంభమయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయండి.
- ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడానికి మీరు సీక్రెట్ మోడ్‌ని ఉపయోగించవచ్చు. తద్వారా మీ యాక్టివిటీ ఏదీ బ్రౌజింగ్ యాక్టివిటీలో కనిపించదు.
- మీ బ్రౌజర్‌లను కంపార్ట్‌మెంటలైజ్ చేయండి. అంటే, ఒక బ్రౌజర్‌ని పూర్తిగా వెబ్ బ్రౌజింగ్ కోసం, మరొక బ్రౌజర్‌ని బ్యాంకింగ్ కోసం, మరొకటి సామాజిక ఖాతాల కోసం ఉపయోగించండి. దీంతో కుకీలు ఆఫ్ చేయబడ్డాయని, బ్రౌజర్ మీ బ్రౌజింగ్ చరిత్రను నిల్వ చేయడం లేదని నిర్ధారించుకోవడానికి సీక్రెట్ సెట్టింగ్‌లను మార్చండి.
- మీ సొంత పరికరం అయినప్పటికీ, మీరు వాటిని ఉపయోగించనప్పుడు సోషల్ మీడియా, ఇమెయిల్ ఖాతాల నుండి లాగ్ అవుట్ చేయాలని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.
- సురక్షితమైన బ్రౌజింగ్ అనుభవం కోసం యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించండి.
- వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌లను ఉపయోగించడం వల్ల హ్యాకర్లు, సోషల్ ఇంజనీరింగ్ స్కామర్‌ల నుండి మీ డేటాను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

హెయిర్ కేర్

కురులకు జవ జీవాలు

ఎండాకాలం, వర్షాకాలం, శీతాకాలం... కాలం ఏదైనా సరే, జుట్టుకి సవాళ్లు తప్పవు. కేశ కష్టనష్టాలు కాలాన్ని బట్టి మారుతుంటాయి. కానీ ఆరోగ్యకరమైన కురుల కోసం ప్రధానంగా తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు.

- జుట్టు ఒత్తుగా, దృఢంగా పెరగాలంటే మాడు ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం మాడుకు స్క్రబ్ చేయాలి. మాడుకు స్క్రబ్ చేయడం వల్ల సెబాసియస్ గ్రంథులు ఉత్తేజితమై జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. జుట్టు బాగా పెరగాలంటే మాడుతోపాటు కేశమంతటికీ పోషకాలు అందాల్సిందే. కాబట్టి గుండ్రటి పళ్లున్న దువ్వెనతో జుట్టును బాగా దువ్వాలి. చిక్కులు విడిపోవడంతోపాటు సెబాసియస్ గ్రంథుల నుంచి విడుదలైన సహజమైన నూనెలు మాడు నుంచి వెంట్రుక చివరి వరకు అందుతాయి.



- మార్కెట్‌లో దొరికే హెయిర్‌కేర్ ఉత్పత్తులను గుడ్డిగా వాడడం వల్ల ప్రయోజనం ఉండకపోవచ్చు. అందులో తెలియచేసిన పోషకాలను గమనించి నిర్ణయం తీసుకోవాలి.
- హెయిర్ డ్రైయర్ వాడేటప్పుడు వేడి తక్కువగా ఉండడమే మంచిది. వేడి ఎక్కువైతే వెంట్రుకలో సహజంగీగా ఉండే నూనెలు ఆవిరయిపోయి జుట్టు పొడిగా నిర్జీవంగా మారుతుంది.
- రోజూ తలస్నానం చేయడం మంచిది కాదు. దీని వల్ల కేశాలు నిర్జీవంగా మారుతాయి. మాడు కూడా పొడిబారి దురదపెడుతుంది. తలస్నానం చేసినప్పుడు తలకు టవల్‌కు బదులుగా కాటన్ టీ షర్టును చుట్టుకోవడం సౌకర్యంగా ఉంటుంది. టవల్ జుట్టును లాగుతుంటుంది. టీ షర్టుతో ఈ ఇబ్బంది ఉండదు.

పోషకాహార లోపం కారణంగా జుట్టు రాలిపోతుంటే నిపుణుల సూచన మేరకు ఐరన్, జింక్ వంటి మందులు తీసుకోవచ్చు. అలాగే ఆహారం విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవాలి. పోషకాలతో కూడిన సమతుల ఆహారం అవసరం.

సృజన

త్రీ... టూ... వన్... జంప్



నిహారిక

ఆసక్తి ఉన్న రంగంలోకి ప్రవేశిస్తే వెయ్యి ఏనుగుల బలం తోడొస్తుంది. తనకు ఇష్టమైన బంగీజంప్ ప్లాట్‌ఫామ్ పైకి వచ్చిన నిహారిక గెలుపుజెండా ఎగరేసింది. వ్యాపార రంగంలోకి రావాలనుకునేవారికి స్ఫూర్తిగా నిలుస్తోంది, '3... 2..1 జంప్' పుస్తకంతో రచయిత్రిగా తొలి అడుగు వేసింది...

నిహారికాకు స్కూల్ రోజుల నుంచి బంగీ జంప్ అంటే ఆసక్తి. తండ్రి రిషికేష్‌లో బంగీ జంప్ ప్లాట్‌ఫామ్ 'జంప్ హైట్స్' ప్రారంభించాడు. బంగీ జంప్ మీద ఉన్న ఆసక్తితో తండ్రి మొదలు పెట్టిన వ్యాపారంలోకి ప్రవేశించి, దశాబ్దకాల అనుభవాన్ని సొంతం చేసుకుంది నిహారిక.

తాను 'జంప్ హైట్స్'లోకి ప్రవేశించినప్పుడు ఆ వ్యాపారం అప్పుడే బుడిబుడి అడుగులు వేస్తోంది. అయితే నిహారిక వినూత్న ఆలోచనలతో 'జంప్ హైట్స్' దూసుకుపోయింది. దేశంలోనే అతి పెద్ద బంగీజంప్ ప్లాట్‌ఫామ్‌గా గుర్తింపు పొందింది.

విదేశాల్లో ఉన్న బంగీ జంప్ ప్లాట్‌ఫామ్‌తో పోల్చితే, మన దేశంలోని వాటికి పరిమితులు ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీలు దూరంగా ఉండే వారు. అలాంటి వారికి బంగీజంప్‌పై ఆసక్తి కలిగేలా చేయడంలో నిహారిక విజయం సాధించింది.

వ్యాపారరంగంలో రాణించాలనుకుంటున్న యువతరానికి సలహాలు, సూచనలు ఇస్తుంది.

'ఏ వ్యాపారం అంటే ఆసక్తి ఉంది? ఆ వ్యాపారాన్ని నేను సమర్థవంతంగా చేయగలనా? ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నాయి? వాటిని అధిగమించే శక్తి నాలో ఉందా?... ఇలా మనకు మనమే కొన్ని ప్రశ్నలు వేసుకుంటే విజయం సాధించడానికి అవసరమైన దారి కనిపిస్తుంది' అంటుంది నిహారిక.



నిహారిక



నిహారిక రాసిన '3...2..1...జంప్' పుస్తకం

నిహారిక తాజాగా '3...2..1... జంప్' పేరుతో తొలిసారిగా పుస్తకం రాసింది. భగవద్గీత శ్లోకాలను ఆధునిక కాలానికి అన్వయిస్తూ రాసిన ట్రావెల్ ఫిక్షన్ ఇది.


అర్జున అనే ఒక మహిళ భయస్థురాలు. చిన్న చిన్న విషయాలకు భయపడుతుంటుంది. అలాంటి మహిళలో ధైర్యాన్ని పెంచుతాడు బంగీ జంప్ మాస్టర్ క్రిష్ణ.

వ్యక్తిత్వ వికాస కోణంలో భవిష్యత్‌లో మరిన్ని రచనలు చేయాలనుకుంటున్న నిహారికకు అభినందనలు తెలియజేద్దాం.

పండుగ విందు – పసందు

అల్లుళ్లా మజాకా?... 'మజా'..కే!

**పండగంటే మరేమో కాదు...
ముంగిట్లో తోరణాలూ - అంగిట్లో పూర్ణాలూ!!
మొదటిది కంటికి విందు... రెండోది నోటికి!
కంటివిందులూ, కడుపు విందుల్తో పాటు
హాయిగా చదువుతూ మనసుకూ
విందు చేయడం కోసం
తెల్లటి పేపరాకు మీద అక్షరాలా
వడ్డిస్తున్నదే ఈ హ్యూమర్ డిన్నర్.**



పండగొచ్చింది. అల్లుళ్లు వచ్చారు. మునపటిలాగే... ఇప్పుడు కూడా. అయితే ఈరోజుల్లో అందరి మనోభావాల్లాగే... కొందరు కొత్తల్లుళ్ల మనోభావనలూ కొత్తసినిమాలకు అనుగుణంగా ఎలా ప్రభావితమయ్యాయో ఒకసారి చూద్దామా?

- ''మా అత్తగారింటి కొత్త కుక్కర్ విజిల్ సౌండు రిషభ్‌శెట్టి అరుపులా పరమ కీచుగా ఉంటే ఎంత బాగుణ్ణు!'' 'కాంతారా' చూసొచ్చిన కాంతంగారి అల్లుడి కోరిక ఇది. ఈమధ్య ఆమె చెవుల వినికిడి కాస్త తగ్గడంతో బగారా రైస్ అడుగు కాస్తా బొకారో స్టీల్ కావడంతో... పలావురైస్ అడుగున మాడు చెక్క ల్యాసి పరార వ్వాలనుకున్న ఓ అల్లుడి ఆక్రందన ఇది.
- ''నలిగేదే ల్యా' / 'మెదిగేదే ల్యా''... అన్నది మా అత్తగారి పంతమా? అలా శపథం పట్టి ఇలా ఈ అరిసెలు చేశారా... అన్నది ఓ కొత్త అల్లుడి మనసులో మొలిచిన సందేహమ్మొలక.
- ''కర్రీ లేదా పుష్పా?'' పెద్దల్లుడి హోదాలో పెద్దరికం పులుముకుని పనులన్నీ పూర్తిగా ముగించేశాడు. చిట్టచివర్న చివరి బంతిలో భోజనానికి కూర్చున్నాడు. అలా కూర్చుని... వడ్డింపుల్లో కూర కోసం ఎదురుచూస్తున్నప్పుడు... పెళ్లై పుష్కరకాలం దాటిన ఓ పాత అల్లుడి అసహనం.
- ''ఇప్పటికే నూనె చాలా పీల్చుకున్నావు. వదిలేయాలి. మొదట జల్లిగంటె మీద కొంత... ఆ తర్వాత టిష్యూపేపర్ మీద మరికాస్త! లేదంటే... తినేవాడు లావైపోతాడు'' నూనెలో బాగా వేగిన, మాగిన, నానిన గారెను చూశాక... డైట్ కాన్షస్ శ్రీమంతుడైన మరో అల్లుడి 'మనో–డైలాగ్'.



- ''పూర్ణం బూరెలు, బొబ్బట్లు... కంచంలో ఉండగా ఏది ఘన్టని కన్ఫ్యూజవ్వకూడదు రా. ఒకటి గుండ్రంగా ఉంటదీ, మరోటి ఫ్లాట్‌గా ఉంటది. మిగతాదంతా సేమ్ టు సేమ్!''... ఐటమ్స్ రెండూ వడ్డించినప్పుడు... ఏది ముందనే సందేహపు అల్లుడి మనసుమాట.
- ''నువ్వు వండి వడ్డించి నంతకాలం వీటిని నమిలేవాడింకా పుట్టలేదు అత్తా!'' దేన్నైనా పంటికింద పటపటలాడించగలననుకునే ఓ 'దంతబలి'గారు... తన అత్త చేసిన అరిసెల్ని, మురుకుల్నీ నమిలేప్పుడు.... సారీ నమల్లేనప్పటి ఓ అల్లుడి ఆక్రోశం.
- ''నువ్వు 'యమ్మీ'... 'యమ్మీ' అంటావుంటే తినబుద్ధవుతా ఉందిరా సామీ... ఈ సకినాలు తినబుద్ధవుతా ఉందిరా సాఆఆఆమీఈఈ'' అప్పటికే కారం మంట నషాళానికి అంటింది. దాంతో తిండిలో పోటీక్కాదు సరికదా... తోడల్లుడికి కనీసం తోడు రాలేకపోయినప్పటి ఓ అల్లుడి కడుపుమంట అండ్ నోటిమంట.





- ''అహ నాటు నాటు నాటు కోడి కోడి కోడి కోడి... నాటు కోడి...'' బ్రాయిలర్ చికెనంటే అంతగా ఇష్టపడని ఓ అల్లుడుగారికి... కంచంలో నాటు కోడి పులుసు కనిపించగానే 'బంగారు కంచం'లో నిండు నాటుకోడి ముడుచుకున్న గ్లోబులా కనిపించగానే మనసు పెట్టిన ఆనందపు కొక్కొరకో కూతలాంటి పాట ఇది.
- ''దాంకో దాంకో తురుమూ.... మడతేసి దాస్తది పూరీ.... తటటట్టటా తటటట్టటా... కొబ్బరి అవుతది తురుమూ... నీళ్లల్ల కరుగుద్ది చక్కెర... కరిగినంకైతది పాకం... పాకంల పడతది తురుమూ... తురుముకు అంటుద్ది పాకం... దాక్కో దాక్కో పాకం... పూరీలో దాక్కో తురుమూ... అడ్డంగ అంటుతది పూరీ... అంటాక అవుతది కజ్జికాయ్'' గరిజె అనబడు కజ్జికాయ కొరుకుతూ వెర్రి'పుష్ప'మంటి ఓ అల్లుడు పాడుకున్న పాట.
- ''సున్నుండే కదాని సప్పరిస్తే... నాలుకకంటుకుపోద్ది''... సున్నుండ తిన్న వెంటనే మరో ఐటమ్ తిందామనుకున్నప్పటికీ... తక్షణం నోరు రెడీ అవ్వలేదని ఆవేదన పడ్డ ఓ చిరంజీవి జామాత గారి మనోవేదన.
- ''తిండంటే.... ఎక్కడ మెక్కాలో తెలియడం కాదురా... ఎప్పుడు ఈనో తాగాలో కూడా ఎరిగి ఉండటం... ఇక అతగాడి హెల్త్ దెబ్బతింటుందే మోననే లోటు తీరిపోయిందిరా''... 'అత్తారింటికి దారెతుక్కుంటూ వచ్చిన' ఓ అల్లుడిని చూస్తూ ఓ మాంగారు కళ్లొత్తుడుచుకుంటూ విడిచిన ఓ హాయి నిట్టూర్పు.

– యాసీన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	147	59,958
నిఫ్టీ ▼	38	17,858

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	10,996	▲ 64
డోజోన్స్	34,272	▲ 299
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,794	▲ 69
డాక్స్	15,058	▲ 110
షాంఘై	3,163	▲ 2
నికాయ్	26,450	▲ 4

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,110 ▼	5
బంగారం (99.5 స్వచ్ఛత)	55,885 ▼	5
వెండి (కిలో)	68,025 ▼	338

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.91	82.58
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	97.69	101.01
€	యూరో	ఎస్‌బీఐ	86.20	89.28
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	60.72	62.71
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.65
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.40	62.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.75	22.42
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.31	23.10
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.96	12.99

మస్క్.. టెస్లాకు 'ట్వీటర్' షాక్!

ఏడాదిలో టెస్లా షేరు 70% కుదేలు • మస్క్ సంపద 188 బిలియన్ డాలర్లు డౌన్
ట్వీటర్ టేకోవర్, పెరుగుతున్న పోటీతో కష్టకాలం

సాక్షి, బిజినెస్ డెస్క్

అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా షేరు ఏడాది క్రితం దాకా బ్రేకుల్లేని బండిలా రివ్వున దూసుకెళ్లిపోయింది. కంపెనీ బాసు ఎలాన్ మస్క్‌ను ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడి స్థానంలో కూర్చోబెట్టింది. కానీ ఇప్పుడదే షేరు ఏకంగా 70 శాతం పడిపోయి .. నానా తంటాలు పడుతోంది. ఈ క్రమంలో మస్క్ సంపదా భారీగా హరించుకుపోయింది. చరిత్రలోనే అత్యంత వేగంగా భారీ సంపదను పోగొట్టుకున్న కుబేరుడిగా రికార్డును కూడా మూటగట్టుకున్నారు. ముచ్చట పడి, పంతం పట్టి కొనుక్కున్న ట్విటర్‌కే సమయం అంతా వెచ్చిస్తూ టెస్లాను మస్క్ పట్టించుకోకపోతూ ఉండటమే ఇన్ని అనర్థాలకు కారణమనే విమర్శలు వస్తున్నాయి. అయితే, అదొక్కటే కాకుండా టెస్లాకు మార్కెట్లో పోటీ పెరిగిపోతుండటం, డిమాండ్ తగ్గుతుండటం, కంపెనీపై ఇన్వెస్టర్లకు నమ్మకం సడలుతుండటం మొదలైనవి మరికొన్ని కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఇదంతా ఒక దశ మాత్రమేనని, మళ్లీ పుంజుకునే సామర్థ్యాలు టెస్లాకు పుష్కలంగా ఉన్నాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

ట్విటర్‌తో కష్టాలు..

మైక్రోబ్లాగింగ్ సైటు ట్విటర్‌ను కొనడంతోనే అటు టెస్లాకు ఇటు మస్క్‌కు కష్టాలు వచ్చాయనే అభిప్రాయాలు ఉన్నాయి. ట్విటర్‌ను 44 బిలియన్ డాలర్లకు కొంటానంటూ గతేడాది ఏప్రిల్‌లో ప్రకటించిన మస్క్, బోలెడంత ఊగిసలాట తర్వాత అక్టోబర్‌లో ఎట్టకేలకు కొన్నారు. డీల్ గురించి ప్రకటించిన దగ్గర్నుంచి ఆయన 23 బిలియన్ డాలర్ల విలువ చేసే టెస్లా షేర్లను అమ్మేశారు. ట్విటర్‌ను కొన్నప్పటి నుంచి గరిష్ఠంగా దానికే సమయాన్ని వెచ్చిస్తున్నారని, టెస్లాను పట్టించుకోవడం లేదనే అభిప్రాయంతో మిగతా షేర్‌హోల్డర్లూ అదే బాట పట్టారు. ఇవన్నీ కంపెనీ షేరుపై ప్రతికూల ప్రభావం చూపాయన్న అభిప్రాయం ఉంది.

డిమాండ్ డౌన్..

అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, ప్రత్యర్థి సంస్థల నుంచి పోటీ కారణంగా టెస్లా కార్లకు డిమాండ్ బలహీనపడుతోంది. కంపెనీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా టెస్లా తొలిసారిగా డిస్కౌంట్లు ఆఫర్ చేయడం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ముందు 3,750 డాలర్ల డిస్కౌంటు ఇస్తామని ప్రకటించిన టెస్లా.. మరింత మంది కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఆ తర్వాత దాన్ని ఏకంగా 7,500 డాలర్లకు పెంచింది. ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో పోటీ పెరుగుతున్న క్రమంలో కీలకమైన చైనా, అమెరికా మార్కెట్లలో డిమాండ్ బలహీనపడుతుండటం టెస్లాకు అర్థమవుతోంది కాబట్టే ఇలా డిస్కౌంట్ల బాట పడుతోందని పరిశీలకులు చెబుతున్నారు. ఇదే కాకుండా అమెరికా ఎకానమీ ఈ ఏడాది మాంద్యంలోకి జారుకుంటుందని, కార్లకు డిమాండ్ పడిపోతుందని వస్తున్న వార్తలూ టెస్లాకు ప్రతికూలంగా ఉంటున్నాయి. అంతేకాకుండా ఫోక్స్‌వ్యాగన్, ఫోర్డ్, జీఎం, హ్యుందాయ్ వంటి దిగ్గజాలు బిలియన్ల కొద్దీ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తూ టెస్లాకు దీటుగా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను దింపేందుకు కసరత్తు చేస్తుండటమూ కంపెనీకి సవాలుగా మారుతోంది. కీలకమైన అమెరికా ఈవీ మార్కెట్లో టెస్లా వాటా 2020లో 79% కాగా గతేడాది తొలి 9 నెలల్లో 65%కి పడిపోయింది. 2025 నాటికి ఇది 20% దిగువకు పడిపోవచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ అంచనా.



వేల్యుయేషన్లపై సందేహాలు..

అమ్మకాలు అంతంతే అయినా అసాధారణంగా ట్రిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ట్రేడ్ అవడం టెస్లాకు క్రమంగా ప్రతికూలంగా మారింది. ఒక దశలో టెస్లా వేల్యుయేషన్.. ప్రపంచంలోనే టాప్ 12 భారీ ఆటో దిగ్గజాలన్నింటినీ మించి పలికింది. కానీ వాటి అమ్మకాలతో పోలిస్తే టెస్లా విక్రయాలు తూగడం లేదు. ఇదంతా మార్కెట్‌కు అవగతమయ్యే కొద్దీ కంపెనీ వేల్యుయేషన్ ట్రిలియన్ డాలర్ల నుంచి ప్రస్తుతం దాదాపు 400 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతేగాకుండా మస్క్ చెప్పే దానికి చేసే దానికి పొంతన ఉండకపోతుండటం కూడా ఇన్వెస్టర్లలో అపనమ్మకం కలిగిస్తోంది. ఏదేదో చేసేస్తున్నానంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసే మస్క్ .. వాటిని ఆచరణలో మాత్రం చూపడం లేదంటూ విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు దాదాపు నాలుగేళ్ల క్రితం ఆవిష్కరించిన సైబర్‌ట్రక్ ఉత్పత్తి 2021లో మొదలుపెడతామని మస్క్ చెప్పినప్పటికీ ఈ ఏడాది వరకూ వాయిదా పడుతూ వచ్చింది. 2024లో గానీ పూర్తి స్థాయిలో తయారీ పుంజుకోదు. ఫోర్డ్, రివియన్ లాంటి కంపెనీలు ఇప్పటికే ఎలక్ట్రిక్ పికప్‌లను అమ్మేస్తుండగా టెస్లా ఎప్పటికి పుంజుకుంటుందనేది సందేహంగా మారింది.

టెస్లా మార్కెట్ విలువ ఏడాది క్రితం 1 ట్రిలియన్ డాలర్లు
ప్రస్తుతం 389 బిలియన్ డాలర్లు
మస్క్ సంపద ఏడాది క్రితం 320 బిలియన్ డాలర్లు
ప్రస్తుతం 132 బిలియన్ డాలర్లు

సంపద సృష్టిలోనూ.. కోల్పోవడంలోనూ రికార్డే!



టెస్లా షేరు 2021 ఆఖర్లో దాదాపు 409 డాలర్ల రికార్డు స్థాయిని తాకింది. దానికి అనుగుణంగానే అందులో సుమారు 21 శాతం వాటాలున్న కంపెనీ చీఫ్ మస్క్ 320 బిలియన్ డాలర్ల సంపదతో సంపన్నుల జాబితాలో ఎవరికీ అందనంత ఎత్తులో నంబర్ వన్‌గా ఉండేవారు. అయితే, గట్టిగా ఏడాది తిరిగేసరికి టెస్లా షేరు 123 డాలర్లకు పడిపోయింది. మస్క్–ట్విటర్ డీల్ నేపథ్యంలో గత మూడు నెలల్లో భారీగా పతనమైంది. వెరసి 2022 మొత్తం మీద దాదాపు 65 శాతం క్షీణించింది. దానికి తగ్గట్లే కంపెనీలో 13.4 శాతం (ప్రస్తుతం) వాటాలు ఉన్న మస్క్ సంపద కూడా ఏకంగా 188 బిలియన్ డాలర్ల మేర పడిపోయింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ప్రస్తుతం మస్క్ సంపద విలువ 132 బిలియన్ డాలర్లు. ఇంత స్వల్ప కాలంలో ఇంత భారీగా సంపద కోల్పోవడంలో మస్క్ రికార్డు సృష్టించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఈ రికార్డు జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ అధినేత మసయోషి సన్ పేరిట ఉండేది. 2000 ఐటీ బబుల్ బరస్ట్ అయినప్పుడు ఆయన ఏకంగా 58.6 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు.

హెచ్‌సీఎల్ టెక్ క్యూ3 భళా

- నికర లాభం 19 శాతం అప్
- షేరుకి రూ. 10 డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికం(క్యూ3)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 4,096 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 3,442 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం పుంజుకుని రూ. 26,700 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 22,331 కోట్ల టర్నోవర్ నమోదైంది. వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున నాలుగో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు రికార్డ్ డేట్ ఈ నెల 20.

డీల్స్ ప్లస్

క్యూ3లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నికరంగా 2,945 మంది ఉద్యోగులను జత చేసుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,22,270కు చేరింది. ఈ కాలంలో 17 భారీ డీల్స్‌ను పొందింది. కొత్త డీల్స్ విలువ గత క్యూ3తో పోలిస్తే 10% అధికంగా 234.7 కోట్ల డాలర్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది. క్యూ2తో పోలిస్తే ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 23.8% నుంచి 21.7 శాతానికి తగ్గినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు 1.7 శాతం బలపడి రూ. 1,073 వద్ద ముగిసింది.

మూడో రోజూ నేలచూపు

60,000 దిగువకు సెన్సెక్స్



ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 147 పాయింట్లు క్షీణించి 60,000 దిగువన 59,958 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్లు తగ్గి 17,858 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఒక దశలో 473 పాయింట్లు పతనమై 59,752కు చేరింది. ఇక నిఫ్టీ సైతం 17,946–17,762 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. కాగా, సాహ్ పాలిమర్స్ షేరు.. బీఎస్‌ఈలో 31% ప్రీమియంతో రూ. 85 వద్ద లిస్టయ్యింది (ఇష్యూ ధర రూ. 65). రూ. 89 వరకూ ఎగసింది. అదే స్థాయిలో ముగిసింది.

ఇన్ఫోసిస్ గైడెన్స్ అప్

- ఆదాయ అంచనాల సవరణ
- 2023లో 16–16.5 శాతం వృద్ధి
- క్యూ3లో పటిష్ట ఫలితాలు
- నికర లాభం 13 శాతం అప్

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ మార్చితో ముగిసే ఈ ఏడాది(2022–23) ఆదాయ అంచనాలను పెంచింది. 16–16.5 శాతం వృద్ధిని సాధించగలమంటూ గైడెన్స్‌ను సవరించింది. గతంలో 15–16 శాతం అంచనాలు ప్రకటించింది. ఇక ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతంపైగా పుంజుకుని రూ. 6,586 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 5,809 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 20 శాతం ఎగసి రూ. 38,318 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 31,867 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా చేపట్టిన ప్రస్తుత బైబ్యాక్‌లో భాగంగా 3.13 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇందుకు రూ. 4,790 కోట్లు వెచ్చించింది.

- క్యూ3లో గత 8 క్వార్టర్లతో పోలిస్తే ఆర్డర్ల విలువ మెరుగైంది. మొత్తం 3.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది.
- నికరంగా 1,627 మంది ఉద్యోగులను జత చేసుకుంది. సిబ్బంది సంఖ్య 3,46,845ను తాకింది.
- అట్రిషన్ రేటు 25.5% నుంచి 24.3%కి తగ్గింది. త్రైమాసికంగా చూస్తే 2.8% తగ్గినట్లు తెలిపింది.
- 2021–22 క్యూ3లో నమోదైన ఉద్యోగులు 2,92,067కాగా.. 2022–23 క్యూ3కల్లా 54,778 మంది జత కలిశారు.



ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్

ఇన్ఫీ షేరు 1% ఎగసి రూ. 1,483 వద్ద ముగిసింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు ప్రకటించింది.

సాక్షి స్పోర్ట్స్



ధ్రువ్ షోరే సెంచరీ

ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఢిల్లీ దీటైన రీతిలో జవాబిచ్చింది. మ్యాచ్ మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఢిల్లీ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఓపెనర్ ధ్రువ్ షోరే (261 బంతుల్లో 142 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించగా... హిమ్మత్ సింగ్ (45 బ్యాటింగ్), హృతిక్ షోకీన్ (45) సహకరించారు. ఆంధ్ర బౌలర్లలో షోయబ్ ఖాన్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఢిల్లీ మరో 159 పరుగులు వెనుకబడి ఉంది. శుక్రవారం చివరి రోజు కావడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగిసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే తొలి ఇన్నింగ్స్‌లో ఎవరికి ఆధిక్యం లభిస్తుందనేది చూడాలి.

లమిచానేకు బెయిల్

రేప్ ఆరోపణలతో మూడు నెలల క్రితం అరెస్ట్ అయిన నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానేకు కాస్త ఊరట లభించింది. 22 ఏళ్ల లమిచానేకు కట్మండు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.


సిరాజ్

భారత్ లక్ష్యం 216 పరుగులే...కానీ ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా లేని పిచ్‌పై షాట్లు ఆడటమే కష్టంగా మారిపోయింది.. ఇలాంటి స్థితిలో విజయం కోసం భారత్ 43వ ఓవర్ వరకు శ్రమించింది... స్వల్ప ఛేదనలోనూ కాస్త తడబడినా, రాహుల్ పట్టుదలగా నిలబడటంతో చివరకు భారత్ గెలుపును అందుకొని సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. అంతకు ముందు సిరాజ్, కుల్దీప్‌లు చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేశారు. దాంతో కనీస స్కోరు కూడా సాధించలేక శ్రీలంక చేతులెత్తేసింది.

సిరీస్ చిక్కింది

- రెండో వన్డేలో భారత్ విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- 4 వికెట్లతో ఓడిన శ్రీలంక
- రాణించిన సిరాజ్, కుల్దీప్, రాహుల్
- ఆదివారం చివరి వన్డే

కోల్‌కతా: టి20 మ్యాచ్‌లోనే 228 పరుగులు నమోదై వారం కూడా కాలేదు. అదే వన్డేలకు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. శ్రీలంక కనాకష్టంగా స్కోరు చేయగా, దానిని ఛేదించేందుకు భారత్ 6 వికెట్లు చేజార్చుకుంది. గురువారం జరిగిన రెండో వన్డేలో భారత్ 4 వికెట్లతో శ్రీలంకను ఓడించింది. మొదట శ్రీలంక 39.4 ఓవర్లలోనే 215 పరుగుల వద్ద ఆలౌటైంది. నువనిదు ఫెర్నాండో (63 బంతుల్లో 50; 6 ఫోర్లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్, సిరాజ్ చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత భారత్ 43.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (103 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. సిరీస్ 2–0తో భారత్ గెలుచుకోగా, చివరి వన్డే ఆదివారం తిరువనంతపురంలో జరుగుతుంది. భుజం గాయంతో దూరమైన చహల్ స్థానంలో కుల్దీప్ ఈ మ్యాచ్‌లోకి వచ్చాడు.

రాణించిన నువనిదు

అవిష్క ఫెర్నాండో (20; 4 ఫోర్లు) ఎక్కువ సేపు నిలబడలేకపోగా, అరంగేట్రం చేసిన నువనిదు ఫెర్నాండో పిచ్ పరిస్థితులకు తగ్గట్లుగా బ్యాటింగ్ చేశాడు. తన ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లు కొట్టిన అవిష్కను సిరాజ్ మరుసటి ఓవర్లో బౌల్డ్ చేశాడు. తర్వాత కుశాల్, నువనిదు ఓవర్‌కు 6 పైచిలుకు రన్‌రేట్‌తో జట్టు స్కోరును వంద పరుగులకు చేర్చారు. అంతలోనే కుశాల్ (34 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్)ను కుల్దీప్ ఎల్బీగా పంపడంతో 73 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. తర్వాత స్పిన్, పేస్‌ల వైవిధ్యం లంకను కుదురుకోనివ్వలేదు. ధనంజయ (0)ను అక్షర్ డకౌట్ చేయగా, అసలంక (15), కెప్టెన్ షనక (2)లను కుల్దీప్ బోల్తా కొట్టించాడు. హసరంగ (21; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటికి ఉమ్రాన్ బ్రేకులేయగా, లోయర్ ఆర్డర్‌లో దునిత్ వెలలగే (34 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) చేసిన స్కోరుతో లంక కష్టంగా 200 పరుగులు దాటింది.

హార్దిక్ సహకారం

లక్ష్యం చిన్నదే అయినా గెలుపు సులువుగా ఏమీ రాలేదు. గత మ్యాచ్ 'టాప్ 3' రోహిత్ (17; 2 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (12 బంతుల్లో 21; 5 ఫోర్లు), కోహ్లి (4) తొలి పది ఓవర్లలోపే అవుటైతే గానీ పిచ్ సత్తా తెలియలేదు. 62 పరుగులకే వీళ్లంతా పెవిలియన్‌లో కూర్చున్నారు. మిగిలిన ప్రధాన బ్యాటర్స్ ముగ్గురే... అయ్యర్, రాహుల్, పాండ్యా! కానీ లక్ష్యదూరం మాత్రం 154 పరుగులు. కీలక దశలో శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 28; 5 ఫోర్లు) కూడా వెనుదిరిగాడు. అయితే రాహుల్, హార్దిక్ పాండ్యా (53 బంతుల్లో 36; 4 ఫోర్లు) భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఈ జోడీ ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించింది. 161 స్కోరు వద్ద పాండ్యా అవుటైనా... రాహుల్ కడదాకా నిలబడ్డాడు. అక్షర్ (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్), కుల్దీప్ (10 నాటౌట్; 2 ఫోర్లు)లతో కలిసి జట్టును గెలిపించాడు. 93 బంతుల్లో (3 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.


రాహుల్

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: అవిష్క (బి) సిరాజ్ 20; నువనిదు రనౌట్ 50; మెండిస్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 34; ధనంజయ (బి) అక్షర్ 0; అసలంక (సి) అండ్ (బి) కుల్దీప్ 15; షనక (బి) కుల్దీప్ 2; హసరంగ (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 21; దునిత్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 32; కరుణరత్నే (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 17; రజిత నాటౌట్ 17; లహిరు (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (39.4 ఓవర్లలో ఆలౌట్) 215. వికెట్ల పతనం:** 1–29, 2–102, 3–103, 4–118, 5–125, 6–126, 7–152, 8–177, 9–215, 10–215. **బౌలింగ్:** షమీ 7–0–43–0, సిరాజ్ 5.4–0–30–3, పాండ్యా 5–0–26–0, ఉమ్రాన్ 7–0–48–2, కుల్దీప్ 10–0–51–3, అక్షర్ 5–0–16–1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మెండిస్ (బి) కరుణరత్నే 17; గిల్ (సి) అవిష్క (బి) లహిరు 21; కోహ్లి (బి) లహిరు 4; అయ్యర్ (ఎల్బీ) (బి) రజిత 28; రాహుల్ నాటౌట్ 64; పాండ్యా (సి) మెండిస్ (బి) కరుణరత్నే 36; అక్షర్ (సి) కరుణరత్నే (బి) ధనంజయ 21; కుల్దీప్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (43.2 ఓవర్లలో 6 వికెట్లకు) 219.**
వికెట్ల పతనం: 1–33, 2–41, 3–62, 4–86, 5–161, 6–191.
బౌలింగ్: కసున్ రజిత 9–0–46–1, లహిరు 9.2–0–64–2, కరుణరత్నే 8–0–51–2, హసరంగ 10–0–28–0, దునిత్ 2–0–12–0, షనక 2–0–6–0, ధనంజయ 3–0–9–1.

48 ఏళ్ల కల నెరవేరేనా!

- రెండో టైటిల్ లక్ష్యంగా భారత్
- నేటి నుంచి హాకీ ప్రపంచ కప్
- బరిలో 16 జట్లు
- జనవరి 29న ఫైనల్

ఎప్పుడో 1975లో... భారత హాకీ జట్టు అజిత్‌పాల్ సింగ్ నాయకత్వంలో ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి విశ్వ విజేతగా నిలిచింది. అయితే ఆ తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా నాటి మేటి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. ట్రోఫీ గెలవడం సంగతేమో గానీ ఆ తర్వాత 11 ప్రపంచ కప్‌లు జరిగినా మన టీమ్ కనీసం సెమీ ఫైనల్ కూడా చేరలేకపోవడం నిరాశ కలిగించే అంశం. వరుసగా రెండో సారి మనమే ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో భారత జట్టు రాత మారుతుందా... కొన్నాళ్ల క్రితం ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ఆటను ప్రదర్శించి కాంస్యం సాధించిన మన టీమ్ అదే జోరును చూపిస్తుందా అనేది ఆసక్తికరం.


భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్

భువనేశ్వర్: భారత గడ్డపై మరో విశ్వ సంబరానికి సమయం ఆసన్నమైంది. 15వ హాకీ వరల్డ్ కప్ నేడు లాంఛనంగా ప్రారంభం కానుంది. ఒడిశాలోని రెండు వేదికలు భువనేశ్వర్, రూర్కెలాలలో 17 రోజుల పాటు మొత్తం 44 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాతో దక్షిణాఫ్రికా తలపడుతుంది. తొలి రోజే బరిలోకి దిగనున్న భారత్... స్పెయిన్‌ను ఎదుర్కోనుంది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం ఇప్పటికే అందుబాటులో ఉండగా... కొత్తగా ఈ టోర్నీ కోసం మరో పెద్ద హాకీ స్టేడియాన్ని రూర్కెలాలో నిర్మించారు. 24 మ్యాచ్‌లు భువనేశ్వర్‌లో, 20 మ్యాచ్‌లు రూర్కెలాలో జరుగుతాయి. మొత్తం 16 జట్లు బరిలోకి దిగుతుండగా వాటిని నాలుగు పూల్‌లుగా విభజించారు. ముందుగా తమ గ్రూప్‌లో ఇతర మూడు జట్లతో తలపడాల్సి ఉంటుంది. ఆ తర్వాత 'క్రాస్ ఓవర్స్', క్వార్టర్స్, సెమీస్ ఉంటాయి. జనవరి 29న ఫైనల్ నిర్వహిస్తారు.

నేటి మ్యాచ్‌లు

- అర్జెంటీనా x దక్షిణాఫ్రికా (మ.గం. 1.00 నుంచి)
- ఆస్ట్రేలియా x ఫ్రాన్స్ (మం.గం. 3.00 నుంచి)
- ఇంగ్లండ్ x వేల్స్ (సా.గం. 5.00 నుంచి)
- భారత్ x స్పెయిన్ (సా.గం. 7.00 నుంచి)

పూల్‌ల వివరాలు

- 'ఎ' – అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా
- 'బి' – బెల్జియం, జర్మనీ, జపాన్, కొరియా
- 'సి' – చిలీ, మలేసియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్
- 'డి' – భారత్, స్పెయిన్, ఇంగ్లండ్, వేల్స్

★ ప్రపంచకప్‌ను అత్యధికంగా పాకిస్తాన్ (4 సార్లు) గెలవగా...నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా చెరో 3 టైటిల్స్ సాధించాయి. జర్మనీ రెండు సార్లు విజేతగా నిలవగా...భారత్, బెల్జియం ఒక్కో సారి ట్రోఫీని అందుకున్నాయి.

క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రణయ్ 21–9, 15–21, 21–16 స్కోరుతో చికో అరా వర్డోయో (ఇండోనేసియా)పై విజయం సాధించాడు. పురుషుల డబుల్స్‌లో భారత జోడి సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి కూడా క్వార్టర్స్‌కు చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్–చిరాగ్ 21–19, 22–20తో 49 నిమిషాల్లోనే షోహిబుల్ ఫిక్రి–మౌలానా బగస్ (ఇండోనేసియా)ను చిత్తు చేశారు. అయితే మహిళల డబుల్స్‌లో మాత్రం భారత్ కథ ముగిసింది. హోరాహోరీగా సాగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో భారత ద్వయం పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రిసా జాలీ 13–21, 21–15, 17–21 తేడాతో గాబ్రియా స్టోవా – స్టెఫానీ స్టోవా (బల్గేరియా) చేతిలో ఓటమిపాలయ్యారు.

హైదరాబాద్ మ్యాచ్ 'డ్రా'

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జోరుకు 'డ్రా'తో బ్రేక్ పడింది. వరుసగా ఐదు విజయాల తర్వాత సొంతగడ్డపై గురువారం చెన్నైయిన్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్ 1–1తో హైదరాబాద్ డ్రా చేసుకుంది. చెన్నై జట్టుకు పీటర్ స్లిస్కోవిచ్ (57వ ని.) ఆధిక్యం అందించగా, హైదరాబాద్ తరఫున బర్తొలొమివ్ ఒగ్బెచె (87వ ని.) పెనాల్టీ కిక్‌తో గోల్ చేయడంతో స్కోరు సమమైంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి

విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 13 । జనవరి । 2023



నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

యువత తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ పద్మభూషణ్ డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ తెలిపారు. -IIలో▸



ఎడ్ల బండ లాగుడు పోటీలు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, నాగేశ్వర రావు (చిన్ని) నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు గురువారం కూడా కొనసాగాయి. -IIలో▸



కోడి పందేల బరులు ధ్వంసం

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం, రెడ్డిగూడెం గ్రామ శివారు మామిడి తోటల్లో కోడి పందేలు నిర్వహించడానికి సిద్ధం చేసిన బరులను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల



ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాలు ఈ నెల 13,14,15 తేదీల్లో నిర్వహించనున్నట్లు తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్ తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ తంబి మహోత్సవాలకు ఆంధ్రా, తెలంగాణ, ఒడిసా, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి ప్రతి ఏటా లక్షలాది భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. యాత్రికుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మహోత్సవాలకు మూడు రోజుల పాటు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారని తెలిపారు. పెద అవుటపల్లి రైల్వే స్టేషన్లో రైళ్లు నిలిపే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

పురోహితులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పురోహితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురం పురోహిత సంఘం కార్యాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దినత్రయ వేదపారాయణం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ లోకక్షేమం కోసం దేశమంతటా టీటీడీ వేదపారాయణం చేయిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వేదపండితులకు చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. పండితుల విజ్ఞాపనలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం సత్యనారాయణపురం పురోహిత సంఘం ఆధ్వర్యంలో టీటీడీ సూపర్‌వైజర్ గుళ్లపల్లి శివశర్మని సత్కరించారు. 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, గుడిపాటి సీతారాం, గాయత్రి సొసైటీ సెక్రటరీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్స్‌పై విజిలెన్స్ దాడులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో నాన్ జుడీషియల్ స్టాంపులు విక్రయించే స్టాంప్ వెండర్స్‌పై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. గాంధీనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోని రెండు షాపులు, పటమట పరిధిలోని మూడు షాపులపై అధికారులు దాడులు నిర్వహించారు. వెండర్స్ వద్ద ఉన్న స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. స్టాంపులు ఏ ధరకు విక్రయిస్తున్నారు..? స్టాంపుల అమ్మకం, నిల్వల మధ్య ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయోమోనని తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించిన నేపథ్యంలో విజయవాడ నగరంలోనూ స్టాంపులు విక్రయించే వెండర్స్ దుకాణాల్లో సోదాలు జరిగినట్లు సమాచారం.

ఊబకాయం..

వ్యాధులు ఖాయం

- హృద్రోగుల్లో 25 శాతం మంది ఊబకాయులే
- బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమవుతున్న అధిక బరువు
- మధుమేహం, రక్తపోటుకూ దారితీస్తున్న వైనం
- వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరంటున్న వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఊబకాయం (ఒబెసిటీ)తో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. అధిక బరువు ఉన్న వారిని గుండె జబ్బులతో పాటు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ సంబంధిత, కీళ్ల సమస్యలు వెంటాడుతున్నాయి. ఊబకాయులు ఇటీవల అనేక దుష్ఫలితాలతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి క్యూ కడుతున్నారు. కార్డియాలజీ విభాగానికి వచ్చే రోగుల్లో 25 శాతం మంది ఊబకాయులే ఉంటున్నారు. ఒబెసిటీతో వచ్చే హైపర్‌టెన్షన్‌తో బ్రెయిన్ స్ట్రోక్, మధుమేహం, కిడ్నీ వ్యాధులు కూడా సోకుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. కొవ్వు పదార్థాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకునే వారు శరీరానికి తగిన వ్యాయామం లేక ఒబెసిటీతో వ్యాధుల బారిన పడుతున్నారు. జాతీయ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తున్న నాన్ కమ్యూనికల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో సైతం ఒబెసిటీ కారణంగా రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు సోకుతున్నట్లు తేలింది.



పెరుగుతున్న గుండె జబ్బులు

గుండె జబ్బుల బారిన పడుతున్న వారిలో ఊబకాయులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వాస్పత్రి కార్డియాలజీ ఓపీకి రోజూ 250 మంది వరకూ రోగులు వస్తారు. వారిలో 25 శాతం మంది అంటే 55 మంది ఊబకాయులే. వారిలో గుండె రక్తనాళాలు సన్నబడి బ్లాకులు ఏర్పడటం, గుండెపై తీవ్ర ఒత్తిడి, పల్మనరీ ఎంబోలిజమ్, పల్మనరీ హైపర్ టెన్షన్ వంటి సమస్యలను వైద్యులు గుర్తిస్తున్నారు. రక్తనాళాల్లో బ్లాకులు ఉన్న వారికి యాంజియోప్లాస్టీతో బ్లాకులను తొలగించి స్టెంట్‌లు వేస్తున్నారు.

కిడ్నీ సంబంధిత సమస్యలు

ఒబెసిటీ కారణంగా కిడ్నీలపై ఒత్తిడి పడుతోంది. ఆ కారణంగా ఫిల్టర్‌లు దెబ్బతింటున్నాయి. దీంతో యూరిన్‌లో ప్రొటీన్లు లీకవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు. కాళ్ల వాపులు రావడం, కిడ్నీలు పూర్తిగా పాడైన వారిని కూడా చూస్తున్నారు. ఊబకాయుల్లో వచ్చే మధుమేహం, రక్తపోటు కారణంగా కిడ్నీలు దెబ్బతిన్న వారు ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ కోసం వస్తున్నారు. నిత్యం 50 నుంచి 60 మంది డయాలసిస్ చేయించుకుంటుండగా, వారిలో సగం మంది ఊబకాయులేనని వైద్యులు పేర్కొంటున్నారు.

నియంత్రణ ఇలా..

మనదేశంలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 23.5 దాటిన వారందరినీ ఊబకాయులుగా భావిస్తారు. వారు బరువు తగ్గేందుకు శ్రమగల జీవన విధానం, సమతుల ఆహారం తీసుకుంటే సత్ఫలితాలు రాబట్టవచ్చు. బరువు తగ్గేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక విధానాలు ఉన్నాయి. దీర్ఘకాల విధానంలో వారానికి మూడు, నాలుగు గంటలు వ్యాయామం చేయడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. స్వల్పకాలంలో రోజుకు వెయ్యి క్యాలరీల కంటే తక్కువ ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చు. బీఎంఐ 27 శాతం కంటే ఎక్కువ ఉన్న వారికి మందులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పద్ధతులను అనుసరించినా బరువు తగ్గకుంటే బీఎంఐ 30 శాతం దాటిన వారికి బేరియాట్రిక్ (మెటబాలిక్) సర్జరీలతో సత్ఫలితాలు సాధిస్తున్నారు.

ఇతర వ్యాధులు ఇవీ..

- ఒబెసిటీ వారిలో రక్తపోటు, మధుమేహం వలన వచ్చే దుష్ఫలితాలు ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.
- ఒబెసిటీ ఉన్న వారిలో పది శాతం మందికి గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడుతున్నాయి.
- ఫ్యాటీ లివర్ ఏర్పడి, దీర్ఘకాలంలో తీవ్రమైన లివర్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- మోకీళ్లపై ప్రభావం చూపి, నాలుగు పదుల వయస్సులోనే మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తోంది.

ఊబకాయుల్లో గుండె సమస్యలు

ఒబెసిటీ ఉన్న వారిలో గుండె సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. ప్రభుత్వాస్పత్రికి గుండె జబ్బులతో వచ్చే వారిలో 30 శాతం మందికి ఒబెసిటీనే కారణం. ఒబెసిటీతో గుండె రక్తనాళాలు సన్నబడి బ్లాకులు ఏర్పడుతున్నాయి. పల్మనరీ ఎంబోలిజమ్ కేసులు కూడా చూస్తున్నాం. ఒబెసిటీకి జీవనశైలి కారణం. వ్యాయామం, ఆహార నియమాలు పాటించడం ద్వారా ఒబెసిటీని అధిగమించొచ్చు. ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. నూనె పదార్థాలు, స్వీట్లు తక్కువగా తీసుకుంటే మంచిది.



– డాక్టర్ శ్రీహరి, కార్డియాలజిస్ట్, విజయవాడ జీజీహెచ్

బరువు తగ్గితే మంచిది

ఊబకాయం ఉన్న మధుమేహులు తమ బరువులో ఐదు శాతం తగ్గించుకోగలిగితే అతి తక్కువ మందులతో మెరుగైన వ్యాధి నియంత్రణా ఫలితాలు రాబట్టవచ్చు. హృద్రోగ సమస్యలను నివారించుకోవచ్చు. సమతుల ఆహారం, శ్రమగల జీవన విధానం, జీవనశైలిలో మార్పులు పాటించడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. ఊబకాయుల్లో మధుమేహ నియంత్రణకు ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయి. ఎస్‌జీఎల్‌టీ2 ఇన్హిబిటర్స్, జీఎల్‌పీ1 అనాలజీస్ మందులతో షుగర్ నియంత్రణతో పాటు బరువు తగ్గుతారు.



– డాక్టర్ ఎం.సునీత, మధుమేహ వైద్య నిపుణులు, విజయవాడ

మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద

కలెక్టర్ ఢిల్లీరావు



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో స్వామి వివేకానంద 160వ జయంతి గురువారం నిర్వహించారు. తొలుత కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ కుమార్ వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ వివేకానంద జయంతి రోజును ఏటా జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. భారతదేశ ఖ్యాతిని, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లోనూ ఆయన గురువు రామకృష్ణ పరమహంస పేరిట రామకృష్ణ మిషన్, రామకృష్ణ మఠాలను స్థాపించి ఎందరో విద్యావంతులను సమాజ సేవకు అంకితం చేశారని పేర్కొన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను, హైందవ సనాతన ధర్మాన్ని విశ్వ వ్యాప్తంగా చాటి చెప్పారని తెలిపారు. భారతదేశం అద్భుతాలకు నిలయమని, ఈ దేశాన్ని సందర్శిస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయని విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారన్నారు. స్వామి వివేకానంద సూక్తులకు ప్రభావితమై నేటికీ ఎంతోమంది తమ లక్ష్యాలను నెరవేర్చుకుంటున్నారని వెల్లడించారు.

విజేతలను అభినందించిన కలెక్టర్...

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలను కలెక్టర్ అభినందిచారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు కేబీఎన్ కళాశాల, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ , క్విజ్, కబడ్డీ, వాలీబాల్ , ఖోఖో పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు షీల్డ్, ప్రశంసాపత్రాలు అందచేశారు. జిల్లా యువజన సంక్షేమ అధికారి యు. శ్రీనివాసరావు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు అభివృద్ధి కమిటీలు

- పట్టణ పీహెచ్‌సీలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి
- ఆస్పత్రి కమిటీకి కార్పొరేటర్/ కౌన్సిలర్ ఛైర్మన్‌గా నియామకం
- కో ఛైర్మన్‌గా జిల్లా ప్రోగ్రామ్ అధికారి



విజయవాడలో ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న యూపీహెచ్‌సీ, అందులోని సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుంది. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సేవలను పర్యవేక్షించేందుకు గానూ తొమ్మిది మంది సభ్యులతో కమిటీలను నియమించింది. యూపీహెచ్‌సీ ఉన్న ప్రాంతానికి చెందిన కార్పొరేటర్/కౌన్సిలర్ ఆ ఆస్పత్రికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కో ఛైర్మన్‌గా ఉంటారు. వారితో పాటు మెడికల్ ఆఫీసర్‌ను కన్వీనర్‌గా నియమించారు. మున్సిపల్ కమిషనర్, ప్రజారోగ్య అధికారి, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్టార్ సూపర్‌వైజర్, మహిళా ఆరోగ్య సమితి ఛైర్‌పర్సన్, ఆ ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు కమిటీలో సభ్యులుగా ఉంటారు.

సేవలపై నిరంతర పర్యవేక్షణ....

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలపై ఉన్నతాధికారులతో పాటు, అభివృద్ధి కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై కమిటీ నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రభుత్వ పరంగా మందులు సరఫరా, వ్యాధి నిర్ధారణ పరికరాలు, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించారు. వైద్యులు, ఇతర సిబ్బంది సమర్థవంతంగా సేవలు అందించేలా అభివృద్ధి కమిటీలు దోహదపడతాయి.

ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం...

ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు, వినూత్న కార్యక్రమాలను సైతం చేపట్టింది. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా రోగుల ఇళ్లకే వెళ్లి వైద్యం చేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం పట్టణవాసుల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఒకప్పుడు ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లుగానే ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను ప్రభుత్వం మార్చేసింది. డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా (యూపీహెచ్‌సీ) అవి రూపాంతరం చెందాయి. శాశ్వత వైద్యులతో పాటు, అవసరమైన సిబ్బందిని నియమించారు. రోగులకు అన్ని రకాల మందులు పుష్కలంగా అందుబాటులో ఉంచారు. తాజాగా మరో అడుగు ముందుకేసి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అభివృద్ధి కమిటీల నియామకాలు చేపట్టారు.

సేవల పురోగతికే కమిటీలు



పట్టణ ప్రజలకు మరింత పటిష్టంగా వైద్య సేవలు అందించేందుకు యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశాం. అక్కడ అందించే సేవల పర్యవేక్షణ, పురోగతి కోసం ప్రతి యూపీహెచ్‌సీకి అభివృద్ధి కమిటీ నియమించాం. వాళ్లు నిరంతరం మానిటరింగ్ చేస్తుంటారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

ముగిసిన ఇండియన్ రౌండ్ ఆర్చరీ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ ఆర్చరీ పోటీల్లో భాగంగా అండర్-14 బాలబాలికల ఇండియన్ రౌండ్ పోటీలు గురువారం ముగిశాయి. విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతున్న ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. శుక్రవారం నుంచి అండర్-9 విభాగంలో పోటీలు ప్రారంభమవుతాయని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు.

ఇండియన్ రౌండ్ విజేతలు వీరే....

50 మీటర్ల ఓవరాల్ బాలుర విభాగంలో సోహిల్‌చౌదరి (ఉత్తరప్రదేశ్), మహావీర్ (ఏబీవీకేపీ), అభ్యుదయ్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో సమీక్షా (మహారాష్ట్ర), లక్ష్మీకుమారి (జార్ఖండ్), వేదాక్షి (ఉత్తరప్రదేశ్), వ్యక్తిగత ఒలింపిక్‌రౌండ్ బాలుర విభాగంలో జాక్సన్ (మణిపూర్), ఆర్యన్‌సిన్హా (గుజరాత్), అభ్యుదయ్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో సమీక్షా (మహారాష్ట్ర), లక్ష్మీకుమారి (జార్ఖండ్), సిమ్రాన్‌కుమారి (జార్ఖండ్), టీమ్ బాలుర విభాగంలో మహారాష్ట్ర, మణిపూర్, జార్ఖండ్, బాలికల విభాగంలో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యాణ, మిక్స్‌డ్ విభాగంలో ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.



ఆర్చరీ ఇండియన్ రౌండ్ విజేతలు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖల ప్రాధాన్యత అధికంగా ఉంటుందని కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై గురువారం వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమం, విద్యా శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11 నుంచి 19 సంవత్సరాల బాలికలతో పాటు, గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా హైస్కూల్స్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, వసతి గృహాల్లోని బాలికలకు రక్తహీనత నివారణకు అదనపు పౌష్టికాహారం, ఐరన్ టాబ్లెట్స్ అందించాలని చెప్పా రు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుహాసిని, సీపీఓ రత్నరూత్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, డిస్ట్రిక్ట్ ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ విజయభారతి, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రుక్మాందయ్య, బీసీ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ దుర్గ ఉన్నారు.

పక్కాగా ఈ క్రాప్ !

- సాగుకు అవసరమైన చేయూత
- విపత్తుల్లో అన్నదాతలకు సాయం
- అన్నింటికీ ఈ-క్రాప్ ఒక్కటే మార్గం
- ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో చురుగ్గా నమోదు

కంకిపాడు: రైతులు సాగు చేసే పంటల నమోదుతో వ్యవసాయంలో పక్కాగా పారదర్శకత నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఈ క్రాప్ నమోదు ప్రక్రియ రైతులకు సత్ఫలితాలనిస్తుంది. సాగు అంచనాలు, అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు, సీజన్ వారీగా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఏ మేరకు డిమాండ్ ఉందో?, పంట అమ్మకాలు, విపత్తుల్లో అండదండగా ఉండేలా ప్రభుత్వం ఈ-క్రాప్ అమలు చేస్తుంది. ముందస్తు ప్రణాళికతో వ్యవసాయాన్ని పండుగలా మార్చి అన్నదాతకు భరోసా, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ క్రాప్ నమోదు చురుగ్గా సాగుతోంది.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పంటల సాగు...

కృష్ణా జిల్లాలో వివిధ రకాల పంటలు 1,63,513 హెక్టార్ల విస్తీర్ణంలో సాధారణ సాగు జరుగుతున్నట్లు అంచనా. ఎన్టీఆర్ జిల్లాలో 34,141 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అంచనాలు చెబుతున్నాయి. సాధారణ సాగు విస్తీర్ణం, ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు జరిగింది?, రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఈ క్రాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. పంట వివరాల నమోదులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త అజమాయిషీతో ఈ క్రాప్ నమోదు సమర్థవంతంగా సాగుతుంది. దీంతో ప్రాంతాల వారీగా పంటల వివరాలు, రైతులు, కౌలు వ్యవసాయంపై స్పష్టత ఏర్పడుతుంది.



కంకిపాడు మండలం పునాదిపాడులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ పావని

ప్రణాళిక సిద్ధం చేయటం సులువు....

ఈ క్రాప్ నమోదుతో జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే పంటల లెక్క తేలుతుంది. అంతే కాకుండా ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలకు విత్తనాలు, ఎరువుల అవసరం, పురుగు మందుల వినియోగంపై వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. స్థానిక లభ్యత, అందుకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దీంతో బయట మార్కెట్‌లో దోపిడీ నుంచి అన్నదాతలకు ఊరట కలిగించేలా కృషి చేస్తున్నారు.

ప్రయోజనాలు పొందుతున్నాం



ఈ క్రాప్ విధానం రైతులకు అండగా ఉంటుంది. విత్తనాలు, పెట్టుబడులు, పరిహారాలు అన్ని ఈ క్రాప్ ద్వారా వస్తున్నాయి. నాకు 5.50 ఎకరాల పొలం గ్రామంలో ఉంది. ఆర్‌బీకే ద్వారా సాగుకు ప్రయోజనాలు సమకూరుతున్నాయి. పంట అమ్మకం సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. రైతులు ఈ క్రాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– నక్కా శ్రీనివాసరావు, రైతు, కోలవెన్ను, కంకిపాడు మండలం

ఈ క్రాప్‌తో ప్రణాళికలు



ఇప్పటికే 35 శాతం పైగా ఈ క్రాప్ పూర్తయింది. సాగు అంచనాలు, రైతులకు కల్పించాల్సిన ప్రయోజనాలపై ప్రణాళికలు రూపొందించేందుకు ఈ క్రాప్ దోహదపడుతుంది. రైతులు వ్యవసాయ సహాయకులు ద్వారా పంట నమోదు చేయించుకోవాలి. ప్రభుత్వం అందించే సాగు చేయూతను లబ్ధి పొందాలి. విపత్తులు, పంట అమ్మకాల సమయంలో ఈ క్రాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– మనోహరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణా జిల్లా

పంట కొనుగోళ్లు... విపత్తుల్లో ఆసరా...

ఈ క్రాప్ నమోదుతో సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు అంచనా, పంట కొనుగోళ్లకు బడ్జెట్, లక్ష్యాల నిర్దేశం ప్రణాళికాబద్ధంగా జరుగుతుంది. రైతులకు అవసరమైన రుణాలు, పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీల చెల్లింపులు, పంటల బీమా పథకం వర్తింపు, విపత్తుల్లో రైతులకు సాయం, సాగు పెట్టుబడులకు రైతుభరోసా అన్నింటికీ ఈ-క్రాప్ నమోదు ఒక్కటే మూలాధారం. వ్యవసాయ ప్రణాళికల రూపకల్పనలో ఈ క్రాప్ నమోదు ప్రాధాన్యతపై క్షేత్రస్థాయిలో రైతులు, కౌలురైతులకు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తుంది. దీంతో నమోదు ప్రక్రియ కూడా సమర్థంగా సాగుతోంది. ఇప్పటికే 38 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయినట్లు ప్రాథమిక అంచనా. నూరుశాతం ఈ క్రాప్ నమోదు జరిగేలా వ్యవసాయశాఖ పనిచేస్తుంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కొణతనపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్‌ఐ వై.దుర్గారావు కథనం మేరకు కంకిపాడు పట్టణానికి చెందిన బోడగం పిచ్చియ్య (65) కొణతనపాడు అడ్డరోడ్డు సమీపంలోని ఓ కళాశాల భవనం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం డ్యూటీకి వచ్చిన పిచ్చియ్య జాతీయ రహదారి దాటి వెళ్లి తనకు తెలిసిన వ్యక్తితో మాట్లాడి తిరిగి రోడ్డు దాటుతుండగా కంకిపాడు నుంచి ఉయ్యూరు వైపు వెళ్లే కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై పిచ్చియ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు కారణమైన వ్యక్తులు కారుతో సహా పరారయ్యారు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు జాతీయ రహదారి వెంబడి ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్ సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కేఈబీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

తోట్లవల్లూరు(పామర్రు): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని దేవరపల్లిలో గురువారం జరిగింది. స్థానిక కేఈబీ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ జి. రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు, నీలి రంగు చారల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, స్టార్ గుర్తు కలిగి 786 నంబరు గల రాగి ఉంగరం కలిగి ఉన్నాడని తెలిపారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు 94406 27050, 80747 19207 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు.

పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

- గ్రామంలా మారిపోయిన పోలీస్ పరేడ్ గ్రౌండ్
- గంగిరెద్దులు, హరిదాసులు, రంగవల్లులతో కోలాహలం
- కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్న పోలీసు సిబ్బంది



గంగిరెద్దు ఆటను తిలకిస్తున్న సీపీ టి.కె.రాణా

పటమట(విజయవాడతూర్పు): సంక్రాంతి తెలుగువారి పండుగని, పండగలను ఐకమత్యంతో నిర్వహించుకోవటం సంతోషంగా ఉందని, నిత్యం వివిధ ఒత్తిడులుతో జీవనం సాగించే ఉద్యోగులు ఇలాంటి వేడుకల్లో పాలుపంచుకోవటం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి సిటీ అర్మ్‌డ్ రిజర్వు పోలీస్ గ్రౌండ్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పోలీస్ పరేడ్ మైదానంలో భోగిమంటలు, గంగిరెద్దులు, ఎడ్ల బండ్లు, హరిదాసులు, ముత్యాల గొబ్బెమ్మలు, రంగవల్లులతో గ్రామం లాగా రూపొందించి, ఎన్నడూ లేని విధంగా అద్భుతమైన సంప్రదాయ నృత్యాలు, వివిధ రకాల డాన్స్ కార్యక్రమాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా మాట్లాడుతూ నిత్యం మాక్‌డ్రిల్లు, పోలీస్ ప్రాక్టీస్‌కు వినియోగించే ఈ మైదానంలో పూర్తిస్థాయిలో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా పండుగ సంప్రదాయాలను ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రాగద్వేషాలకు అతీతంగా జీవనాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో డీసీపీలు విశాల్ గున్ని, డి.మేరీ ప్రశాంతి, మోకా సత్తిబాబు, కె.శ్రీనివాస్, ఎ.బి.టి.ఎస్ ఉదయ రాణి, ఎ.డి.సి.పి.లు సీహెచ్.లక్ష్మీపతి, పి.వెంకట రత్నం, టి.సర్కార్, కె.శ్రీనివాసరావు, ఏసీపీలు, అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పండుగ రోజుల్లో ప్రయాణం జాగ్రత్త!

ఆర్టీవో ప్రవీణ్



విజయవాడ స్పోర్ట్స్: సంక్రాంతి పండుగ రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తగా, సురక్షితంగా చేయాలని ఆర్టీవో ప్రవీణ్ సూచించారు. వాహన చోదకులు ప్రమాదాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున పొగ మంచు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మంచు అధికంగా ఉండటంతో రోడ్లన్నీ తేమతో ఉంటాయని వాహనాలు స్కిడ్ అయ్యే అవకాశం ఉంటుందని, మితిమీరిన వేగం వద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వెడల్పుతో ఉండే రోడ్లపై వాహనాలు జాగ్రత్తగా నడపాలన్నారు. మంచు కారణంగా ఎదురుగా ఉన్న వాహనం కనిపించేందుకు హెడ్‌లైట్లను, ఫ్లాగ్ లైట్లను వాడాలన్నారు. వెనుక వచ్చే వాహనం కనిపించేందుకు అద్దాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రధానంగా రాత్రి వేళల్లో సిగ్నల్ లైట్లను ఆన్‌చేసి వాహనాన్ని నడపాలన్నారు. మంచు వేళల్లో ఎదురుగా వెళ్లే వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించవద్దన్నారు. పరిమితికి మించిన ప్రయాణికులతో వాహనాలను నడపొద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణభూతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇద్దరు పాత నేరస్తులు అరెస్టు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే స్టేషన్‌లలో పలు నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను విజయవాడ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశాలోని కటక్ జిల్లాకు చెందిన షేక్ ఇమ్రాన్(38), మహ్మద్ షాజీద్(35) గురువారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా, వీరి కదలికలపై అందిన సమాచారంతో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సీఐలు పి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్సైలు ఖాదర్ హుసేన్, మకాత్‌లాల్ తమ సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

తరగతి గది నుంచి నేరుగా కార్పొరేట్ కంపెనీకి

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో అనేక మార్పులు వచ్చాయి. చదువుకుని ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే కన్నా ఆయా కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను కంపెనీలే కళాశాల స్థాయిలో తరగతి గదికి వచ్చి నేర్పించడమే కాకుండా ఉద్యోగాలు కూడా ఇస్తామంటున్నాయి. కంపెనీలు ఆఫర్ చేసిన కోర్సుల్లో చేరిన వారు కోర్సు పూర్తయిన తర్వాత మంచి జీతంతో కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం పొందుతున్నారు. డిగ్రీ పూర్తయి కళాశాల తరగతి గది మెట్లు దిగిన వెంటనే కార్పొరేట్ కంపెనీ లిఫ్ట్ ఎక్కి ఉద్యోగి హోదాలో ఆఫీస్‌లో అడుగు పెడుతున్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న టీసీఎస్ కంపెనీ అకడమిక్ రిలేషన్ షిప్ మేనేజర్ రవికుమార్

- పరిశ్రమల అవసరాలే బోధనాంశాలు
- కళాశాలలతో కార్పొరేట్ కంపెనీల ఒప్పందాలు
- సిలబస్‌తో పాటు నైపుణ్యాలు నేర్పుతున్న కంపెనీలు
- కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు
- విద్యా విధానంలో నూతన ఒరవడికి శ్రీకారం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రముఖ ఐటీ కంపెనీలు, పరిశ్రమలు నగరంలోని ప్రముఖ కళాశాలలతో ఒప్పందం చేసుకుంటున్నాయి. తమ కంపెనీలో పనిచేయడానికి ఉద్యోగులకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి దానికి తగినట్లుగా సిలబస్‌ను సైతం రూపొందించి కళాశాలకు అందజేస్తున్నాయి. ఆ సిలబస్ ను బోధించేందుకు అవసరమైన అధ్యాపకులు, సిలబస్, మెటీరియల్, ఎగ్జామ్ పేపర్లు కూడా ఆయా కంపెనీలే కళాశాలలకు సమకూర్చుతున్నాయి. తాము స్పాన్సర్ చేసిన కోర్సు పూర్తి చేసిన యువతకు ప్రాధాన్యం ఇచ్చి తమ కంపెనీల్లోనే అత్యధిక ప్యాకేజీలతో ఉద్యోగులుగా చేర్చుకుంటున్నాయి. ఈ విధంగానే ఇప్పుడు నగరంలోని పీబీ సిద్ధార్థ కళాశాలతో ఐటీ కంపెనీల్లో దిగ్గజం వంటి టాటా కన్సల్టేషన్ సర్వీసెస్ (టీసీఎస్) ఒప్పందం కుదుర్చుకుంది. బీఎస్సీ కోర్సులో కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్‌నెంటివ్ సిస్టమ్స్‌ను కోర్సుగా ప్రవేశపెట్టింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు టీసీఎస్ సంస్థలో ఉద్యోగులకు ఉండాల్సిన స్కిల్స్‌ను బోధనాంశాలుగా చెబుతున్నారు. కోర్సు పూర్తయిన తర్వాత వారిలోని ప్రతిభ ఆధారంగా టీసీఎస్‌లోనే ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన వారు ఇప్పుడు ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతున్నారు. డిగ్రీ అయిన వెంటనే వారికి ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయి.

- బీఎస్సీలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ చదివిన విద్యార్థుల కోసం గోద్రెజ్ ఆగ్రో వెట్ సంస్థ కూడా ఈ కళాశాలతో ఒప్పందం చేసుకుంది. ఈ కోర్సు చదివిన వారికి ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలలో వీరికి ప్రాధాన్యత ఇస్తారు. ఆ సంస్థ వారే అధ్యాపకులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. అప్పుడప్పుడు ఆ సంస్థలోని ఉద్యోగులే కళాశాల తరగతి గదికి వచ్చి విద్యార్థులతో మాట్లాడి యువతలో స్కిల్స్‌ను పెంపొందిస్తున్నారు.
- జగ్గయ్యపేటలోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీతో కూడా సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఒప్పందం చేసుకుంది. విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌తో పాటుగా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, చదువు పూర్తయిన తర్వాత వారిలోని నైపుణ్యాలను బట్టి వారికి ఉద్యోగాలను ఆ కంపెనీలో కల్పిస్తారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



పమిడిముక్కల: మంటాడ లంకపల్లి రహదారిలో కపిలేశ్వరపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డిపాలెంకు చెందిన చీరపు మణికంఠ (30) మృతిచెందాడు. ఉయ్యూరు వైపునకు చెరకులోడుతో వెళుతున్న ట్రాక్టరు అదే దిశలో బైకుపై వెళుతున్న మణికంఠను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడు తాపీ పని చేస్తుంటాడని, భార్య కుమారుడు, కుమార్తె ఉన్నట్టు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆరవ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో విద్యార్థుల కేరింతలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే విధంగా యువత తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చాన్సలర్ పద్మభూషణ్ డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ అన్నారు. స్థానిక రమేష్ ఆసుపత్రి రోడ్డులో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) కళాశాల ఆరవ స్నాతకోత్సవం కళాశాల ఆవరణలో గురువారం జరిగింది. విజయ్ కుమార్ సరస్వత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత నిత్యం సృజనాత్మకతతో పాటుగా చేస్తున్న పనిపై ఆసక్తి ఉత్సాహంగా చేయడం ద్వారానే మెరుగైన ఫలితాలు పొందుతారన్నారు. యువత సమస్యలను చూసి ఏమాత్రం బెదరకుండా వాటిని చాలెంజ్‌గా తీసుకోవాలని, అప్పుడే విజయం సొంతం అవుతుందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ డాక్టర్ వీరేంద్రకుమార్ పాల్ మాట్లాడుతూ సాంకేతికంగా వస్తున్న మార్పులను యువత తెలుసుకుంటూ ఉండాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, మెషిన్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో వస్తున్న మార్పులపై యువత ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. స్పా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ దేశ ప్రగతికి తోడ్పడేందుకు నిర్మాణ రంగం కట్టుబడి ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా స్పా కళాశాల విద్యార్థులు వివిధ పోటీల్లో సాధించిన విజయాల గురించి వివరించారు. మొత్తం 430 మంది గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు వారి డిగ్రీ రివార్డులను అతిథులు అందజేశారు.

కృష్ణా జిల్లాలో ఎనిమిది మంది ఎస్‌ఐలు బదిలీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాలో ఎనిమిది మంది సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ పి.జాషువా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా వెంటనే వారి వారి స్టేషన్‌లలో బాధ్యతలు స్వీకరించాలని ఎస్పీ ఆదేశించారు.

22 మంది పోలీసు సిబ్బందికి బదిలీలు

జిల్లా పోలీసుశాఖలో 22 మంది పోలీసులకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ పి.జాషువా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఇద్దరు ఏఎస్‌ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉండగా మిగిలిన 17 మంది పీసీలు. బదిలీ అయిన వారంతా వెంటనే వారికి కేటాయించిన స్టేషన్‌లకు వెళ్లి విధులకు హాజరుకావాలని ఎస్పీ ఆదేశించారు. బదిలీ అయిన వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత స్టేషన్	బదిలీ ప్రాంతం
టి.సూర్యశ్రీనివాస్	హనుమాన్‌జంక్షన్–1	ఆత్కూరు పీఎస్
వై.దుర్గారావు	కలిదిండి పీఎస్ – 1	గన్నవరం ట్రాఫిక్
కె.ఉషారాణి	స్పెషల్‌బ్రాంచ్, కృష్ణా	పెనమలూరు పీఎస్–2
జీవీ మురళీకృష్ణ	వీఆర్, కృష్ణా	గన్నవరం ట్రాఫిక్
డి.సందీప్	చల్లపల్లి	కూచిపూడి పీఎస్
కె.మాణిక్యాలరావు	వీఆర్	గుడివాడ 1 టౌన్
ఇ.సత్యనారాయణ	వీఆర్	గన్నవరం యూపీఎస్–2
టి.తిరుమలరావు	వీఆర్	ఉయ్యూరు రూరల్–2

ఈడుపుగల్లు జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సస్పెన్షన్

- ఐదుగురు ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు జారీ
- ఈనెల 7న హైస్కూలును తనిఖీ చేసిన పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

కంకిపాడు/పెనమలూరు: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇన్‌చార్జి హెచ్‌ఎంను సస్పెండ్ చేయగా, ఐదుగురు ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే...కంకిపాడు మండలం ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈనెల 7వ తేదీన సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల ప్రగతి నివేదికలను తనిఖీ చేశారు. వర్క్‌బుక్స్, అభ్యసనాభివృద్ధి అంశాల్లో ఉపాధ్యాయులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు గుర్తించిన ప్రవీణ్‌ప్రకాష్ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానాను ఆదేశించారు. డీఈఓ శాఖాపరమైన విచారణ నిర్వహించి, ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠ్యాంశాల మూల్యాంకనం, వర్క్ బుక్స్ పరిశీలనలో అలసత్వం ప్రదర్శించిన గణిత ఉపాధ్యాయులు ఎం.మాధవి, ఎస్.శ్రీలత, తెలుగు ఉపాధ్యాయుడు అంబాజీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు అరుణకుమారి, ఎస్ఎస్ ఉపాధ్యాయుడు ఎన్.రాఘవరావుకు చార్జ్‌మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు.

కొనసాగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు



నాలుగు పళ్ల విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్న ఎడ్ల జత

గుడివాడటౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కే కన్వెన్షన్ నగర్‌లో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా జరిగిన నాలుగు పళ్ల విభాగంలో పుచ్చకాయల శేషాద్రి చౌదరి మొదటి బహుమతి రూ.35 వేలను, రామినేని రత్తయ్య చౌదరి, నల్లూరి శ్రీనివాసరావుల జత రెండో బహుమతి రూ.30 వేలను, వల్లభనేని మోహనరావు జత మూడో బహుమతి రూ.25 వేలను, ఉమ్మారెడ్డి శ్రీదేవి జత నాల్గో బహుమతి రూ.22 వేలను, పోతిన లక్ష్మీత్ చౌదరి జత ఐదో బహుమతి రూ.18 వేలను, కంబాల ఆదిలక్ష్మి జత ఆరో బహుమతి రూ.15 వేలను, వల్లభనేని మోహనరావు, కొడాలి రామారావుల జత ఏడో బహుమతి రూ.13 వేలను, గొల్లపూడి షణ్ముఖ సాయిప్రియ జత ఎనిమిదో బహుమతి రూ.10 వేలను, వెంకటగిరి హేమలతా నాయుడు జత తొమ్మిదో బహుమతి రూ.8 వేలను కైవసం చేసుకున్నాయి. నాలుగు పళ్ల విభాగంలో విజేతలైన ఎడ్లు పది ఘనపుటడుగుల బండను 15 నిముషాలలో 5,700 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి.

ఆరు పళ్ల విభాగంలో...

ఆరు పళ్ల విభాగం పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. పోటీలో 13 ఘనపుటడుగుల బరువు గల బండ లాగుడు పోటీల్లో పుచ్చకాయల శేషాద్రి చౌదరి, బత్తుల చిన్నబ్బాయి యాదవ్, బత్తుల పద్మావతి యాదవ్ జత మొదటి బహుమతి రూ.40 వేలను, ముంద్రు మల్లయ్య అండ్ బ్రదర్స్, ముంద్రు జీవన్ ప్రసాద్ జత రెండో బహుమతి రూ.35 వేలు, బత్తుల చిన్నబ్బాయ్ యాదవ్, బత్తుల పద్మావతి యాదవ్ జత మూడో బహుమతి రూ.30 వేలు, పమిడి అంజయ్య చౌదరి జత నాల్గో బహుమతి రూ.25 వేలు, సోమిశెట్టి ఆంజనేయులు, మోపర్తి నవీన్‌కుమార్ జత ఐదో బహుమతి రూ.22 వేలు, జొన్నలగడ్డ దేవతాతారావు, యదుర్ల శ్రీనివాస్‌ల జత, వెంకటగిరి హేమలతా నాయుడుల జత ఆరో బహుమతి రూ.18 వేలు, అభిరామ్, సుఖవాసి సతీష్‌ల జత ఏడో బహుమతి రూ.15 వేలు, కొప్పుల శ్రీనివాసరెడ్డి, హేమలతారెడ్డి జత ఎనిమిదో బహుమతి రూ.13 వేలు, జొన్నలగడ్డ దేవతాతారావు, శాఖమూరి రామకోటయ్య జత తొమ్మిదో బహుమతి రూ.10 వేలు కైవసం చేసుకున్నాయి.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గవర్నర్ పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ స్వర్ణోత్సవ నగర మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై విపరీతమైన పనిభారాన్ని పెంచుతుందన్నారు. వివిధ విభాగాల్లో యూనియన్‌ను విస్తరిస్తామని చెప్పారు. మహాసభలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు బాబూరావు, నాయకులు టి.ప్రవీణ్, జ్యోతిబసు, తిరుపతమ్మ, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్ళే లలిత విగ్రహావిష్కరణ



లలిత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న భూలక్ష్మి

విజయవాడ స్పోర్ట్స్: నగర ప్రముఖురాలు కళ్ళే లలిత ప్రథమ వర్ధంతిని సింగ్‌నగర్‌లో గురువారం నిర్వహించారు. కళ్ళే లలిత విగ్రహాన్ని ఆమె భర్త నాగేశ్వరరావు ఏర్పాటు చేశారు. వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న లలిత స్నేహితురాలు బి.భూలక్ష్మి చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రారంభించారు. మంచికి, స్నేహానికి మారుపేరుగా లలిత ఉండేదని ఆమె స్నేహితురాళ్లు, బంధువులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో లలిత కుమార్తెలు సీతామహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి, అల్లుళ్ల హరీష్, కిరణ్‌కుమార్, నూతన్‌కుమార్, ప్రముఖులు పాల్గొన్నారు.

సోనోవిజన్‌లో టీసీఎల్ గూగుల్ టీవీ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీసీఎల్ తమ వినియోగదారుల కోసం మార్కెట్‌లోకి తీసుకువచ్చిన సరికొత్త గూగుల్ టీవీని సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి ఆవిష్కరించారు. ఏలూరు రోడ్డులోని సోనోవిజన్ విజయప్లాజాలో గురువారం టీవీని ఆవిష్కరించారు. కంపెనీ ప్రతినిధులు గూగుల్ టీవీ ఫీచర్స్‌ను వివరించారు. గూగుల్ టీవీ 32 అంగుళాలు, 43, 55, 65, 75 అంగుళాలు ఆపై సైజుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, షోరూం మేనేజర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్ చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట వాగు సెంటర్‌కు చెందిన కురెంద దావీదు కూలీ పనులు చేస్తుంటాడు. ఈ నెల 8న మోపెడ్‌ను ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూసే సరికి మోపెడ్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

పటమట(విజయవాడతూర్పు): మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. పటమట నల్లూరివారి కల్యాణ మండపంలో హెల్త్ ఆస్పత్రి, ఈజోన్ సెక్యూరిటీస్ సహకారంతో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్, ఉమెన్ ఎంపైర్ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వారి పండుగైన సంక్రాంతి ప్రకృతిని ఆరాధించే పర్వదినమని, ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికి చేరినందుకు భూమిపుత్రులు సంతోషంగా నిర్వహించుకునే అతిపెద్ద పర్వదినమన్నారు. పోటీలకు వీరంకి భారతీదేవి, హెల్త్ ఆస్పత్రి ప్రతినిధులు చలపాటి జయంత్, పృథ్వీ, ఈజోన్ ప్రతినిధులు చలపాటి లలితాదేవిలు పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మాగంటి అనురాధ, అజయ్ పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

గుణదల(విజయవాడ తూర్పు): భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఆంధ్రలయోల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్ జేవియర్ అన్నారు. కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు పండుగల్లో సంక్రాంతికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ పండుగకు అందిరి ఇళ్లు పాడి పంటలతో, సిరి సంపదలతో ఉంటాయన్నారు. పిండి వంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలతో సంక్రాంతి పండుగ కనుల విందుగా ఉంటుందని తెలిపారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు సంప్రదాయాలపై అవగాహన కల్పించే దిశగా కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతో సందడి చేశారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ అనిల్, ఫాదర్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిటిజన్స్ స్కూల్‌లో..

గురునానక్ నగర్‌లోని సిటిజన్స్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు పండుగ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. హరిదాసు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు.



లయోల కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఫాదర్లు, విద్యార్థులు

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.లక్ష్మి మాట్లాడుతూ.. తెలుగు పండుగల విశిష్టతను తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్‌జాన్స్‌లో సంబరాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గంగిరెద్దుల విన్యాసాలు, హరిలో రంగ హరి అంటూ హరిదాసుల కీర్తనలు, భోగిమంటలు, పాల పొంగళ్లు, ముత్యాల ముగ్గులు, విద్యార్థుల విశేష వస్త్రాధారణలతో గురువారం మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్‌జాన్స్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగను కళ్లకు కట్టినట్లు పాఠశాల ప్రీ ప్రైమరీ, ప్రైమరీ చిన్నారులు ప్రదర్శించిన నృత్య కళారూపకం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్‌లు వేడుకల్లో పాల్గొని చిన్నారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.అరుణ, వైస్ ప్రిన్సిపాల్ వై.సీరజ, అకడమిక్ కో ఆర్డినేటర్ బి.పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిటిజన్స్ పాఠశాలలో విద్యార్థినుల సందడి



సంప్రదాయ దుస్తుల్లో సెయింట్‌జాన్స్ విద్యార్థులు

ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తం సేకరణే లక్ష్యం

కలెక్టర్ ఢిల్లీరావు



సంచార వైద్య వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డాక్టర్ సమరం తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏడాదికి 12 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సంచార వైద్య వాహనాన్ని గాంధీనగర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనం నుంచి కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోగుల సౌకర్యార్థం విజయవాడ సూర్యారావుపేటలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రెడ్ క్రాస్ సేకరించిన రక్తాన్ని మాత్రమే రోగులకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖను మరింత పటిష్ట పరచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా రెడ్ క్రాస్ సేవలను రోగులకు చేరువ చేయాలన్నదే తన లక్ష్యం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యూత్ రెడ్ క్రాస్‌ను ప్రోత్సహించి ప్రతి కళాశాలలోనూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. సంచార వైద్య వాహనం ద్వారా వైద్య బృందం జిల్లాలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించడంతో పాటు దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తామని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇళ్లా రవి, మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ టి.సునీత, రెడ్ క్లాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం



అవినాష్‌ను సత్కరిస్తున్న చర్చి నిర్వాహకులు

గుణదల(విజయవాడతూర్పు): లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదల అశోక్ గార్డెన్స్‌లో ఎం.ఎం.సెయింట్ జాన్స్ ఇవాంజలికల్ చర్చి నూతన మందిర ప్రారంభ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. తోటి వారితో సోదరభావం కలిగి నడుకోవాలని, జాలి, ప్రేమ, దయ వంటి సద్గుణాలను కలిగి ఉండాలని క్రీస్తు బోధించారని తెలిపారు. దేవుని పట్ల విశ్వాసంతో నడుచుకుంటే దీవెనలు లభిస్తాయని వివరించారు. అనంతరం నూతన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు అవినాష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ మిషన్ చర్చి డైరెక్టర్ ఎబినేజర్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

'బాబు విష కౌగిలికి చిక్కొద్దు'

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు విష కౌగిలిలోకి వెళ్లి మరోసారి మోసపోవద్దని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీహరి సూచించారు. చంద్రబాబుతో ఎన్నికలలో పొత్తు పెట్టుకొని పోటీ చేసిన ఏ రాజకీయ పార్టీని ఆయన తరువాత పట్టించుకోలేదని, ఆ పార్టీల వైపు కనీసం కన్నెత్తి చూడలేదని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ పాలనలోనే కాపులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. నాటి వంగవీటి మోహనరంగా హత్య నుంచి ఇటీవల ముద్రగడ పద్మనాభం అవమానాల వరకూ టీడీపీ పాలనలోనే జరిగాయని అందరూ గుర్తించాలన్నారు. కాపులకు రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేని విధంగా కాపులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వివరించారు. నేడు కాపు జపం చేస్తున్న చంద్రబాబుకు గతంలో ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. నేడు తమకులానికి ఏదో చేస్తామని భ్రమలో పెట్టే ప్రయత్నాలను కాపులు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పటమట(విజయవాడతూర్పు): ప్రతి విద్యార్థి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, విద్యతో ఇతరాత్ర పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి అన్ని రంగాలపై పట్టు సాధించాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. పటమట ఎన్ఎస్ఎం స్కూల్‌లో గురువారం స్కూల్ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్నతనం నుంచే దేశంలోని వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నతమైన విలువలతోనే దేశ భవిష్యత్తు నిర్మించుకోగలమని చెప్పారు. అనంతరం ఆయన గతేడాది పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు, బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన అవర్ ఇండియా అవర్ ప్రైడ్ నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మోంటీ, పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర పరేడ్‌కు తేజస్వీకి ఆహ్వానం



తేజస్వీకి అభినందనలు తెలుపుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాకు చెందిన డాక్టర్ బాణావతు తేజస్వీకి న్యూ ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో కలిసి వీక్షించే అవకాశం రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ తేజస్వి గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి బాక్స్ నుంచి గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరిలో నగరంలోని గుణదల ఎన్టీఆర్ కాలనీకి చెందిన డాక్టర్ తేజస్విని ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తేజస్వీ ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 6 గోల్డ్ మెడల్స్ అందుకున్నారని చెప్పారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా, తల్లి సామాన్య గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దారన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి పద్మజ చెప్పారు. గురువారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం యువ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే సందర్భంగా విశాలాంధ్ర రోడ్డులో శాతవాహన కళాశాల గ్రౌండ్‌లో ఏరోబిక్ ఎక్సర్‌సైజ్, మెడిటేషన్ కార్యక్రమం జరిగింది. పద్మజ మాట్లాడుతూ సమాజానికి, దేశానికి, ప్రపంచానికి యువత ఆదర్శవంతంగా ఉంటూ వారు ఎంచుకున్న రంగంలో అభివృద్ధి సాధించాలన్నారు. నిత్యం యోగా, ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందడంతో పాటు శరీరం, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు. సంస్థ ప్రతినిధులు భారతి, సూర్యచంద్ర కుమారి, రత్నకుమారి పాల్గొని యువతీ యువకులతో వ్యాయామం, ధ్యానం చేయించారు. అనంతరం యువతకు సర్టిఫికెట్లను అందజేశారు.

రేపు త్రిశక్తి పీఠంలో విశేష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో వేంచేసి ఉన్న శ్రీకాళీమాత, శ్రీమహాలక్ష్మీ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు శనివారం ఉదయం 10 గంటలకు విశేష పుష్పార్చన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు వివిధ పుష్పాలను(బంతిపూలు మినహా) శుక్రవారం రాత్రి 8 గంటల లోపు దేవస్థానంలో సమర్పించి అమ్మవార్ల సేవలో పాల్గొనాలని కోరారు.

వివాహిత అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లపూడి సారాకొట్టు సెంటర్‌కు చెందిన బుద్దుల నానిబాబు, అరుణ దంపతులు. నానిబాబు ఆటో డ్రైవర్‌గా, అరుణ క్రాస్ రోడ్ హోటల్‌లో పనిచేస్తోంది. ప్రతి రోజు మధ్యాహ్నం 3. 30 గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తుంది. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో అరుణ భర్త నానిబాబు ఆటో నడిపేందుకు వెళ్లాడు. 10.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. చుట్టుపక్కల వారిని ఆరా తీశాడు. అయినప్పటికీ ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

• నగరంలో సంక్రాంతి సందడి



నగరంలో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. భవానీ ఐలాండ్‌తో పాటు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వేడుకలు ఆకట్టుకుంటున్నాయి. నిత్యం బిజీగా ఉండే యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.





• శరవేగంగా అంబేడ్కర్ స్మృతివనం పనులు



నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటు చేసే బూట్లు ఢిల్లీ నుంచి నగరానికి గురువారం చేరుకున్నాయి. సుమారు పది అడుగులకు పైగా ఎత్తుండే ఈ బూట్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





• పల్లెకు పయనం

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలు పల్లె బాట పట్టడంతో విజయవాడ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...

ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...



* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.


వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



● మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.

● పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!

● గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్

డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..



డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

\- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

\- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదరగొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

● చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.

● బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.

● ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడదని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.

● ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

\- బాలకృష్ణ


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

\- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.